www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ సిటీ*

పేజీలు: 16 + 20 + 32
పేజీల ఆదివారం అనుబంధం

వెల: రూ. 8.00

ఆదివారం | 3-2-2019

సంపుటి: 15
సంచిక: 206

శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి రా. 11.53 తదుపరి అమావాస్య; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 2.56 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ. 8.55-10.43; దుర్ముహూర్తం: సా. 4.37-5.22; అమృతఘడియలు: రా. 7.43-9.31; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.07

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai




సండే స్పెషల్

ప్రతి వారం సాహస విహారం!

రొటీన్ లైఫ్‌కు విరామం

ట్రెకింగ్‌తో ఉపశమనం

పర్యాటకంలో కొత్తదనం



5

● ఓ విజేత ఆత్మకథ -సండే మ్యాగజైన్‌లో

ఆరు నెలలపాటు నన్ను భయపెట్టి తన మానాన తాను వెళ్లిపోయింది కేన్సర్. వెళుతూ వెళుతూ గొప్ప పాఠాలు నేర్పింది. అవి.. ఆరోగ్యమే మహాభాగ్యం. జీవితంలో ఏ వయసు వారైనా సరే ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. శరీరం అందించే సంకేతాలను అర్థం చేసుకోవాలి. వ్యాయామంపై అశ్రద్ధ వద్దు. సాధ్యమైనంత వరకూ ఆందోళనలకూ, ఒత్తిళ్లకూ దూరంగా ఉండాలి. ఒత్తిడి కూడా కేన్సర్ కారకమే. కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలి. కేన్సర్ మరణశాసనం కాదు. దాన్ని ఎదిరించి జీవించొచ్చు. నాకు పోరాట పటిమనిచ్చిన కేన్సర్‌కు కృతజ్ఞతలు. -మనీషా కొయిరాలా

వీరప్పన్ వారసులు

అడవుల్లో టేకు చెట్లే వీరి టార్గెట్

ఆ క్రమంలోనే పులులపైనా గురి

అక్రమ రవాణాకు ప్రత్యేక కారిడార్

ఆదిలాబాద్‌లో వెయ్యి కుటుంబాలు

పరివర్తన కోసం సర్కారు ప్రయత్నం



5



15

వన్డే క్రికెట్ ర్యాంకింగ్స్‌లో

స్మృతి నంబర్ 1

చందా దందా

ఇది సీపీఎం మార్క్ 'అభ్యుదయం'

వాటాదార్లకు తెలియకుండానే చేతులు మారిన టెన్ టీవీ

మార్క్సిస్టుల ఉద్యమ వ్యాపారం.. కంపెనీల రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు

2012లో టీవీ చానల్ ఏర్పాటు

కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నుంచి వసూళ్లు

మూడేళ్ల తర్వాత లాభాలు పంచుతామని అప్పట్లో హామీ

ఇప్పుడు ఏకంగా చానల్ విక్రయం

సొమ్ము రియల్టీకి మళ్లింపు

గప్‌చుప్‌గా ఆర్థిక లావాదేవీలు

ఒక్కసారీ సర్వసభ్య సమావేశం లేదు

దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలి

ఆర్వోసీకి వాటాదారుల ఫిర్యాదు



'నిబద్ధత' ప్రశ్నార్థకంగా మారింది! 'అభ్యుదయం' ఆర్థిక వ్యవహారాల్లో ఆవిరై పోయింది. ప్రజా ఉద్యమాలతో పాలకులను నిలదీసే కమ్యూనిస్టు యోధులే 'కార్పొరేట్ కుంభకోణం'లో చిక్కుకున్నారు. కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల నుంచి 'విరాళాలు'గా వసూలు చేసి పెట్టిన 'టెన్ టీవీ' వార్తా చానల్‌ను, వాటాదారులకు తెలియకుండానే అమ్ముకున్నారని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు ఫిర్యాదు అందింది. వాటాదారుల సొమ్మును ఇతర కార్యకలాపాల కోసం మళ్లించారని ఆరోపణలు వచ్చాయి.

"షేర్ హోల్డర్లను మోసం చేశారు. నమ్మక ద్రోహానికి పాల్పడ్డారు. ఉద్దేశపూర్వకంగానే సమాచారాన్ని దాచిపెట్టారు. వాటాల ద్వారా సేకరించిన సొమ్మును దారి మళ్లించారు. సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా కంపెనీ చట్టాన్ని ఉల్లంఘించారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి"

-రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు అందిన ఫిర్యాదు

"ఇది అగ్రిగోల్డ్, సహారా, శారదా చిట్‌ఫండ్ స్థాయి కుంభకోణం! రెండు రాష్ట్రాల్లో రెండు లక్షల కుటుంబాలకు సంబంధించిన సమస్య"

-వాటాదారుల ఆక్రోశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మార్క్సిస్టులు ఎన్ని ఉద్యమాలు చేసినా ప్రజల్లోకి వెళ్లడంలేదు. ఉద్యమవాణిగా మనకంటూ ఒక సొంత చానల్ ఉండాలి' అని సీపీఎం రాష్ట్ర నాయకత్వం భావించింది. 2012లో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బీవీ రాఘవులు ఉన్న సమయంలో '10 టీవీ' అనే వార్తా చానల్‌ను ప్రారంభించారు. దీనికోసం 'అభ్యుదయ బ్రాడ్‌కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. చానల్ ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులు సమీకరించేందుకు రాఘవులు అనుమతిచ్చారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సంకరపు వెంకటరావు, ముదునూరు అక్షయ్ కుమార్ దత్, మందడపు సాయిబాబును డైరెక్టర్లుగా నియమించారు. ముషీరాబాద్‌లోని ప్రజా నాట్యమండలి భవనంలో రిజిస్టర్డ్

మిగతా 13వ పేజీలో...

ఉపాధ్యాయ పదోన్నతులకు పచ్చజెండా

ఫైలుకు ఆర్థిక శాఖ ఆమోదం

పండిట్లు, ఎస్జీటీ, ఎస్‌ఏలకు ఊరట

సీఎంకు ఫైలు సమర్పించనున్న ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ పాతూరి

కేసీఆర్ సంతకం చేయగానే ఉత్తర్వు

సుమారు 15 వేల మందికి లబ్ధి

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో పదోన్నతుల ప్రక్రియలో అధికారులు వేగం పెంచారు. ఇందులో భాగంగానే పండిట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల ప్రక్రియకు ఆర్థిక శాఖ శనివారం ఆమోదం తెలిపింది. పండిట్లకు పదోన్నతులతో పాటు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు మేనేజ్‌మెంట్ల (పంచాయతీరాజ్, ప్రభుత్వ) వారీగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఫైలు కూడా సాధారణ పరిపాలన విభాగాని (జీఏడీ)కి వెళ్లినట్లు

మిగతా 13వ పేజీలో...

ఈ వారమే విస్తరణ!

7న మధ్యాహ్నం తర్వాత ముహూర్తం

లేకపోతే 8వ తేదీ ఉదయం ఉండొచ్చు



టీఆర్ఎస్ శ్రేణుల్లో విస్తృత ప్రచారం

మాదిగ వర్గానికి డిప్యూటీ స్పీకర్?

కొప్పుల ఈశ్వర్‌కు మంత్రి పదవి

మండలి చైర్మన్‌గా సురేశ్‌రెడ్డి?

కాదనుకుంటే రాజ్యసభ పదవి

హామీలు బడ్జెట్‌లో ప్రతిబింబించాలి

సాగునీటి ప్రాజెక్టులకు కొరత ఉండొద్దు

అధికారులతో సమీక్షలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు వేళైందా? సీఎం కేసీఆర్ ముహూర్తం కూడా ఖరారు చేశారా? ఈ ప్రశ్నలకు టీఆర్ఎస్ ముఖ్యుల నుంచి 'ఔను' అనే సమాధానం వస్తోంది. ఈ నెల 10వ తేదీలోపే కేబినెట్ విస్తరణ ఉంటుందని వారు నమ్మకంగా చెబుతున్నారు. ఈ నెల 7న మధ్యాహ్నం తర్వాత, లేకపోతే 8వ తేదీ ఉదయం విస్తరణ ఉంటుందని పార్టీకి చెందిన చాలా మంది ముఖ్యులు భావిస్తున్నారు. ఏడెనిమిది తేదీల్లో

మిగతా 2వ పేజీలో...

కొత్త నీరుకు గులాబీ దారులు

సంఘాల పదవుల నుంచి సీనియర్లు పక్కకు

మొన్న హరీశ్, నిన్న కవిత, రేపు నాయిని

పార్టీలో నూతన నాయకత్వానికి ప్రోత్సాహం

5

పెద్ద రైతుకు భూరి సాయం!

రాష్ట్రంలో చిన్న రైతులు 47 లక్షలు

వారి చేతిలో 90 లక్షల ఎకరాలు

5 లక్షల మంది పెద్ద రైతుల చేతిలో 50 లక్షల ఎకరాలు

ఒక్కొక్కరికి సగటున 80 వేలు

రైతుబంధు పెంపుతో లక్షకు చేరిక

చిన్న రైతుకు సగటున 15,319



6

రాష్ట్రంలో 47 లక్షల మంది చిన్న రైతుల చేతుల్లో ఉన్న భూమి 90 లక్షల ఎకరాలు! కేవలం 5 లక్షల మంది పెద్ద రైతులకు చెందిన భూమి 50 లక్షల ఎకరాలు!

గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి ప్రభుత్వం రైతు బంధు పథకం కింద ఎకరాకు రూ.8,000 చొప్పున రూ.11,200 కోట్లు పంపిణీ చేసింది. ఇందులో చిన్న రైతులందరికీ కలిపి చేరింది రూ.7,200 కోట్లు! కేవలం ఐదు లక్షల మంది పెద్ద రైతులకు దక్కింది రూ.4,000 కోట్లు!

రాష్ట్రంలో రైతు బంధు కింద సగటున ఒక్కో చిన్న రైతుకు అందిన సాయం రూ.15,319!! ఒక్కో బడా రైతుకు దక్కిన పెట్టుబడి 80 వేలు!

సీబీఐ కొత్త బాస్‌గా రిషి కుమార్ శుక్లా

మధ్యప్రదేశ్ మాజీ డీజీపీకి చాన్స్

మోదీ కమిటీ మెజారిటీ నిర్ణయం

వ్యతిరేకించిన మల్లికార్జున ఖర్గే

16

కర్కశ అమెరికా

మన పిల్లల కాళ్లకు రేడియో ట్రాకర్స్!



అమెరికా అధికారులు కాళ్లకు వేసే రేడియో ట్రాకర్

అనుమతి లేకుండా పరిధి దాటొద్దు

ట్రాకర్లు నిరంతరం చార్జి చేసుకోవాలి

ఎప్పుడు పిలుపొచ్చినా జవాబివ్వాలి

నేరగాళ్లుగా చూస్తున్న ట్రంప్ సర్కార్

కేసు తేలేదాకా ఫెడరల్ పోలీసు నిఘా

బుధవారానికి ఎక్కువమందికి ఊరట?

అమెరికాకు భారత్ నిరసన

మోసం చేసింది అక్కడి నకిలీ వర్సిటీయే

మా విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి

ఇష్టానికి వ్యతిరేకంగా భారత్‌కు పంపేయొద్దు

డీమార్ష్‌లో కోరిన భారత విదేశాంగ శాఖ

వాషింగ్టన్ ఎంబసీలో 24 గంటల హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఫిబ్రవరి 2: పే అండ్ స్టే వీసా కుంభకోణంలో నిర్బంధంలోకి తీసుకున్న వందమందికి పైగా భారతీయ విద్యార్థుల పట్ల అమెరికా చాలా కర్కశంగా వ్యవహరిస్తోంది. పోలీసు రికార్డులకెక్కిన తీవ్రస్థాయి నేరస్థులతో సమానంగా విద్యార్థులను పరిగణిస్తోంది. విద్యార్థుల చీలమండలకు ట్రాకర్లు కట్టి, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తోంది. వారికి

మిగతా 13వ పేజీలో...



పరంజ్యోతి

ఓం పాలకుల మంత్రాంగం ఎలా ఉండాలంటే..



అన్యోన్యం మతిమాస్థాయ యత్ర సంప్రతి భాష్యతే
నచైకమత్యే శ్రేయోస్తి మంత్రస్సోధమ ఉచ్యతే

..ఈమాట వాల్మీకి మహర్షి రావణుని ముఖతః చెప్పారు. రాజ్యపాలన చేసే పరిపాలకులెవరైనా తన మంత్రుల ఆలోచనలతో తన రాజ్యాన్ని ప్రజాసంక్షేమ రాజ్యంగా పాలించాలని దీని అర్థం. రాముడు లంకపైకి దండెత్తిరాబోతున్నాడు. సీతాన్వేషణ చేస్తూ హనుమంతుడు లంకలో చేసిన విధ్వంసం సామాన్యమైనదేమీ కాదు. అప్పుడు రావణుడు తన మంత్రులందరితో చర్చకు సిద్ధమై.. 'ఏ మంత్రులైనా సరే ఎవరి అభిప్రాయంలో వారుండి మరొకరి అభిప్రాయాన్ని అంగీకరించక, కేవలం మంకుపట్టుతో పిడివాదం చేస్తూ ఉండి ఏ మాత్రం ఐకమత్యం లేకుండా ప్రవర్తిస్తే అది అధమ మంత్రాంగం' అన్నాడు. ఏ పనినైనా నిర్వహించాలనుకున్నప్పుడు.. 'మంత్రః త్రిభిసంయుక్తః' ..అంటే సమర్థులైన హితులతో, సమాన ప్రయోజనాలు గల స్నేహితులతో, మేలుకోరే బాంధవులతో ఆలోచన చేసి కార్యాచరణకు ఉపక్రమించడమే ఉత్తమ మంత్రాంగమన్నాడు. ఆ విధంగా చేసిన పాలకుడే ఉత్తమపాలకుడు అని చెప్పాడు. ఇక.. ఎవరితోనూ సంప్రదించకుండా, కేవలం తన ప్రయోజనాన్ని మాత్రమే విమర్శించుకొని తానొక్కడే ప్రకృతి ధర్మాన్ని ఆశ్రయించుకొని కార్యనిర్వహణ చేస్తే అది మధ్యమ మంత్రాంగంగా వివరించాడు.

గుణదోషావనిశ్చిత్య త్యక్త్వా ధర్మ వపాశ్రయమ్
కరిష్యామీతియః కార్యము పేక్షత్ స నరాధమః

..ఎవడైతే మంచి, చెడులు ఆలోచించక ధర్మాన్ని విడిచి 'నేను మాత్రమే చేయుదున'ని పూనుకొని చేస్తాడో వాడు అధముడైన వ్యక్తి అని చెప్పాడు. ఇన్ని తెలిసి, ఇన్ని మాటలు చెప్పిన రావణాసురుడు తాను చేస్తున్న పని మాత్రం ఎంత నీచమైనదో ఆలోచించక.. సీతాపహరణం చేశాడు. ఫలితం అనుభవించాడు. సీతాపహరణ సందర్భంలో ఎవరి మాటా వినక తానొక్కడే చేసిన ఆ దుష్ట కార్యం లంకకు చేటు చేసింది. రావణుడు చేసిన ఈ దుష్కార్యం కారణంగా నష్టం కేవలం అతడికేగాక రాక్షసజాతికంతటికీ కలిగింది. అందుకే వాల్మీకి మహర్షి.. పరిపాలకులకు మంత్రాంగ విశిష్టతను ఇంత స్పష్టంగా చెప్పాడు. రావణునితోనే ఎందుకు చెప్పించాడంటే.. మంచి మాటలను కేవలం చెప్పడం వల్ల ఏమీ కాదని, వాటిని ఆచరణలో చూపితేనే సత్ఫలితాలుంటాయని సూచించడమే వాల్మీకి మహర్షి ఉద్దేశం. మంచిని ఆచరించనివాడు నశిస్తాడని దీని ద్వారా అర్థమవుతోంది. మానవుల్లో ఉత్తమ, మధ్యమ, అధములున్నట్టే కార్యనిర్వహణలోనూ ఈ మూడుస్థాయిలు ఉంటాయి. ఏ పాలకుడైనా ప్రజాసంక్షేమాన్ని కోరుకుంటే అధమస్థాయి ప్రవర్తనకు సిద్ధపడకుండా ఉండాలన్నది సారాంశం. అదే లోక సంక్షేమ కారకం.

-గన్నమరాజు గిరిజామనోహర బాబుడ



బడ్జెట్‌లో హామీలు ప్రతిబింబించాలి

- **సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండొద్దు**
- **అధికారులతో సమీక్షలో సీఎం కేసీఆర్ సూచనలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ప్రజలకు టీఆర్ఎస్ తరఫున ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆ హామీలన్నీ అమలు చేసే విధంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యంతర బడ్జెట్ రూపకల్పనపై ప్రగతి భవన్‌లో ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా బడ్జెట్ రూపకల్పనపై పలు సూచనలు చేశారు. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వాటికి నిధుల కొరత ఉండకుండా బడ్జెట్లో ప్రాధాన్యమివ్వాలని అన్నారు. ఇతర ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఆర్థిక సలహాదారు జి.ఆర్.రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదాద్రికి కేసీఆర్

15 నెలల తర్వాత పర్యటన.. ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన

- **బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై చర్చ**

హైదరాబాద్, యాదాద్రి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రంగా రూపుదిద్దుకుంటున్న యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సీఎం కేసీఆర్ ఆదివారం సందర్శించనున్నారు. దేశంలోనే అద్భుత ఆలయంగా, కృష్ణరాతి శిలలతో కళాశోభితంగా ఆవిష్కృతమవుతున్న ఈ క్షేత్రంలో.. దాదాపు 15 నెలల తర్వాత పర్యటించబోతున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి యాదగిరిగుట్టకు చేరుకుంటారు. కొండపై బాలాలయంలో స్వామి వారిని కేసీఆర్ దర్శించుకుంటారు. అనంతరం కొండపై ప్రధానాలయ విస్తరణ, పుష్కరిణి, ల్యాండ్ స్కేప్ గార్డెన్లు, పెద్దగుట్టపై టెంపుల్‌సిటీ లేవుట్, ప్రిసిడెన్షియల్ సూట్ నిర్మాణాల పురోగతిని పరిశీలిస్తారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. వీలైనంత త్వరగా గర్భాలయంలో స్వామి వారి దర్శనాలను కల్పించడానికి మార్గనిర్దేశం చేయనున్నారు. ఆలయ నిర్మాణం పూర్తికి గడువు, కావాల్సిన పూర్తిస్థాయి నిధులు, గర్భాలయ దర్శనాల ముహూర్తం, కొత్త ప్రాజెక్టులు, ఇతర అంశాలపై అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. టెంపుల్ సిటీ లేఅవుట్‌లో అతిథి గృహాల నిర్మాణానికి దాతలకు ప్లాట్స్ కేటాయింపుపై చర్చించి డోనర్ పాలసీని ప్రకటించే అవకాశాలున్నాయి. త్వరలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. కేసీఆర్ యాదాద్రి పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు గాను.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ రూ.650 కోట్లు విడుదల చేసింది. పూర్తిస్థాయిలో పనులకు మరో రూ.500 కోట్లు అవసరమని అధికారులు భావిస్తున్నారు. ఆలయ అభివృద్ధి కోసం సమీకరించిన భూములకు రూ.65 కోట్లు, ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు మరో రూ.400 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. బడ్జెట్‌లో ఈ నిధుల కేటాయింపు కోసం అధికారులతో సీఎం సమీక్షించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. కాగా, సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో.. కొండపై కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

నాడు బానిసలు.. నేడు ప్రజాప్రతినిధులు

- **అప్పు తీర్చడానికి బీసీల వద్ద ఊడిగం**
- **ఉపసర్పంచ్, వార్డు సభ్యులుగా గెలుపు**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముందు తరాలు చేసిన అప్పులను తీరలేక బానిసలుగా మారి.. ఎన్జీవో సాయంతో బయటపడిన ముగ్గురు చెంచులు ప్రజాప్రతినిధులు అయ్యారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ జిల్లా అమరగిరి గ్రామంలోని చెంచు జాతికి చెందిన గిరిజనులు 23 ఏళ్ల మల్లయ్య ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. కురుమల్ల దేవమ్మ, అంజమ్మ ఏకగ్రీవంగా వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. శనివారం మల్లయ్య ఉపసర్పంచిగా ప్రమాణస్వీకారం చేశారు. తాను చదువుకున్నానని, కానీ... తాత చేసిన అప్పును తీర్చడానికి బాండెడ్ లేబర్‌గా మారాల్సి వచ్చిందని తెలిపారు. అమరగిరిలోని కొన్ని బీసీ వర్గాలు చెంచులకు అప్పులిస్తూ వారిని బానిసలుగా మార్చుకుంటున్నాయి. రూ.30 వేల అప్పును తీర్చలేక చెంచులు బానిసలుగా మారుతున్నారు. నేషనల్ ఆదివాసి సెక్యూరిటీ కౌన్సిల్(ఎన్ఏఎస్‌సీ) అనే స్వచ్ఛంద సంస్థ.. 2016లో 100 మంది గిరిజనులను విముక్తులను చేసింది. అందులో మల్లయ్య, దేవమ్మ, అంజమ్మ కూడా ఉన్నారని ఎన్ఏఎస్‌సీ ప్రతినిధి మహేష్ తెలిపారు.

కుర్చీలో సర్పంచ్!

- **కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు**
- **12,680 మంది సర్పంచులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల పాలన మళ్లీ ప్రారంభమైంది. పాలకవర్గాలు రద్దయిన 6 నెలల తరువాత తిరిగి నూతన పాలకవర్గాలు శనివారం కొలువుదీరాయి. రాష్ట్రంలో 12,680 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, 1,12,640 మంది వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు తొలి సమావేశం నిర్వహించడం ద్వారా తమ పాలనను ప్రారంభించారు. పలు చోట్ల ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొందరు సర్పంచులు ముహూర్తాల పేరుతో శనివారం బాధ్యతలు స్వీకరించలేదని సమాచారం. శనివారం పదవీ బాధ్యతలు చేపట్టిన 12,680 గ్రామ పంచాయతీల సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు 2024 ఫిబ్రవరి 1వ తేదీ వరకు పదవుల్లో కొనసాగనున్నారు. ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికైన సర్పంచ్‌పై అవిశ్వాసాని కి అవకాశం లేదు. అయితే, పదవి, నిధుల దుర్వినియోగం, అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే సంబంధిత సర్పంచ్‌లను సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్లకు ఉంది. వార్డు సభ్యుల మద్దతుతో ఎన్నికైన ఉప సర్పంచ్‌పై నాలుగేళ్ల తర్వాత అవిశ్వాసం పెట్టే వీలుంది. కాగా రాష్ట్రంలో కొత్తగా 4 వేలకు పైగా పంచాయతీలు కొత్తగా ఏర్పడిన విషయం తెలిసిందే. అంతకుముందున్న 8684 పంచాయతీల నుంచి కొన్నింటిని విడదీసి కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేశారు.

ఈ వారమే విస్తరణ!

(మొదటిపేజీ తరువాయి)

మాఘ మాసం తదియ తిథితోపాటు పూర్వాభాద్ర నక్షత్రమని, కేసీఆర్ పేరిట తారా బలం కూడా బాగుందని వివరిస్తున్నారు. కచ్చితమైన తేదీ, సమయాన్ని సీఎం కేసీఆర్ నిర్ణయించాల్సి ఉందని అంటున్నారు. ఈ నెల 18న పదిహేనవ ఆర్థిక సంఘం ప్రతినిధులు రాష్ట్రానికి వస్తున్నారు. వారితో చర్చలు జరపడానికి రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్థిక మంత్రి లేరు. అదే విధంగా ఈ నెల చివర్లో శాసన సభ బడ్జెట్ సమావేశాలు మొదలు కానున్నాయి. శాసనసభలో సమన్వయానికి శాసనసభా వ్యవహారాల మంత్రి లేరు. మంత్రివర్గ విస్తరణ లేకుంటే సీఎం కేసీఆర్ లేదా హోంమంత్రి మహమూద్ అలీ బడ్జెట్ సమర్పణ చేయాల్సి ఉంటుంది. ఈ రెండింటికోసమైనా సాధ్యమైనంత త్వరగా మంత్రివర్గాన్ని విస్తరించాల్సి ఉంటుందని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత గత ఏడాది డిసెంబరు 13న ముఖ్యమంత్రిగా కేసీఆర్, మంత్రిగా మహమూద్ అలీ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. మరో 16 మందిని కేబినెట్‌లోకి తీసుకునే వీలుంది. అయితే, డిసెంబరు నెలాఖరులోపు తొలి దఫా విస్తరణ ఉంటుందని, ఆరు నుంచి ఎనిమిది మందిని కేబినెట్‌లోకి తీసుకుంటారని, లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి విస్తరణ ఉంటుందని టీఆర్ఎస్‌లో ప్రచారం జరిగింది. కానీ, ఫిబ్రవరి మొదటి వారంలోకి అడుగు పెట్టినా విస్తరణపై అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో, కేబినెట్ విస్తరణ తేదీ, మంత్రి పదవులు ఎవరికి దక్కుతాయనే విషయంలో రకరకాల అంచనాలు మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సీఎం కేసీఆర్ తన కేబినెట్ మొదటి దఫా విస్తరణకు ముహూర్తం ఖరారు చేసినట్లుగా టీఆర్ఎస్ శ్రేణుల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ శాఖల ఏకీకరణ తర్వాతే కేబినెట్ విస్తరణ చేయాలని సీఎం భావిస్తున్నారని ఆయన సన్నిహిత శిబిరంలోని ముఖ్యులు చెబుతున్నారు. శాఖల ఏకీకరణకు కొంత సమయం పట్టే అవకాశం ఉందంటున్నారు. ఇదిలావుంటే, సీఎం కేసీఆర్ ఇప్పటివరకు కేబినెట్ విస్తరణ తేదీ, ఎవరికి మంత్రి పదవులు ఇవ్వాలనే విషయంలో ఇప్పటివరకు తన మనోగతాన్ని బయటికి వెల్లడించలేదని తెలుస్తోంది.

ఎందరు? ఎవరు?

తొలి విడత కేబినెట్ విస్తరణలో ఎంత మందికి, ఎవరికి చోటు లభిస్తుందనే అంశంపై టీఆర్ఎస్ అధిష్ఠానం ముఖ్యుల్లోనూ స్పష్టత లేదు. ఆరు నుంచి 10 మంది వరకు మంత్రులను కేబినెట్‌లోకి తీసుకునే వీలుందని అంటున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే, నిజామాబాద్ నుంచి వేముల ప్రశాంత్‌రెడ్డి, హైదరాబాద్ నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహబూబ్‌నగర్ నుంచి నిరంజన్‌రెడ్డి, వరంగల్ నుంచి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కరీంనగర్ నుంచి కొప్పుల ఈశ్వర్‌కు మంత్రి పదవులు పక్కా అంటున్నారు. నల్గొండ జిల్లా నుంచి గుత్తా సుఖేందర్‌రెడ్డి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. ఎస్టీ కోటాలో వరంగల్ జిల్లాకు చెందిన రెడ్యానాయక్‌కు మంత్రి పదవి దక్కితే, మెదక్ జిల్లా నుంచి పద్మా దేవేందర్‌రెడ్డికి చోటు లభిస్తుందని అంటున్నారు.

పలువురికి ఎమ్మెల్సీ పదవులు ఖాయం!

వివిధ కేటగిరీల కింద ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ పదవులను ఎవరికి కట్టబెట్టాలనే విషయంలో టీఆర్ఎస్ అధిష్ఠానం ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీలో కొనసాగుతూ పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న చాలా మంది ఎమ్మెల్సీల సభ్యత్వాలను రెన్యువల్ చేయటం, ఎన్నికలు జరిగే చోట్ల సిటింగ్‌లకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో పార్టీ పెద్దలు ఉన్నారని సమాచారం. శాసన మండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ ఎమ్మెల్సీగా త్వరలో పదవీ విరమణ చేయబోతుండగా, ఆయనను తిరిగి ఎమ్మెల్సీగా పోటీ చేయించకుండా, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల స్థానం నుంచి బరిలో దించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రాథమికంగా అందుతున్న సమాచారం ప్రకారం.. ఎమ్మెల్సీ పదవి ఖాయమైన వారిలో యెగ్గె మల్లేశం కురుమ, టీఎస్ఎండీసీ చైర్మన్, సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గాదరి బాలమల్లు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రముఖ కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ జి.దేవీప్రసాదరావులో ఒకరికి ఎమ్మెల్సీ పదవి ఖాయమంటున్నారు. మాజీ ఎమ్మెల్యేలు సత్యవతి రాథోడ్, కవితలో ఒకరికి ఎమ్మెల్సీ పదవి ఇస్తారని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన కొండా మురళి రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని బరిలో దించటం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్ కె.ఆర్.సురేశ్‌రెడ్డి పేరు ఎమ్మెల్సీ పదవితోపాటు, రాజ్యసభ సభ్యత్వానికీ వినిపిస్తోంది. సురేశ్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇస్తే.. ఆయనను స్వామిగౌడ్ స్థానంలో మండలి చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. అప్పుడు అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్ ఇద్దరూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు అవుతారు. ఇలా కుదరదనకుంటే, ఎస్సీ సామాజిక వర్గానికి మండలి చైర్మన్ పదవి దక్కే అవకాశాలున్నాయని అంటున్నారు. టీఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, మండలి డిప్యూటీ చైర్మన్ ముగ్గురూ బీసీ సామాజిక వర్గానికి చెందినవారే. దీనిని పరిగణనలోకి తీసుకుంటే, ఎమ్మెల్సీని చేయటమే కాక, సురేశ్‌రెడ్డి మండలి చైర్మన్ అయ్యే అవకాశాన్ని తోసిపుచ్చలేమని చెబుతున్నారు.

ఎస్సీకి డిప్యూటీ స్పీకర్?

అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని అధికార టీఆర్ఎస్ అధిష్ఠానం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. స్పీకర్ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావటంతో, ఎస్సీకి డిప్యూటీ స్పీకర్ ఇవ్వాలనుకుంటున్నట్లు సమాచారం. కేబినెట్‌లోకి మాల సామాజిక వర్గానికి చెందిన కొప్పుల ఈశ్వర్‌ను తీసుకోవటం దాదాపు ఖాయమైన పరిస్థితుల్లో.. మాదిగ వర్గానికి డిప్యూటీ స్పీకర్ పదవి కట్టబెడ్తారని, ఇందుకోసం పార్టీకి చెందిన అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం పేరును అధిష్ఠానం సీరియస్‌గా పరిశీలిస్తోందని సమాచారం.



తన సతీమణి భువనేశ్వరితో ఉల్లాసంగా మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు. చిత్రంలో లోకేశ్

నేను నిత్య విద్యార్థిని!

- **కొత్త విషయాలు నేర్చుకోవడంలో బెస్ట్**
- **అందుకే అనుకున్నవి సాధిస్తున్నా**
- **ఎన్టీఆర్ మోడల్ స్కూలు**

వార్షికోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త విషయాలు నేర్చుకోవడంలో తానే బెస్ట్ అని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. తాను నిత్య విద్యార్థినన్నారు. ఈ వయస్సులోనూ పిల్లలు కొత్త విషయాలు చెబితే 2 నిమిషాల్లో అర్థం చేసుకుని, వాటిని రాష్ట్రంలో అమలు చేయడం తన ప్రత్యేకత అని.. అందుకే అనుకున్న పనులు సాధించగలుగుతున్నానన్నారు. కొత్తగా ఏర్పడిన ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దబోతున్నామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా సర్వీస్‌ప్రొవైడర్లకు ఏపీ కేంద్ర బిందువుగా మారనుందన్నారు. శనివారం గండిపేటలో ఎన్టీఆర్ మోడల్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజకీయ నాయకులకు కూడా శిక్షణ ఉండాలని ఆలోచించిన తొలి నేత ఎన్టీఆర్ అన్నారు. పేద పిల్లలకు దేశంలోనే తొలిసారిగా గురుకుల విద్యను ప్రవేశపెట్టిన ఘనతా ఎన్టీఆర్‌దేనని చెప్పారు. సాధారణంగా రాజకీయ నాయకుల కుటుంబాల్లో చదువుకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వరని, తన కుటుంబం మాత్రం చదువుకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గండిపేటలోని ఎన్టీఆర్ మెమోరియల్ స్కూలులో తాను రాజకీయ తరగతులు చెప్పానని, స్కూలుకు తానే ఆ రోజు ప్రిన్సిపాల్ నని చమత్కరించారు. ఇంటర్నెట్ వచ్చిన తర్వాత విద్యార్థులే ఉపాధ్యాయులకు చదువు చెప్పే పరిస్థితి వచ్చిందని.. ఉపాధ్యాయులు కొత్త విషయాలు నేర్చుకోకపోతే మార్కెట్‌లో డిమాండ్ కోల్పోతారని వ్యాఖ్యానించారు. ఏపీలో వర్చువల్ క్లాస్‌రూంలు తీసుకురాబోతున్నామన్నారు. తెలుగుజాతికి మేధోసంపత్తిని సమకూర్చే లక్ష్యంతో ఐటీ రంగాన్ని ప్రోత్సహించానన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసిన బాబు: భువనేశ్వరి

తెలంగాణ, ఏపీల్లో భవిష్యత్తుకు చంద్రబాబు బాటలు వేశారని భువనేశ్వరి చెప్పారు. అంకితభావం, చిత్తశుద్ధితోనే ఇది సాధ్యమైందని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు కూడా చంద్రబాబులాగా ఎదగాలని పిలుపునిచ్చారు. కాగా, ఈ కార్యక్రమంలో లోకేశ్ తనయుడు దేవాన్ష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

భువనేశ్వరిపై ప్రశంసల జల్లు

మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్టు విద్యాసంస్థలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళతారనడంలో ఎలాంటి సందేహం లేదని చంద్రబాబు అన్నారు. హెరిటేజ్ ఫుడ్స్‌ను రెండున్నర దశాబ్దాలుగా విజయవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ఎన్టీఆర్ ట్రస్టును భారీ వ్యవస్థగా తీర్చిదిద్దగలుగుతారన్నారు. భువనేశ్వరి ఏ పని అనుకున్నా చిత్తశుద్ధితో పూర్తి చేస్తారని.. ఫలితం వచ్చేవరకూ వదలిపెట్టరని, అందుకే ఆమె సక్సెస్ అయ్యారని చెప్పారు. 'ఒకప్పుడు పెద్దలు పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చారని చూసేవారు. ఇప్పుడు ఎంత గొప్ప చదువు చదివిస్తున్నారు? ఎంత మంచి సంస్కారం నేర్పారు? అన్నది చూస్తున్నారు' అని అన్నారు.



జగిత్యాలలో బేస్‌మెంట్ వరకూ కట్టి వదిలేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

'డబుల్' ఇళ్లకు గ్రహణం

- **జగిత్యాలలో నిలిచిన నిర్మాణాలు.. ఎక్కడి పనులు అక్కడే**

జగిత్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో 'డబుల్ బెడ్‌రూం ఇళ్లకు గ్రహణం పట్టింది. రెండు నెలలుగా పనులు జరగకపోవడంతో.. సొంతింటి కల నెరవేరతుందనే ఆశ పేదల్లో సన్నగిల్లుతోంది. నిజామాబాద్ ఎంపీ కవిత ప్రత్యేక చొరవ తీసుకుని జగిత్యాలకు స్టేట్ రిజర్వ్ కేటాలో నాలుగు వేల గృహాలు మంజూరు చేయించారు. వీటి నిర్మాణానికి రూ.230 కోట్లు మంజూరు చేశారు. పట్టణ సమీపంలోని నూకపెల్లిలో ఈ గృహాలు నిర్మించాలని నిర్ణయించారు. ముంబైకి చెందిన వెక్టార్ ప్రాజెక్టు ఈ టెండర్‌ను దక్కించుకుంది. 2019 జూలై 31కి నిర్మాణాలు పూర్తికావాలనేది లక్ష్యం. తొలి దశలో 2018, డిసెంబరు 31కి 2 వేల ఇళ్లను పూర్తి చేయాలని నిర్దేశించుకున్నారు. 2018 ఏప్రిల్ 24న అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. మొదట్లో పనులు సజావుగా జరిగాయి. 4 వేల గృహాలకు గాను 3,820 గృహాలకు పునాదులు తీశారు. వీటిలో 144 ఇళ్లకు బేస్‌మెట్ నిర్మించారు. మరో 36 గృహాలకు ప్లింత్ భీములు కట్టారు. ఆ తర్వాత కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో 2 నెలలుగా పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టరుకు నోటీసులిచ్చినా స్పందన లేదు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్‌కు 3 నోటీసులిచ్చినా స్పందించకుంటే టెండర్‌ను రద్దు చేసి మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించే వెసులుబాటు ఉన్నా అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలువినిపిస్తున్నాయి. దీనిపై జగిత్యాల జిల్లా పంచాయతీరాజ్ ఈఈ మనోహర్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. పనులు నిలిచిన మాట వాస్తవమేనని, త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు.

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	13.0	30.2
రామగుండం	15.0	29.4
నల్లగొండ	18.0	30.4
నిజామాబాద్	16.8	30.5
హైదరాబాద్	15.8	29.0

సర్వదర్శనానికి 6గంటలు

తిరుమలలో శనివారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. సర్వదర్శనానికి దాదాపు 7 గంటలు, స్లాటెడ్, సర్వ, దివ్యదర్శనాలకు దాదాపు 3 గంటల సమయం పడుతోంది. సోమవారం ఆర్జితసేవలకు సంబంధించి విజయాబ్యాంకులో ఆదివారం లక్కీడిప్ ద్వారా జారీ చేసే టిక్కెట్లు సుప్రభాతం: 50, కల్యాణోత్సవం: 80, డోలోత్సవం: 25, విశేషపూజ: 125 అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి టీటీడీ.టీటీడీసేవాఆన్‌లైన్.కామ్‌లో సంప్రదించాలి.



ఇక.. 'ఎమర్జెన్సీ' ప్రకటనే!

అక్రమ వలసలను అరికట్టేందుకు గోడ నిర్మాణం ఒక్కటే మార్గం. దీనికి సంబంధించి నిధులను కేటాయించేందుకు ఎమర్జెన్సీని ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైంది. గోడ నిర్మాణానికి సంబంధించి డెమొక్రట్లతో చర్చించడం వృథా. వారికి రాజకీయం తప్ప సరిహద్దు భద్రత అవసరం లేదు.

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



సంస్థాగత మధ్యవర్తిత్వం కావాలి

దేశంలో దాదాపు 3 కోట్ల మధ్యవర్తిత్వ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జడ్జిల కొరత, మౌలిక సదుపాయాల లేమి ఇందుకు కారణాలు. ఈ కేసుల సత్వర పరిష్కారానికి సంస్థాగత మధ్యవర్తిత్వం కావాలి. అది పూర్తి స్థాయిలో జరగాలి. ప్రత్యేక కోర్టుల అవసరం ఎంతైనా ఉంది.

- జస్టిస్ దీపక్ గుప్తా, సుప్రీంకోర్టు జడ్జి

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.16	పాత ధర 71.44
కొత్త ధర రూ.75.05	కొత్త ధర 71.44
తగ్గుదల 11 పైసలు	మార్పులేదు



కొత్త అణువులతో కాలేయ వ్యాధికి చికిత్స!

జెరూసలెం, ఫిబ్రవరి 2: ఊబకాయం, కొవ్వు కాలేయ వ్యాధితో బాధపడే వారి చికిత్సకు 27 కొత్త అణువులను ఇజ్రాయెల్‌లోని హిబ్రూ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిద్వారా షుగర్ రోగుల కొచ్చే కిడ్నీ సమస్యలు, శరీరానికి తగిలే దెబ్బలకూ వైద్యం చేయవచ్చని వివరిస్తున్నారు. ప్రస్తుతం కొవ్వు కాలేయ వ్యాధికి సరైన చికిత్స అందుబాటులో లేదు. ఫలితంగా రోగం ముదిరి కేన్సర్‌కు దారితీస్తోంది. అందుకే శాస్త్రవేత్తలు ఒక ఆల్గారిథమ్‌ను అభివృద్ధి చేసి దాదాపు 15 లక్షలకుపైగా అణువులను పరిశీలించి 27 కొత్త అణువులను ఎంపిక చేశారు. 'పీపీఏఆర్-డెల్టా' అనే ప్రొటీన్ ద్వారా ఈ అణువులను చైతన్య పరచాలని చెబుతున్నారు. ఈ విధానంలో ఎలుకలపై చేసిన పరీక్షలు సానుకూల ఫలితాలిచ్చినట్లు పేర్కొన్నారు.

పండ్లు, కూరగాయలతో కిడ్నీ రోగులకు మేలే!

వాషింగ్టన్, ఫిబ్రవరి 2: డయాలసిస్ చేయించుకునే రోగులు పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకుంటే ప్రాణాపాయం ముప్పు తక్కువగా ఉంటుందని తాజా సర్వే పేర్కొంది. అయితే కిడ్నీ రోగులు ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయంలో మరిన్ని పరిశోధనలు జరగాలని యూనివర్సిటీ ఆఫ్ బరీ (ఇటలీ), యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ పరిశోధకులు అభిప్రాయపడ్డారు. పొటాషియం పెరుగుతుందే కారణంతో డయాలసిస్ చేయించుకునే వారిని పండ్లు, కూరగాయలు తినొద్దని చెబుతుంటారు. కానీ అది పొరపాటని తమ పరిశీలనలో గుర్తించినట్లు పరిశోధకులు తెలిపారు.

రేకుల షెడ్డుకు 1.57లక్షల కరెంటు బిల్లు



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన మాదాసు కొమురయ్య ఇంటికి రూ. 1,57,387 కరెంట్ బిల్లు రావడం సంచలనంగా మారింది. కొమురయ్య 2012లో ఒక రేకుల షెడ్డు కొనుగోలు చేశాడు. దానికి 50101-06924 విద్యుత్ మీటర్ ఉంది. ప్రతి నెల రూ.100 నుంచి రూ.150 విద్యుత్ బిల్లు వచ్చేది. 2016 మే లో మీటర్ రీడింగ్ 3295 యూనిట్ల నుంచి 21804కు పెరిగినట్టు, 18,509 యూనిట్ల విద్యుత్ వాడినట్లు బిల్లు వచ్చింది. ఇందుకు రూ. 1,57,387 బిల్లు వచ్చింది. దీంతో లబోదిబోమంటూ కొమురయ్య అధికారులను ఆశ్రయించాడు. ఏఏఓకు దరఖాస్తు చేసుకోగా మీటర్‌ను మార్చి పాత మీటరును ల్యాబ్‌కు పంపారు. అయితే.. మీటర్ సరిగ్గానే పనిచేస్తోందని.. కంప్లైంట్ ఏమీ లేదని అధికారులు తేల్చి చెప్పేశారు. వచ్చిన బిల్లు కచ్చితంగా చెల్లించాల్సిందేనంటూ శుక్రవారం విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. ఈ విషయమై ఏడీఈ వెంకటేశ్వర్లును వివరణ అడగగా.. మీటర్ బాగానే ఉన్న నేపథ్యంలో.. కొమురయ్యకు బకాయిలేమైనా ఉన్నాయా? అనే విషయమై పరిశీలన జరుపుతున్నామని తెలిపారు. *- కోల్‌సిటీ (గోదావరిఖని)*

తల్లి మరణాన్ని తట్టుకోలేక..
దత్త పుత్రుడి హఠాన్మరణం



వేణునాథస్వామి (ఫైల్)

ఆమె అతడి కన్నతల్లి కాదు. కానీ అంతకంటే ప్రేమగా పెంచుకొచ్చింది. కంటికి రెప్పలా చూసుకున్న ఆ తల్లి మరణం అతడిని కుంగదీసింది. బాధ తట్టుకోలేక ఆ కొడుకు గుండె ఆగింది. ఖమ్మంలో శనివారం ఈ విషాదం చోటుచేసుకుంది. సుగ్గలవారి తోట ప్రాంతానికి చెందిన లక్ష్మీనర్సమ్మ ఉపాధ్యాయురాలిగా పని చేశారు. ఆమె భర్త కేశయ్య కూడా విశ్రాంత ఉపాధ్యాయుడు. వారికి పిల్లలు లేకపోవడంతో వేణునాథస్వామిని చిన్నతనంలోనే దత్తత తీసుకున్నారు. తమ లాగే అతడిని కూడా ఉపాధ్యాయుడిని చేశారు. ఆదర్శ ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకున్న వేణునాథస్వామి ఇటీవలే రిటైర్ అయ్యారు. శుక్రవారం రాత్రి వృద్ధాప్యంతో లక్ష్మీనర్సమ్మ (85) కన్నుమూశారు. తల్లి మృతిని తలుచుకుని తీవ్ర వేదనకు గురైన వేణునాథస్వామి(62) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఒకేసారి తల్లీకొడుకులు మృతి చెందడం, ఆ కుటుంబంలో పెనువిషాదాన్ని నింపింది. కాగా, న్యాయవాది మాధవరావు, కృష్ణమోహన్, అన్నం శ్రీనివాసరావు మృతులకు నివాళులర్పించారు. *- ఖమ్మం టౌన్*

సిద్దిపేటకు రహదారుల మాల

రెండు జాతీయ రహదారుల పనుల్లో ప్రగతి.. చురుకుగా సూర్యాపేట-సిరిసిల్ల రోడ్డు.. మెదక్-ఎల్కతుర్తికి భూసేకరణ దాదాపు పూర్తి

- **హరీశ్‌రావు చొరవతో మరింత వేగవంతం**

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 2: అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తున్న సిద్దిపేట మీదుగా రెండు జాతీయ రహదారుల నిర్మాణం జరగనుంది. ఇందుకు ప్రణాళిక కూడా సిద్ధమైంది. భూసేకరణ సైతం తుది దశకు చేరింది. మాజీ మంత్రి హరీశ్ రావు చొరవతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సిద్దిపేట పట్టణం ఇప్పటికే పలు జిల్లాలకు వెళ్లడానికి కేంద్రంగా ఉంది. ప్రధాన పట్టణాలకు కూడా ఇక్కడి నుంచి రోడ్డు మార్గాలున్నాయి. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, సిరిసిల్ల, వేములవాడ, కామారెడ్డి, మెదక్, జనగాం, గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాలకు సిద్దిపేట మీదుగా రాష్ట్ర రహదారులున్నాయి. వీటికి త్వరలోనే రెండు జాతీయ రహదారులు అనుసంధానం కానున్నాయి.



సిద్దిపేటలో శనివారం క్రికెట్ పోటీలను ప్రారంభించి బ్యాటింగ్ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

137కి.మీల మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి

మెదక్ నుంచి ఎల్కతుర్తి వరకు జాతీయ రహదారి మంజూరైన విషయం తెలిసిందే. 137కి.మీ. దూరం నిర్మించే ఈ రహదారికి రూ.1050 కోట్ల ఖర్చవుతుంది. రోడ్డు నిర్మాణం కోసం దాదాపు 297 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా, దాదాపు పూర్తి కావచ్చింది. భూసేకరణ కోసం రూ. 71.15 కోట్లు, రహదారి నిర్మాణ పనులకు రూ.978.60 కోట్లు కేటాయించారు. ఒక కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి రూ.7.14కోట్లు ఖర్చవుతాయి. మెదక్‌లోని ధ్యాన్ చంద్ చౌక్ నుంచి ప్రారంభమయ్యే ఈ రోడ్డు రామాయంపేట, సిద్దిపేట, హుస్నాబాద్ మీదుగా ఎల్కతుర్తి వరకు ముగుస్తుంది. నాలుగు జాతీయ రహదారులకు ఈ రోడ్డు అనుసంధానంగా మారనుంది. హైదరాబాద్- నర్సాపూర్ జాతీయ రహదారి, హైదరాబాద్-రామగుండం, సూర్యాపేట-సిరిసిల్ల రహదారులు, వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారి ఈ రోడ్డుకు అనుసంధానంగా ఉంటాయి. మరో వారం రోజుల్లో ఈ రహదారికి నంబర్‌ను కూడా కేటాయించనున్నారు.

సిరిసిల్ల-సూర్యాపేట.. '365బి'

సిద్దిపేట మీదుగా నిర్మించనున్న సిరిసిల్ల-సూర్యాపేట రహదారికి '365బి' అని నామకరణం చేశారు. సిరిసిల్ల నుంచి సిద్దిపేట, దుద్దెడ, చేర్యాల, జనగామ, తిరుమలగిరి మీదుగా సూర్యాపేట వరకు ఈ రహదారి విస్తరించనుంది. 184 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును నిర్మించాల్సి ఉండగా, ప్రస్తుతం సూర్యాపేట నుంచి జనగాం వరకు పనులు జరుగుతున్నాయి. జనగాం నుంచి దుద్దెడ వరకు భూసేకరణ కూడా చేపట్టారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు కూడా భూసేకరణ చేయాల్సి ఉంది. పలు ప్యాకేజీల వారీగా విభజించి పనులు చేస్తున్నారు. కాగా, ఈ రహదారులను త్వరగా నిర్మించడానికి కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పలుమార్లు కలిసారు. అనుమతుల విషయంలోనూ చొరవ చూపించారు. భూసేకరణ కోసం అధికారులను అప్రమత్తం చేశారు. మరో ఏడాదిలో ఈ రెండు జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయ్యే అవకాశముంది.



దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు జడ్జి అక్తర్

జాన్‌పహాడ్ దర్గాను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

పాలకవీడు, ఫిబ్రవరి 2: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన సూర్యాపేట జిల్లా జాన్‌పహాడ్ దర్గాను రాష్ట్ర హైకోర్టు జడ్జి షమీమ్ అక్తర్ శనివారం దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఆయనను సన్మానించారు.

పొగాకురహితంగా పర్యాటక ప్రాంతాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల బారి నుంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలను పొగాకురహితంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పర్యాటక శాఖ కమిషనర్ సునీత ఎం. భగవత్ శనివారం అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్ని పొగాకురహితంగా మార్చాలంటూ వాలంటరీ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ డెంటల్ అసోసియేషన్‌లు కృషి చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు.

డిస్‌ప్లే బోర్డులతో వాతావరణ సమాచారం

- **సచివాలయంలో ప్రారంభించిన సీఎస్ జోషి**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ డిస్‌ప్లే బోర్డుల ద్వారా వాతావరణ పరిస్థితులను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి తెలిపారు. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీఎస్‌డీపీఎస్) సచివాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ డిస్‌ప్లే బోర్డులను ఆయన శనివారం ప్రారంభించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులపై సంబంధిత జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తారని చెప్పారు.

రూ.300 కోట్లతో 94 లక్షల బతుకమ్మ చీరలు

సిరిసిల్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ చీరలను సకాలంలో అందించడానికి నేత కార్మికులు కృషి చేయాలని చేనేత జౌళి శాఖ రాష్ట్ర డైరెక్టర్ శైలజారామయ్యర్ కోరారు. సిరిసిల్లలో మ్యాక్స్ సంఘాలు, ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులతో శనివారం బతుకమ్మ చీరల ఉత్పత్తిపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ గతానుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది ముందుగానే రూ.300 కోట్ల విలువైన 94 లక్షల చీరలను సిరిసిల్లలోనే ఉత్పత్తి చేసే విధంగా 121 మ్యాక్స్ సంఘాలు, 84 ఎస్ఎస్ఐ యూనిట్లకు ఆర్డర్ ఇస్తున్నట్లు తెలిపారు.

కలెక్టర్లపై సభ్యుల ఆగ్రహం

ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 2: ఆదిలాబాద్‌లో శనివారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్లు గైర్హాజరవడం పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరు కాగా ఆదిలాబాద్, మంచిర్యాల కలెక్టర్లు గైర్హాజరవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి హాజరుకాని కలెక్టర్లపై చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

రసాభాసగా ప్రమాణ స్వీకారాలు

- **సర్పంచ్‌లను అడ్డుకున్న ప్రత్యర్థులు**
- **ముస్తాబాద్‌లో ఉద్రిక్తత**
- **కుమరం భీం జిల్లాలో కార్యదర్శిపై దాడి**
- **తల్లికి బదులు కుమారుడి ప్రమాణం**

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారాలు నిరసనలు, గందరగోళం మధ్య రసాభాసగా జరిగాయి. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ప్రత్యర్థి వర్గాల వారు శనివారం పలు జిల్లాల్లో సర్పంచ్‌ల పదవీ బాధ్యతల ప్రమాణ స్వీకారాలను అడ్డుకున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం కుకుడలో సర్పంచ్‌గా ఆసియాభాను ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో ప్రత్యర్థి వర్గం వారు ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకున్నారు. నిరసనకారుల దాడిలో గ్రామ కార్యదర్శి బాబూరావు గాయపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పాలకవర్గం ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించరాదంటూ ఓటమి పాలైన సర్పంచ్ అభ్యర్థులు, మహిళలు, కులసంఘాల సభ్యులు ఆందోళన చేశారు. దీంతో ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వేశారు. జగిత్యాల జిల్లా ఆత్మకూర్‌లో పాలకవర్గ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకున్నారు. నిరసనల మధ్యనే పాలకవర్గం పదవీ ప్రమాణ స్వీకారాన్ని పూర్తి చేసింది. కాగా, జనగామ జిల్లా నేలపోగుల సర్పంచ్ గణపతి ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. నాగర్‌కర్నూలు జిల్లా కోడేరు మండలం నాగులపల్లి తండాలో 6వ వార్డు సభ్యురాలు జుమ్మా బదులు ఆమె కుమారుడు ప్రమాణం చేశాడు.



ముస్తాబాద్‌లో బైఠాయించిన మహిళలు

గల్ఫ్ ఏజెంట్లపై కేసులు నమోదు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 2: నకిలీ వీసాలతో పలువురిని ఇరాక్ పంపిన ఏజెంట్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం సోలాపూర్‌కు చెందిన బర్ల నరేందర్ అనే ఏజెంట్ మోసానికి బలై ఇరాక్‌లో చిక్కుకొని ఎంపీ కవిత చొరవతో విడుదలైన రాజేశ్వర్.. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, నాగరాజు అనే ఏజెంట్ నకిలీ వీసాతో తన భర్తను ఇరాక్ పంపాడంటూ బషీరాబాద్‌కు చెందిన యాల్ల నవ్యశ్రీ ఫిర్యాదు చేసింది. ఇద్దరు ఏజెంట్లపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి వెకిలి చేష్టలు

- **పాఠశాల వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల ఆందోళన**

కూసుమంచి, ఫిబ్రవరి 2: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, వెకిలి చేష్టలకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బాలికలతో కలిసి స్కూల్ ఎదుట శనివారం ఆందోళన చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర రెడ్డి పాఠాలు చెప్పే క్రమంలో మీదచేతులు వేయడం, ప్రశ్నలు అడిగే నెపంతో గదిలోకి పిలిచి వెకిలి చేష్టలకు పాల్పడటం వంటివి చేస్తుండేవాడు. ఈ విషయాన్ని విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు తెలియజేయడంతో, వారు శనివారం పాఠశాలకు చేరుకుని అతడి కోసం వెతికారు. అప్పటికే విషయం తెలుసుకున్న శంకరరెడ్డి, సెలవుపై వెళ్లిపోయాడు. ఇన్‌చార్జిగా ఉన్న శ్రీనివాసకుమార్‌కు, లిఖితపూర్వకంగా డీఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఈవో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై చిన్న పిల్లలపై లైంగిక వేధింపుల చట్టం (ఫోక్సో) కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో ముగ్గురు యువకుల గల్లంతు



దుర్గా శేషు, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి

వేలేరుపాడు/కుక్కునూరు, ఫిబ్రవరి 2: గోదావరి నదిలో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు శనివారం పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరు మండలం వేలేరు గ్రామం వద్ద గల గోదావరి నది వద్ద స్నేహితుడు గాదె విజయ్‌కుమార్ రెడ్డి పుట్టినరోజు వేడుకను జరుపుకున్నారు. అనంతరం వారంతా స్నానానికి గోదావరిలోకి దిగారు. వీరిలో ముగ్గురు కుందూరు శ్రీనివాసరెడ్డి(21), కారంపూడి శేషు(21), తిరుమలరెడ్డి శివారెడ్డి(20) గల్లంతయ్యారు. జాలర్లు నాటు పడవలతో గాలింపు చర్యలు చేపట్టనప్పటికీ వారి ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.


విమానంలో యువతితో అసభ్య ప్రవర్తన

శంషాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విమానంలో ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన సత్యప్రకాశ్ అనే నిందితుణ్ని శంషాబాద్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న విమానంలో సత్యప్రకాశ్ తన పక్క సీట్లో కూర్చున్న యువతి నిద్ర పోతుండగా ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె విమాన సిబ్బందికి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అన్ని అంశాలపై దృష్టి సారించాలి

- **రచయితలకు వివినమూర్తి సూచన**
- **విశాఖలో 'ప్రరవే' పదేళ్ల వేడుకలు**

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కష్టాలపైనే కాదు...అనేక అంశాలపై రచయితలు దృష్టిసారించాలని ప్రముఖ రచయిత వివిన మూర్తి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సెమినార్ హాలులో శనివారం ప్రారంభమైన ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) పదేళ్ల వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరిష్కరించలేని ఎన్నో సమస్యలను, అన్యాయాలను 'ప్రరవే' వేదిక ద్వారా సమాజం ముందుంచుతున్నారన్నారు. పునర్వివాహాలను నేటికీ సంస్కృతిగా స్వీకరించలేకపోతున్నామని, కష్టాలపైనే కాకుండా అటువంటి వాటిపైనా దృష్టి సారించాలన్నారు. సంస్థ జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో కార్యదర్శి కేఎన్ మల్లీశ్వరి సదస్సు లక్ష్యాలను వివరించారు. ప్రారంభోపన్యాసం చేసిన రచయిత, జర్నలిస్ట్ కె.సతీష్‌చందర్ మాట్లాడుతూ స్త్రీలపై ఆధిపత్యం అనాదిగా ఒక్కో రూపంలో కొనసాగుతోందని, రోజుకో రూపం సంతరించుకుంటోంది తప్ప సమూల మార్పు రావడం లేదన్నారు. అందుకు మూలాల్లో మార్పు తీసుకురావాలన్నారు. తిరునగరి దేవకీదేవి అధ్యక్షతన జరిగిన మరో సమావేశంలో పితృస్వామిక సంప్రదాయాలు-లైంగిక ఆధిపత్య ధోరణులు అనే అంశంపై పలువురు ప్రసంగించారు. డాక్టర్ పుట్ల హేమలత అధ్యక్షతన జరిగిన మరో సమావేశంలో మహిళలు-కుల, మత, జాతి సాంస్కృతిక సవాళ్లు అనే అంశంపై వక్తలు తమ స్పందనలు తెలియజేశారు. ముందుగా కలం పట్టి.. గళం విప్పి అంటూ 'వాక్‌విత్ రైటర్స్' పేరిట ర్యాలీని కృష్ణాబాయి, సీతామహాలక్ష్మి ప్రారంభించారు. సభా ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సిరిపురం జంక్షన్ మీదుగా తిరిగి వేదిక వద్దకు చేరుకుంది. విద్యార్థులు, మేధావులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు ర్యాలీలో భాగస్వాములయ్యారు.



వాక్‌విత్ రైటర్స్ ర్యాలీ



■ ఆర్కే RK

కొత్తపలుకు

రాష్ట్రాలలోనే కాకుండా దేశంలోనే ఇప్పుడు సంక్షేమం హద్దు మీరుతోంది. ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఉపయోగపడాల్సిన పన్నుల ఆదాయం పక్కదారి పడుతోంది. సంక్షేమం మితిమీరి సోమరిపోతులు, తాగుబోతులు పెరిగిపోతున్నారు. కష్టపడి పనిచేసే సంస్కృతికి దూరం అవుతున్నారు. ఇప్పటివరకు మన దేశంలో మానవ వనరులే అతిపెద్ద అస్సెట్‌గా చెప్పుకొంటూ వచ్చాం. ప్రస్తుత సోకాల్డ్ సంక్షేమ పథకాల వల్ల మానవ వనరులు నిర్వీర్యం అవుతున్నాయి. అధికారం కోసం ఆరాటపడుతున్న రాజకీయ పార్టీలు.. ఇది ఎంత ప్రమాదకరమో, దేశానికి ఎంత ద్రోహం చేస్తున్నాయో ఆలోచించడం లేదు.

పందేరాల పరుగు ఎందాకా?


“పంచుకుంటూ పోతే పంచె కూడా మిగలదు” ..అని ప్రస్తుత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు తరచుగా అంటూ ఉండే వారు. “లక్ష్య శుద్ధి లేని అవివేకపు ప్రజాకర్షక పథకాలు కావాలా? లేక ద్రవ్య క్రమశిక్షణ పాటించాలా? అన్న దానిపై భారతావనిలో రాజకీయ పార్టీలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం ఇది. ఎన్నికల్లో గెలవడానికి బుద్ధిహీనమైన ప్రజా కర్షణ అవసరం లేదని 2014 ఎన్నికలు నిరూపించాయి” అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2014లో లోక్‌సభలో తొలి బడ్జెట్ ప్రవేశపెడుతూ పార్లమెంట్ సాక్షిగా వ్యాఖ్యానించారు. అయిదేళ్లు తిరిగేసరికి భారతీయ జనతా పార్టీ పెద్దలకు కూడా తత్వం బోధపడినట్టుంది. రానున్న ఎన్నికల్లో గెలవడానికి బుద్ధి హీనమైన పథకాలే కావాలన్న నిర్ణయానికి వచ్చినట్టున్నారు.

> సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా ఉన్నామని చెబుతున్న తెలంగాణ ప్రభుత్వం మౌలిక వసతుల విషయంలో కూడా దేశానికి ఆదర్శంగా ఉన్నామని చెప్పుకోగలదా? ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ప్రధాన ఆస్పత్రుల స్థితిగతులలో మార్పు రాలేదు. ప్రాథమిక ఆరోగ్యం పరిస్థితి చెప్పనవసరం లేదు. విశ్వవిద్యాలయాలలో బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యాపక సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది.

రైతులకు రుణ మాఫీ వంటి పథకాలు ప్రకటించిన రాజకీయ పార్టీలను ఎగతాళి చేసినవారే రైతులకు పెట్టుబడి సాయం అంటూ సరికొత్త తాయిలాలకు తెర లేపారు. ఎన్నికల్లో గెలవ డానికి బుద్ధిహీన జనాకర్షక పథకాలు అవసరం లేదన్న పెద్దలు ఇప్పుడు ఏం చెబుతారు? నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ నాలు గున్నరేళ్లలో ప్రజారంజక పాలన అందించలేదని బీజేపీ పెద్దలు అంగీకరించినట్టేనా? అధికారంలోకి వచ్చిన పార్టీలు ఇష్టాను సారం వ్యవహరించి ఎన్నికలు రాగానే ప్రజాధనాన్ని పప్పుబెల్లా లుగా పంచుతూ ఓట్లు కొనుగోలు చేసే సరికొత్త వ్యూహానికి తెరలేపాయి. సంక్షేమం పేరిట రాజకీయ పార్టీలు అరాచకంగా వ్యవహరించడం మొదలెట్టాయి. కష్టపడి సంపాదించి పన్నులు కట్టేది ఒకరైతే.. దాన్ని పంచిపెట్టేది మరొకరుగా పరిస్థితి తయా రైంది. సంక్షేమం పేరిట కింది స్థాయి వారిని ప్రభుత్వాలు ఆదు కోవడం మొదలెట్టాయి. సంపన్న వర్గాలు ప్రభుత్వాల విధానా లతో సంబంధం లేకుండా హాయిగానే ఉంటాయి. ఇక మిగి లింది మధ్యతరగతి వర్గాలే! ఈ దేశంలో ఇప్పుడు ఎవరికీ పట్ట నివారుగా మధ్యతరగతి ప్రజలు మిగిలిపోయారు. కొంతకాలం క్రితం వరకు రాజకీయ పార్టీలు విరాళాలుగా సేకరించిన డబ్బు లేదా అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఎన్నికల్లో ఓట్లు కొను గోలు చేసేవి. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ సొమ్ము.. అంటే ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న సొమ్మును సంక్షేమ పథకాల పేరిట పంచుతూ ఓట్ల కొనుగోలుకు తెరలేపాయి. ఎన్నికల్లో అల్పాదాయ వర్గాల వారే అధికంగా ఓటింగ్‌లో పాల్గొంటారు. ఎగువ మధ్య తరగతి, ఆపై వర్గాలవారు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. దీంతో ఓటింగ్‌లో పాల్గొనేవారిని సంతృప్తిపరిస్తే చాలు అన్న సూక్ష్మాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాయి. జనాకర్షక పథకాలకు ఒకప్పుడు జాతీయపార్టీలు దూరంగా ఉండేవి. ప్రాంతీయ పార్టీల ఆవిర్భావంతో జనాకర్షక పథకాలు తెర మీదకు వచ్చాయి. దక్షిణాదిన తమిళనాడు, తెలుగు రాష్ట్రాలు జనాకర్షక పథకాల విషయంలో పోటీ పడుతూ ఉండేవి. ఆ తర్వాత ఈ జాబితాలోకి ఉత్తరప్రదేశ్ వచ్చి చేరింది. ఓటర్లకు అవి పంచుతాం, ఇవి పంచుతాం అంటూ అక్కడి ప్రాంతీయ పార్టీలు పోటీ పడ్డాయి. ఇప్పుడు ఈ జాడ్యం జాతీయ పార్టీలకు కూడా పాకింది. ఫలితమే కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటిం చిన తాయిలాలు! రాష్ట్రాలలోనే కాకుండా దేశంలోనే ఇప్పుడు సంక్షేమం హద్దు మీరుతోంది. ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఉపయోగపడాల్సిన పన్నుల ఆదాయం పక్కదారి పడుతోంది. సంక్షేమం మితిమీరి సోమరిపోతులు, తాగుబో తులు పెరిగిపోతున్నారు. కష్టపడి పనిచేసే సంస్కృతికి దూరం అవుతున్నారు. ఇప్పటివరకు మన దేశంలో మానవ వనరులే అతిపెద్ద అస్సెట్‌గా చెప్పుకొంటూ వచ్చాం. ప్రస్తుత సోకాల్డ్ సంక్షేమ పథకాల వల్ల మానవ వనరులు నిర్వీర్యం అవుతు న్నాయి. అధికారం కోసం ఆరాటపడుతున్న రాజకీయ పార్టీలు.. ఇది ఎంత ప్రమాదకరమో, దేశానికి ఎంత ద్రోహం చేస్తున్నాయో ఆలోచించడం లేదు. సంక్షేమం పేరిట ప్రజలను భిక్షగాళ్లుగా చేస్తున్న రాజకీయ నాయ కులు.. తమను తాము దానకర్ణులుగా చెప్పుకొంటు న్నారు. ఇలా ఎంత కాలం? అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలా వ్యవహరించినా పర్వాలేదు.. ఎన్నికలకు ముందు సంక్షేమం పేరిట కొత్త కొత్త పథకాలు ప్రకటిస్తే చాలు.. మళ్లీ అధికారంలోకి వస్తామన్న భావన రాజ కీయ పార్టీల్లో ఏర్పడటం ఎంత ప్రమాదకరం? దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని అంగీకరించే రాజకీయ పార్టీలు శాశ్వత పరిష్కారాల గురించి మాత్రం ఆలోచించడం లేదు. పెట్టుబడి సాయం పేరిట కొత్త పథ కాలకు శ్రీకారం చుడుతున్నాయి. వ్యవసాయం లాభ సాటి కానంతవరకు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా వ్యర్థమే! తెలుగు రాష్ట్రాల విషయమే తీసుకుందాం. కేంద్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాల పుణ్యమా అంటూ గ్రామాల్లో వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదు. దీనికితోడు ఉపాధి హామీ పథకం ఒకటి! ఫలితంగా బిహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి వ్యవసాయ కూలీలను పిలిపించుకోవా ల్సిన దుస్థితి ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్టులలో పనిచేస్తున్న వారిలో 90 శాతం వరకు ఇతర రాష్ట్రాల వారే కనిపిస్తున్నారు. సంక్షేమం పేరిట పనిచేయాల్సిన అవసరం లేకుండా చేయడమే ఇందుకు కారణం! 30 ఏళ్ల క్రితం రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని అమలుచేసిన ఎన్‌టీఆర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. ఇప్పుడు తెలుగునాట రూపాయికే కిలో బియ్యం ఇస్తున్నారు. అయినా బియ్యం ధరను రూపాయికి తగ్గించిన ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని తలుచు కుంటున్నవారు లేరు. ఆకలితో ఉన్నవాడికి అన్నం పెడితే గుర్తు పెట్టుకుంటారు కానీ, కడుపు నిండినవాడికి ఇంకా ఇంకా పెట్టినా పట్టించుకోరు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయినా అధికారంలో ఉంటున్నవారు పట్టించుకో వడం లేదు. దీనివల్ల కూలీల కొరత తీరడమే కాకుండా రైతులకు కూలీలపై చేసే ఖర్చు ఎకరానికి నాలుగైదు వేల రూపాయల వరకు ఆదా అవుతాయి. అయినా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయరు. ఆ పని చేయకుండా పెట్టుబడి సాయమంటూ రైతులను కూడా మభ్యపెట్టి ఓట్లు కొల్లగొట్టే పనిలో పడ్డారు. తెలంగాణలో తాజాగా జరిగిన ఎన్నికల సంద ర్భంగా రైతు బంధు రెండో విడత సహాయాన్ని పోలిం గ్‌కు నాలుగైదు రోజుల ముందు రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో ఆనందించిన రైతులు కృతజ్ఞతగా కేసీఆర్‌ను దీవించారు. ఇది గమనించిన ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా పరిమిత స్థాయిలో ఈ పథకాన్ని అమలుచేసి ఓట్లు కొల్లగొట్టాలని పథకం వేసుకున్నారు. ముగిసిపోతున్న ఆర్థిక సంవత్సరం నుంచే పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పడంలోనే కేంద్ర పెద్దల కప టత్వం బయటపడుతోంది. మరో రెండున్నర నెలల్లో ఎన్ని కలు జరగబోతున్నాయి. ఈ లోపుగా అయిదెకరాలలోపు ఉన్న రైతుల వివరాలు ఎలా సేకరిస్తారో తెలియదు!

ఒకరిని మించి ఒకరు!

రైతు బంధు వంటి సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దిక్సూ చిగా మారారని టీఆర్ఎస్ నాయకులు పొగుడుకుంటు న్నారు కానీ, ప్రభుత్వ డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసే కార్యక్ర మానికి ఉమ్మడి రాష్ట్రంలోనే రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రీకారం చుట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, అడిగిన వారందరికీ తెల్లకార్డులు ఇవ్వడం వంటి చర్యల ద్వారా 2009 ఎన్నికల్లో రాజశేఖర్‌రెడ్డి లబ్ధి పొందారు. అప్పట్లో రాజశేఖర్‌రెడ్డి నడక మొదలెట్టగా.. తెలంగాణ సీఎం కేసీఆర్ ఇప్పుడు దౌడు తీస్తున్నారు. దీంతో ఇతరులు కూడా పరుగు లంకించుకున్నారు. రాజశేఖర్‌రెడ్డిని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కేసీఆర్ ఓట్ల కొను గోలు పథకాలను మరింత విస్తృతపరిచారు. ఓటుకు నోటు కేసు సంగతి ఏమిటో తెలియదు కాని, ప్రభుత్వాలే ఇప్పుడు ఓటుకు నోటు స్కీమ్‌ను అధికారికంగా అమలుచేస్తున్నాయి. తెలం గాణలో గొర్రెలు పంచిపెట్టడం, బతుకమ్మ చీరలు పందేరం చేయడం వంటివి చేసిన కేసీఆర్, సరికొత్త అస్త్రంగా రైతుబంధు పేరిట ఎకరాకు ఏడాదికి ఎనిమిది వేల రూపాయలు పంచి పెట్టారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని పది వేలకు పెంచబోతున్నారు. ఏదైతేనేమి– స్కీమ్ వర్కవుట్ అయింది. ఓట్ల పంట పుష్కలంగా పండింది. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. రెండొందల రూపాయలు విలువ చేసే బతుకమ్మ చీర కోసం రెండొందలకు పైగా లభించే కూలీ వదులుకుని మహిళలు క్యూ కట్టడాన్ని మనం చూస్తున్నాం. పాలకులకు ఈ సైకాలజీ బాగా నచ్చింది. అంతే– తమ మేధస్సుకు పదునుపెట్టి సరికొత్త సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతున్నారు. ఇవన్నీ చాలవ న్నట్లు అధికారంలో ఉన్నవారు కమీషన్ల రూపంలో లభించే సొమ్ముతో ఎన్నికల్లో వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. నిజానికి ఇది కూడా ప్రజల సొమ్మే! సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా ఉన్నా మని చెబుతున్న తెలంగాణ ప్రభుత్వం మౌలిక వసతుల విష యంలో కూడా దేశానికి ఆదర్శంగా ఉన్నామని చెప్పుకోగలదా? కనీస వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులలో చోటు చేసుకుంటున్న దీనగాథలను మనం వింటూనే ఉన్నాం. విద్య, వైద్య రంగాలను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. ఈ రెండు రంగాలను ప్రైవేట్ రంగానికి వదిలేసి ఉన్న డబ్బుతో సంక్షేమం పేరిట ఓట్ల కొనుగోలుకు పాలకులు తెగబడుతున్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ప్రధాన ఆస్పత్రుల స్థితిగతులలో మార్పు రాలేదు. ప్రాథమిక ఆరోగ్యం పరిస్థితి చెప్పనవసరం లేదు. విశ్వవిద్యాలయాలలో బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యా పక సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజకీయ అవసరాల కోసం మహ బూబ్‌నగర్, నిజామాబాద్‌లలో ఏర్పాటుచేసిన విశ్వవిద్యాల యాలు అనాథలుగానే ఉన్నాయి. తెలంగాణ అస్తిత్వం గురించి మాట్లాడే కేసీఆర్, కేటీఆర్ విశ్వవిద్యాలయాల అస్తిత్వం గురించి మాత్రం మాట్లాడరు. ఎందుకంటే అధ్యాపకులను నియమించి వసతులు మెరుగుపరిచినా ఓట్లు రావు. ఎన్నికల్లో ఓట్ల కోసం కేసీఆర్ అనుసరించిన మోడల్ దెబ్బతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీలు కూడా సంక్షేమ పథకాల ప్రకట నలలో పోటీ పడుతున్నాయి. రెవెన్యూ లోటుతో అల్లా డుతున్న ఏపీలో ఇప్పుడు ప్రకటిస్తున్న సంక్షేమ పథ కాలు ఎలా అమలు అవుతాయో తెలియదు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలోనే రైతుబంధు పథకం కింద నిధుల పంపిణీకై మూడు నాలుగు నెలలపాటు అన్ని చెల్లింపులు ఆపేసి డబ్బును సమకూర్చుకున్నారు. దీంతో ప్రభుత్వం చెల్లించవలసిన పెండింగ్ బిల్లుల మొత్తం 20 వేల కోట్ల రూపాయలకు చేరిందని చెబు తున్నారు. మరో రెండు మూడు నెలలు గడిస్తే ఖరీఫ్ కింద పంట సాయం పంపిణీ చేయవలసి వస్తుంది. అదే సమయంలో రుణ మాఫీ భారం ఉండనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే సంక్షేమ పథకాల అమలుకు ఏకంగా అప్పులు చేయవలసిన పరిస్థితి! రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న కొన్ని సంక్షేమ పథకాలు హాస్యా స్పదంగా ఉంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్లకు పెంచుతున్నారు. కానీ పెన్షన్లు పొందడానికి మాత్రం 58 ఏళ్లు వస్తే చాలు అని చెబుతున్నారు. ఇంతకంటే చోద్యం ఉంటుందా? తెలుగునాట నిరుద్యోగ భృతి ఒకటి కొత్తగా వచ్చి చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో 2 వేలు, తెలంగాణలో 3 వేలు వంతున నిరుద్యోగ భృతి చెల్లించబోతున్నారు. 58 ఏళ్ల వరకు నిరుద్యోగ భృతి పొందినవారు ఆ తర్వాత పెన్షన్లు పొందవచ్చునన్న మాట! తెలంగాణలో, ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాల ప్రకారం తెల్లకార్డు ఉన్న ఒక కుటుంబానికి పెన్షన్ల కింద రెండు వేల రూపాయలు, నిరుద్యోగుల సంఖ్యను బట్టి 4 నుంచి 6 వేలు, కిలో బియ్యం రూపాయికే, కరెంట్ బిల్లులో రాయితీ, ఇల్లు ఉచితం, వైద్యం ఉచితం! ఇన్ని సౌకర్యాలు పొందిన తర్వాత ఎవ రికైనా పనిచేయాలని ఎందుకు అనిపిస్తుంది చెప్పండి? ఏమీ తోచకపోతే ఉపాధి హామీ పథకం కింద ఏదో ఒక పనికి వెళ్లి కొద్దిసేపు నటించేసి వస్తే.. రెండొందల రూపాయల వరకు అందుతాయి. ఇంకేముంది– మధ్యాహ్నానికల్లా పని ముగించేసుకుని వచ్చి పడుకోవచ్చు. దీనికి తోడు మద్యం కూడా. తెలుగునాట మద్యం దుకాణాలు కిటకిటలాడుతున్నాయంటే ఉండవా మరి! ప్రజలను తాగుబోతులను చేసి.. తద్వారా లభించే ఆదాయంతో సంక్షేమం పేరిట రాజకీయ పార్టీలు నాటకం ఆడుతు న్నాయి. ప్రభుత్వాల నుంచి ఎటువంటి సహాయం లభించని మధ్యతరగతి మాత్రం గుడ్లు అప్పగించి చూస్తూనే ఉండిపోవాలి. ఇప్పుడు మళ్లీ కేంద్ర బడ్జెట్ విషయానికి వద్దాం. బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సహాయం వల్ల రైతుల తలరాత ఏమీ మారదు గానీ ఓట్ల పంట పండవచ్చు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రకటించిన పథకాలపై స్పందిస్తూ, తాము కూడా మోదీపై సర్జికల్ స్ట్రైక్ చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటిం చారు. దీన్నిబట్టి కాంగ్రెస్ పార్టీ బీజేపీ ప్రకటిం చిన పథకాల కంటే మెరుగైన.. అంటే ప్రజలకు మరింత వ్యక్తిగత లబ్ధి చేకూర్చే పథకాలను ప్రకటించే ప్రమాదం ఉందన్న మాట! ఈ పరుగు పందెం ఎందాకా? ఎన్నాళ్లు? అన్న ప్రశ్నలను రాజకీయ పార్టీలు కూడా ప్రైవేట్ సంభాషణల్లో సంధిస్తున్నాయి. అయినా అధి కారంలోకి రావాలంటే తప్పదు కనుక అందరూ అదే మార్గంలో పరుగులు పెడుతున్నారు. జాతీయ స్థాయిలో కూడా సంక్షేమమే రాజకీయ పార్టీల ప్రధాన అజెండా కావడా నికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రేరణగా నిలిచారని చెప్పక తప్పదు. హద్దులు దాటుతున్న సంక్షేమానికి రోల్ మోడ ల్‌గా మారుతున్న కేసీఆర్‌ను చూసి గర్వించాలో? పెచ్చరిల్లు తున్న పెడధోరణులు చూసి బాధపడాలో తెలియని పరిస్థితి!



> తెలంగాణలో తాజాగా జరిగిన ఎన్నికల సందర్భంగా రైతు బంధు రెండో విడత సహాయాన్ని పోలింగ్‌కు నాలుగైదు రోజుల ముందు రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో ఆనందించిన రైతులు కృతజ్ఞతగా కేసీఆర్‌ను దీవించారు. ఇది గమనించిన ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా పరిమిత స్థాయిలో ఈ పథకాన్ని అమలుచేసి ఓట్లు కొల్లగొట్టాలని పథకం వేసుకున్నారు. ముగిసిపోతున్న ఆర్థిక సంవత్సరం నుంచే పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పడంలోనే కేంద్ర పెద్దల కపటత్వం బయటపడుతోంది. మరో రెండున్నర నెలల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ లోపుగా అయిదెకరాలలోపు ఉన్న రైతుల వివరాలు ఎలా సేకరిస్తారో తెలియదు!

నిలదీయడం అవశ్యం!

ఓట్ల వేటలో పోటీపడుతున్న రాజకీయ పార్టీలు ఇప్పట్లో ఆత్మపరిశీలన చేసుకునే అవకాశాలు లేవు. జనాకర్షక పథకాల వల్ల ఎన్నికల్లో గెలుస్తామనుకోవడం పొరపాటు అని నాలుగేళ్ల క్రితం సెలవిచ్చినవారు ఇప్పుడు అదే దారి పట్టారు కనుక ఇత రులకు, నరేంద్ర మోదీకి మధ్య గుణాత్మక మార్పు ఏమీ లేదని స్పష్టమవుతోంది. ఈ పరిస్థితులలో సమాజమే.. అంటే పన్నులు చెల్లిస్తున్న మధ్యతరగతి, ఆపై వర్గాలవారు స్పందించాల్సిన అవ సరముంది. ప్రభుత్వాల ఆదాయంలో సంక్షేమం వాటా ఎంత ఉండాలన్న విషయమై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. అవసర మైతే ఉద్యమం కూడా రావాలి. పన్నులు చెల్లించేవారికి ప్రయా ణించడానికి సరైన రోడ్లు ఉండవు. పీల్చడానికి స్వచ్ఛమైన గాలి ఉండదు. వైద్యానికి లక్షలు చెల్లించాలి. శుక్రవారంనాడు పార్ల మెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన పీయూష్ గోయల్ తాయిలాలను ప్రకటించినప్పుడు.. తామేదో ఘనకార్యం సాధించినట్లుగా ప్రధా నమంత్రి సహా బీజేపీ సభ్యులందరూ బల్లలు చరిచి హర్షం వ్యక్తంచేశారు. తమకు వ్యతిరేకంగా ఏర్పాటు అవుతున్న మహా కూటమి తమను ఏమీ చేయలేదనీ, ఈ తాయిలాలతో మీకు చెక్ పెడుతున్నాం సుమీ.. అన్నట్లుగా బీజేపీ సభ్యుల హావభా వాలు కనిపించాయి. ఈ నేపథ్యంలో సంక్షేమం పేరిట రాజకీ యపార్టీలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నందున పార్టీ లను దారిలో పెట్టే బాధ్యతను సమాజమే తీసుకోవాలి. ఇందులో భాగంగా హద్దులు దాటుతున్న సంక్షేమ పథకాలు ప్రకటిస్తున్న రాజకీయపార్టీలను నిలదీయాలి. ఎవడబ్బ సొమ్మని పంచిపెడుతున్నారు? అని ప్రశ్నించాలి. మేం కష్టపడి సంపాదించి కడుతున్న పన్నులను మీ ఇష్టమొచ్చినట్లు పంచి పెట్టే అధికారం మీకు ఎక్కడిది? అని నినదించాలి. అదే సమ యంలో ఇప్పటివరకు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నవారు ఇకపై విధిగా ఓటింగ్‌లో పాల్గొని హద్దులు దాటుతున్న రాజ కీయ పార్టీలకు బుద్ధి చెప్పాలి. సంక్షేమం కూడా వికటించే ప్రమాదం ఉందన్న భయం రాజకీయ పార్టీల్లో ఏర్పడకపోతే ఈ సంతర్పణ ఇలాగే కొనసాగుతూ ఉంటుంది. ఎందుకంటే.. ఒక పథకం ఒక్కసారి మాత్రమే ఓట్ల పంట పండిస్తుంది. తర్వాత వచ్చే ఎన్నికలకు మరొక పథకం తీసుకురావాల్సిందే! రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టిన ఎన్‌టీఆర్‌ను కూడా ఆ పథకం ప్రయోజనం పొందుతూ కూడా 1989లో ప్రజలు ఓడించారు. ఈ నేపథ్యంలో ఓటుకు నోటు ఆటకు అడ్డు కట్ట వేయడానికి సమాజమే పూనుకోవాలి. లేదంటే అభివృద్ధి చెందడం దేవుడెరుగు– మనందరి నెత్తిన అప్పుల కుప్ప పెరిగి పోతుంది. ‘చేపలు పంచడం కాదు– చేపలు పట్టడం నేర్పిం చాలి’ అన్న చైనా సూక్తిని మన రాజకీయ పార్టీలు ఎప్పుడు తెలుసుకుంటాయో?

> సంక్షేమం పేరిట రాజకీయ పార్టీలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నందున పార్టీలను దారిలో పెట్టే బాధ్యతను సమాజమే తీసుకోవాలి. హద్దులు దాటుతున్న సంక్షేమ పథకాలు ప్రకటిస్తున్న రాజకీయపార్టీలను ఎవడబ్బ సొమ్మని పంచి పెడుతున్నారు? అని ప్రశ్నించాలి. అదే సమయంలో ఇప్పటివరకు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నవారు ఇకపై విధిగా ఓటింగ్‌లో పాల్గొని రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలి. సంక్షేమం కూడా వికటించే ప్రమాదం ఉందన్న భయం రాజకీయ పార్టీల్లో ఏర్పడకపోతే ఈ సంతర్పణ ఇలాగే కొనసాగుతూ ఉంటుంది.

యూట్యూబ్‌లో ‘కొత్త పలుకు’ కోసం
http://www.youtube.com/abntelugutv

సమ్మిళిత స్వయం పాలనే లక్ష్యం

దేశంలో గుణాత్మక మార్పురావాలని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బి.జే.పిలకు తోక పార్టీలుగా మారి ఏదో ఒక కూటమిలో చేరకుండ తామే ఒక ఫ్రంట్‌గా ఏర్పడి రాష్ట్రాల హక్కులను కాపాడుకుంటు దేశాన్ని అభివృద్ధి పథంలో నడపాలనీ కే.సి.ఆర్. ఫెడరల్ ఫ్రంట్ నినాదాన్ని దేశం ముందు ఉంచారు. గతంలో కూడ లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా లాంటి వాళ్ళు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం కోసం ప్రయత్నించారు. అందులో భాగంగానే మొరార్జీదేశాయి ప్రధానిగా జనతా ప్రభుత్వం ఏర్పడింది. ఫెడరల్ ఫ్రంట్ సాధ్యమా? అసాధ్యమా? అనే మీమాంసను, రంధ్రాన్వేషణను వదిలి దేశంలో ప్రజాస్వామ్య పరిపూర్ణతకు ఫెడరల్ ఫ్రంట్ అవసరం ఉందా? లేదా? అని తెలం గాణ మేధావి వర్గం ఆలోచించాల్సి ఉంది. భారత రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన అధికార వికేంద్రీకరణ, స్వయం పాలన స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవలసిన అవసరం ఉంది.

భారతదేశ సమగ్ర అభివృద్ధికోసం రెండు మౌలికమైన అంశాలను కే.సీ.ఆర్. లేవనెత్తుతున్నారు. ఒకటి కేంద్రంలో కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రభుత్వం ఏర్పాటు; రెండు రాజ్యాంగంలో పొందుపరిచిన ఫెడరల్ స్ఫూర్తిని ఇనుమడింపజేయడం, అందులో భాగంగా కేంద్రం నుండి రాష్ట్రాలకు న్యాయంగా దక్కాల్సిన వాటానుపొందడం; రాష్ట్రాల అభివృద్ధికి అవసరమైతే రాజ్యాంగంలో మార్పులు, చేర్పులు చేయడం. ఉదాహరణకు దేశంలో ఒక్కొక్క రాష్ట్రంలో సామాజిక మార్పు ఒక్కో విధంగా ఉండడం చేత రిజర్వేషన్లను పెంచుకొనే హక్కు ఆయా రాష్ట్రాలకు కట్టబెట్టడం –తద్వారా ఆయా వర్గాలకు సామాజిక న్యాయాన్ని కల్పించడం.

కేంద్రంలో కాంగ్రెసేతర, బి.జె.పి.యేతర సెక్యులర్ పార్టీలు ఒక వేదికమీదికి రావాలని, ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కావాలని కే.సి.ఆర్. ప్రతిపాదిస్తు న్నారు. మొదట కొంతమంది దీనిని తేలికగా తీసుకున్నారు. ఇంకొందరైతే తన ప్రధాన ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రాకుండ ఉండడం కోసం కొన్ని ప్రాంతీయ పార్టీలను మరికొన్ని కాంగ్రెస్ మిత్ర పక్షాలను ఫెడరల్ ఫ్రంట్‌లోకి తీసుకొచ్చి తద్వారా కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చడం కోసం కే.సి.ఆర్. ఫెడరల్ ఫ్రంట్ నినాదాన్ని ముందుకు తెచ్చారని అసత్య ప్రచారం చేసారు. అయితే తెలం గాణలో టి.ఆర్.యస్. పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత దేశం లోని చాలా ప్రాంతీయ పార్టీల వైఖరిలో మార్పు వచ్చింది. అంతే కాకుండ కే.సి.ఆర్. మానస పుత్రికలైన రైతుబంధు, రైతు బీమా, మిషన్ భగీరథ లాంటి పథ కాలు దేశవ్యాప్త ప్రశంసలందుకున్నాయి. బెంగాల్, ఒరిస్సాలాంటి రాష్ట్రాలు రైతు బంధు పథకాన్ని తమ రాష్ట్రాల్లో అమలు పరచడానికి ముందుకొచ్చాయి. రైతు బంధు పథకాన్ని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు పరచడం కోసం ముందుకు రావడం హర్షించదగ్గ విషయం. రైతు బంధుని మోదీ అమలు పరచడం ద్వారా కే.సీ.ఆర్ ఖ్యాతి దేశ వ్యాప్తమయితే, ఐక్యరాజ్య సమితి ఈ పథ కాన్ని ప్రశంసించడం వల్ల ప్రపంచవ్యాప్తమైంది. తద్వారా కే.సీ.ఆర్. దేశానికి ప్రత్యామ్నాయంగా చూపిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ పైన, కే.సీ.ఆర్.పైన విశ్వాసం కుదిరింది. ఉత్తరప్రదేశ్‌లోని సమాజ్‌వాది పార్టీ, బహుజన సమాజ్‌వాది పార్టీలు కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా జతకట్టడం, ఒరిస్సాలో నవీన్ పట్నాయక్, కాంగ్రెస్‌కు, బీ.జే.పీ.కి సమాన దూరమని ప్రకటించడం, మమతా బెనర్జి కోల్ కతాలో నిర్వహించిన ర్యాలీకి సోనియా, రాహుల్ హజరు కాకపోవడం లాంటి పరిణామాలతో దేశంలో కాంగ్రెసేతర, బీ.జే.పీ.యేతర పార్టీలు బలపడే అవకాశా లున్నాయని మనకు అర్థం అవుతుంది. గతంలో అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జి, నవీన్ పట్నాయక్‌లతో కే.సి.ఆర్. చర్చలు జరపడం ద్వారానే ఇది సాధ్యమ యింది. నిన్న, మొన్న వచ్చిన సర్వేల ద్వారా కాంగ్రెస్, బీ.జే.పీ.యేతర పార్టీలు దాదాపుగా 150 యం.పి. సీట్లు గెలుచుకోబోతున్నాయని తెలుస్తుంది. బెంగాల్‌లో తృణమూల్, తమిళనాడులో డి.యం.కె, ఎ.ఐ.డి.యం.కె., ఏ.పి.లో జగన్, తెలంగా ణలో టి.ఆర్.యస్., బిహార్‌లో జె.డి.యు, ఆర్.జె.డి, ఒరిస్సాలో జనతాదళ్, కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ రేపు జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించ బోతున్నాయి, అంటే కే.సీ.ఆర్. ప్రతిపాదిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ ఊహాజనితమైంది కాదని, సాకారం కావడానికి అవకాశం ఉందని మనకు అర్థమవుతుంది.



> కాంగ్రెస్ కౌగిట్లో చిక్కుకుని ప్రాంతీయ పార్టీలు గతంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఇప్పుడు కూడా ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ ధృతరాష్ట్ర కౌగిలి నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది. దేశంలో ఉన్న అన్ని వర్గ, కుల, ప్రాంత, జాతుల్లో అసమానతలు తగ్గి, దేశంలో గుణాత్మక మార్పులు రావాలంటే భారత రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య విధానం పకడ్బందీగా అమలు కావాలి.

కేంద్రంలో కాంగ్రెసేతర, బీజేపీయేతర ఫెడరల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడాలనే అంశంతో పాటు, రాజ్యాంగం ద్వారా కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఆర్థికవనరులలో దక్కవలసిన న్యాయమైన వాటా, కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో చోటుచేసుకోవలసిన మార్పులు మొదలగువాటిని కూడా కే.సీ.ఆర్ చర్చిస్తున్నారు.

రాజ్యాంగ రచన సందర్భంలో దేశంలో బహుళసంస్కృతి ఉన్న నేపథ్యంలో ఫెడరల్ లక్షణాలుగ అనేక నిబంధనలను మన రాజ్యాంగంలో పొందుపరచారు. దేశ విభజన వెంటనే మత కలహాలు, స్వదేశీ సంస్థానాల విలీనం మొదలగు క్లిష్ట సమస్యలవల్ల బలమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకపోతే దేశ సమగ్ర తకు విఘాతం కలిగి రాష్ట్రాలు స్వతంత్రం ప్రకటించుకునే ప్రమాదం ఉందని కొద్ది మంది రాజ్యాంగ నిపుణులు భయాందోళనలను వెలిబుచ్చారు. తద్వారా సాధా రణ పరిస్థితుల్లో సమాఖ్యగా, అసాధారణ పరిస్థితుల్లో ఏక కేంద్ర వ్యవస్థగా ఈ దేశం పనిచేస్తుంది. కాని కేంద్రం రాష్ట్రాల అధికారాలను ప్రజలచేత ఎన్నుకోబడిన రాష్ట్ర ప్రభు త్వాలను రద్దుచేయడం, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అనేక హక్కులను కాలరాయడం సర్వసాధారణమైంది. అసా ధారణ పరిస్థితుల్లో మాత్రమే రాష్ట్రాలు బలహీనంగా ఉంటూ కేంద్ర ప్రభుత్వానికి విశేష అధికారాలు ఉంటాయి. కానీ సాధారణ పరిస్థితుల్లో కూడా కేంద్రం రాష్ట్రాల హక్కులు కాలరాయడం దురదృష్టకరం. కాంగ్రెస్ పార్టీ అయితే అనేక సందర్భాల్లో సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించింది. అది ఇందిరాగాంధీ హయాంలో పరాకా ష్టకు చేరింది. అనేక రాష్ట్రాల్లో ఉన్న ఫళంగా అక్కడి ప్రజా ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించడం జరి గింది. ఇందిరాగాంధీ హయాంలో సమాఖ్య స్ఫూర్తిని బల హీనపరచడమే గాక ఉన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకి ఉన్నటువంటి న్యాయ సమీక్షాధికారాన్ని కూడా లేకుండా చేసే కుట్ర జరిగింది. ఎమర్జన్సీ, తరువాత లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయన్ నాయకత్వంలో జరిగిన సంపూర్ణ విప్లవ పోరాట ఫలితంగా ఏర్పడిన జనతా ప్రభుత్వాన్ని కాంగ్రెస్ కూల్చివేసింది. మొరార్జి దేశాయ్ ప్రభుత్వాన్ని దించడం కోసం చరణ్‌సింగ్‌ని, వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని దించడంకోసం చంద్రశేఖర్‌ని పావు లుగా వాడుకొని వారి ప్రభుత్వాలను కూడా కాంగ్రెస్ కూల్చివేసింది. కాంగ్రెస్ ధృతరాష్ట్ర కౌగిట్లో చిక్కుకున్న ప్రాంతీయ పార్టీలు చాలా ఇబ్బందులను ఎదుర్కొ న్నాయి, ఇప్పుడు కూడా ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ ధృతరాష్ట్ర కౌగిలి నుంచి జాగ్రత్తగా బయటపడాల్సిన అవసరం ఉంది. దేశంలో ఉన్న అన్ని వర్గ, కుల, ప్రాంత జాతుల అసమానతలు తగ్గి దేశంలో గుణాత్మక మార్పులు రావాలంటే భారత రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య విధానం పకడ్బందీగా అమలు కావాలి.

రాష్ట్రాల అభివృద్ధి జరిగితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. కాబట్టి రాష్ట్రాల అభి వృద్ధి కోసం అనేక సంస్కరణలను ప్రవేశపెట్టవలసిన అవసరం ఉన్నది.

1. రాష్ట్రపతి పాలన విధించే ముందు ముఖ్యమంత్రికి అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునే అవకాశం గవర్నర్ విధిగా ఇవ్వాలి. ఇదే విషయాన్ని, ముంబాయి/కర్ణాటక కేసులో సుప్రీంకోర్టు చెప్పింది.
2. కేంద్ర జాబితాను కుదించాలి, కేంద్ర పెత్తనానికి అవకాశాన్ని కల్పిస్తున్న ఉమ్మడి జాబితాని తొలగించాలి. రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలని ఇచ్చి కేంద్రం దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, బ్యాంకింగ్, వాణిజ్యం, విమానయానం, రైల్వే మొదలైన వాటికి పరిమితం కావాలి.
3. సర్కారియా, రాజమన్నార్, అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ కమిటీల సిఫార్సులను అమలు పరచి రాష్ట్రాల స్వయం పాలనకు అవకాశం కల్పించాలి.
4. గవర్నర్లను నియమించేటప్పుడు కేంద్రం ముఖ్య మంత్రులను సంప్రదించే సంప్రదాయం పాటించాలి.
5. రాష్ట్రాలు ఆర్థిక స్వయం సమృద్ధి పొందేందుకు ఇన్‌కమ్‌ట్యాక్స్, ఎక్సైజ్ టాక్స్‌తో పాటుగా కార్పొరేట్ పన్నుల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. కేంద్ర బడ్జెట్‌లో కేంద్రం 30% మాత్రమే ఉంచుకొని రాష్ట్రాలకు 70% కేటాయించాలి.
6. ఆయా రాష్ట్రాల జనదామాషా ప్రకారం, సామాజిక కూర్పుకు అనుగుణంగా రాష్ట్రాలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచుకునే అవకాశం ఇవ్వాలి.


ఇవన్నీ కూడా రాష్ట్రాల అభివృద్ధే దేశ అభివృద్ధి అనే భావనతో ముందుకు వెళ్తేనే సాధ్యమవుతాయి.

అనేక కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషా సాంస్కృతిక భిన్నత్వం కలిగిన భారతదేశంలో సమాఖ్య విధానం అమలు అయితేనే దేశం అభివృద్ధి చెందు తుంది. సమాఖ్య విధానం ముఖ్యలక్షణం అధికార వికేంద్రీకరణ, స్వయం పాలన. అధికార వికేంద్రీకరణ జరిగి స్వయం పాలన ఏర్పడితేనే వెనుకబడిన ప్రాంతాలు, వెనుక బడిన జాతులు (ఈశాన్య ప్రాంత తెగలు, కశ్మీర్ తెగలు) వెనుకబడిన వర్గాలు, అల్పసంఖ్యాకులు, దళితులు, ఆదివాసులకు న్యాయం జరుగుతుంది. మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఏర్పడాలన్నా, అంబేడ్కర్ కాంక్షించిన సమాఖ్య భారతం నిర్మాణం కావాలన్నా ఇండియాలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పడడం అత్యవసరం. అంబేడ్కర్, లోక్ నాయక్ జె.పి, రామ్‌మనోహర్ లోహియా స్ఫూర్తితో ఫెడరల్ ఫ్రంట్ నిర్మాణ మహాయత్నాన్ని కేసీఆర్ ముందుకు తీసుకు పోతున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సందర్భంలో, బంగారు తెలంగాణ నిర్మాణంలో కే.సీ.ఆర్‌కు తెలంగాణ ఏ విధంగా అండగా నిలబడిందో దేశాభివృద్ధి కోసం కే.సీ.ఆర్ నినదిస్తున్న ఫెడరల్ ఫ్రంట్‌కు అదే విధంగా యావత్తు తెలంగాణ అండగా నిలబడాలి.

■ డి. రాజారాం యాదవ్
ఓ.యు జె.ఎ.సి. వ్యవస్థాపక అధ్యక్షులు

(‘భారతదేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత’ అనే అంశంపై నేడు హైదరాబాద్‌లో ఎస్సీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో సదస్సు)

బెజవాడలో పెరుగుతున్న ట్రెండ్..



గతంలో వీకెండ్ వినోదమంటే సినిమాలు, నగరంలోని పార్కులకు మాత్రమే పరిమితం! ఇప్పుడు పరిస్థితి మారింది. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ కేంద్రంగా వీకెండ్స్ టూర్‌లు, సాహస యాత్రల జోరు పెరిగింది. విజయవాడకు 100 నుంచి 200 కిలో మీటర్ల లోపు ఉన్న కొత్త ప్రాంతాలను సందర్శిస్తున్నారు. యూత్ హాస్టల్స్ తరఫున దాదాపు ప్రతి వారం ఒక ట్రెక్ నిర్వహిస్తాం. ప్రతి ట్రెక్‌లో 60 మందికిపైగానే పాల్గొంటారు. ఇది మంచి పరిణామం!

– విష్ణు వర్ధన్, వైహెచ్ఏఐ, విజయవాడ యూనిట్ చైర్మన్

ఒత్తిడి దూరం..

"వారంలో ఆరు రోజులు చాలా ఒత్తిడి ఎదుర్కొంటాం. కనీసం ఒక్కరోజైనా ప్రకృతికి దగ్గరగా ఉండాలనిపిస్తుంది. అందుకే పర్యాటక ప్రాంతాలకు వెళ్తున్నాం. అక్కడ ట్రెకింగ్, సైక్లింగ్ చేయడం వల్ల శారీరక ఉల్లాసం కలుగుతోంది. దీనివల్ల ప్రకృతిని ఆస్వాదించామన్న ఆనందంతోపాటు వ్యాయామం చేశామన్న సంతృప్తి కలుగుతోంది.

– శ్రావణ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, హైదరాబాద్

'హాట్ స్పాట్స్' ఇవే...

విజయవాడ నుంచి

కొండపల్లి, మూలపాడు అడవులు, భవానీ ద్వీపం, హంసల దీవి (కృష్ణా జిల్లా), మారేడుమిల్లి, రంపచోడవరం, పాపికొండలు, దిండి రిసార్ట్స్ (తూర్పు గోదావరి), అరకు, టైడా, అనంతగిరి, బొర్రా గుహలు, కటిక జలపాతం, లంబసింగి, కైలాసగిరి, తొట్లకొండ, కంబాలకొండ (విశాఖపట్నం), భైరవకోన, నెమలిగుండం, నల్లమల అడవుల్లోని ఇతర ప్రాంతాలు (ప్రకాశం జిల్లా), సూర్యలంక బీచ్,

హైదరాబాద్ నుంచి

అనంతగిరి, భువనగిరి, బీదర్ ఫోర్ట్, నాగార్జున కొండ, మౌలాలి కొండ, దుర్గంచెరువు, గోల్కొండ, షామీర్‌పేట వైపు రిసార్ట్స్, నాగార్జున సాగర్, అమ్రాబాద్, శ్రీశైలం ఘాట్ రోడ్ డ్రైవ్, ఏపీలోని ఇతర ప్రాంతాలు.



కర్ణాటకలోని బీదర్ కోట



వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు

ప్రతి వారం.. ఓ విహారం!

సండే స్పెషల్

ఈ వీకెండ్ ఎక్కడికెళదాం!

హలో మెంబర్స్...
రేపు ఏదైనా ట్రెక్ ఉందా?

ఇట్స్ ఎ లాంగ్ వీకెండ్! కొంచెం డిఫరెంట్‌గా, లాంగ్ ట్రిప్ ప్లాన్ చేద్దామా!

ఈ ప్రశ్నలు మీరు ఎప్పుడైనా వేశారా!?
అయితే... మీరు 'ట్రాక్'లో ఉన్నట్లే!

పెరుగుతున్న సాహస పర్యాటకం.. భావసారూప్యత ఉన్న వారితో బృందాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఒకే గదిలో కూర్చుంటారా! ఆ నాలుగు గోడలనే చూస్తుంటారా! అదే ఉక్కపోతను అనుభవిస్తుంటారా! అదో బోరింగ్ వ్యవహారం! కొత్తగా కలలు కనాలి. కాళ్లు కదిలించాలి. కళ్లకు ప్రకృతిని చూపించాలి. అందుకు ఉన్న మార్గం.. వారాంతపు విహారం! శనివారం ఉదయాన్నే ఇళ్లు వదిలి వెళ్లి.. ఆదివారం సాయంత్రం దాకా ప్రకృతి-ప్రశాంతతలో తలమునకలై.. సోమవారం సరికొత్త ఉత్తేజంతో మళ్లీ పని ప్రారంభించడం! ఒకప్పుడు ఇది పాశ్చాత్య దేశాలకు పరిమితం! ఇప్పుడు మన దేశానికీ.. తెలుగు రాష్ట్రాలకూ వ్యాపించింది. 'వారం ఐదు రోజులు పనికి అంకితం! చివరి రెండు రోజులు ప్రకృతికి అంకితం!' అంటూ జనం ప్రకృతి గీతాలు పాడుతున్నారు.

దగ్గరే... మన దగ్గరే!

తరచూ దూర ప్రాంతాలకు వెళ్లడం కుదరదు! ఒకటి.. దూరం! రెండు.. ఆర్థికంగా భారం!! తరచూ సెలవులు పెట్టడం కుదరదు! అందుకే.. అవకాశాన్ని బట్టి ఏడాదికి ఒకటి రెండు లాంగ్ ట్రిప్‌లు ప్లాన్ చేస్తూ, నెలలో ఒకట్రెండు వీకెండ్ టూర్స్ వేస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. 'ఫైవ్ డే వీక్' ఉన్న వారికి శని, ఆదివారాలు కలిసొచ్చే రోజులు! వీరు 100 నుంచి 150 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలను ఇలా చుట్టేసి అలా వచ్చేస్తున్నారు. ఆదివారం మాత్రమే సెలవు ఉన్న వారు దానికి అనుగుణంగా ప్లాన్ చేసుకుంటున్నారు. ట్రెకింగ్, బోటింగ్, రాపెలింగ్, రాక్ క్లైంబింగ్, సైక్లింగ్, బైకింగ్ వంటి సాహస క్రీడలు చేసేవారు కొందరైతే.. నైట్ క్యాంపింగ్, క్యాంప్ ఫైర్, వన విహారం, ఆలయాల సందర్శనం చేసేవారు మరికొందరు! కుటుంబ సభ్యులు, బంధువులతో వెళ్లే వాళ్లు కొందరు.. భావసారూప్యత ఉన్న వ్యక్తులతో ఏర్పడే క్లబ్స్ సభ్యులతో కలిసి కొందరు.. విహారయాత్రలకు వెళ్తున్నారు! ప్రస్తుతం దాదాపు అన్ని నగరాల్లో ఇలాంటి క్లబ్‌లు, మీటప్, వాట్సాప్, పింట్‌రెస్ట్ గ్రూప్స్ వెలిశాయి. వాటిలో ఒక్కసారి చేరితే.. ప్రోగ్రామ్స్‌కు సంబంధించిన అప్‌డేట్స్ వస్తూనే ఉంటాయి. వీలు కుదిరితే వెళ్లిపోవడమే! వీకెండ్ సాహసాల్లో భాగస్వాములవ్వడమే!!

ఆనందం... ఆరోగ్యం!

మానసిక ఆనందం, ఉల్లాసం మాత్రమే కాదు! వారంలో ఒకటి రెండు రోజులు విభిన్నంగా గడపడంవల్ల అనేక ప్రయోజనాలున్నాయి. వ్యాహ్యాళి, విహారం, సాహస యాత్రలు చేసే వారిలో సానుకూల ధోరణి (పాజిటివ్ ఆటిట్యూడ్) పెరుగుతుంది. డిప్రెషన్ గురయ్యే ప్రమాదాలుండవు. ఒత్తిడిని పెంచే హార్మోన్ల విడుదల పూర్తి నియంత్రణలో ఉంటుంది. ఇవన్నీ.. మానసిక ప్రయోజనాలు. శారీరకంగా చూస్తే.. తరచూ ట్రెక్స్ చేసే వారిలో బరువు, బీపీ కంట్రోల్‌లో ఉంటాయి. మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటే వృత్తిపరంగానూ మంచి ఫలితాలు సాధిస్తారు. అన్నింటికీ మించి.. సమాజంతో మన బంధం బలపడుతుంది. వీకెండ్ ట్రిప్స్‌తో ఇన్ని లాభాలున్నాయి.



భువనగిరి కోట

టెకీల వీర 'విహారం'

వీకెండ్ టూర్స్‌కు చెక్కేసే వారిలో సాఫ్ట్‌వేర్, దాని అనుబంధ రంగాల్లో పనిచేసే వారు ఎక్కువ. ఆదాయం పెరగడం, బాదర బందీలేని జీవితం, పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోరుకోవడంతోపాటు.. 'ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు' అనే ప్రశ్న వారితో 'బ్యాక్‌ప్యాక్' సర్దుకునేలా చేస్తోంది. నవ్యాంధ్రలోని విహార కేంద్రాలైన అరకు, లంబసింగి, దిండి రిసార్ట్స్, సూర్యలంక బీచ్, కడపలోని గండికోట తదితర ప్రాంతాలకు హైదరాబాదీలే ఎక్కువగా వస్తుంటారు. శుక్రవారం సాయంత్రం బయలుదేరి సోమవారం ఉదయానికి తిరిగి చేరుకునేలా వీకెండ్ ట్రిప్స్ నిర్వహించే మీటప్, పింట్‌రెస్ట్ గ్రూప్స్ హైదరాబాద్‌లో చాలానే ఉన్నాయి. గోవా, గోకర్ణతోపాటు మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వతాల్లోని అనేక 'స్పాట్స్'కు కదిలి వెళతారు. హైదరాబాద్ శివార్లలోని అనేక రిసార్ట్స్ వీకెండ్‌లలో 'హౌస్‌ఫుల్' అవుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వీకెండ్స్ కోసం థాయ్‌లాండ్, శ్రీలంక, సింగపూర్ వంటి పొరుగు దేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.



కాకినాడ సమీపంలోని కోరింగ అభయారణ్యం

'అమరావతి'లోనూ జోష్



హైదరాబాద్‌లో వీకెండ్ ట్రిప్స్ నిర్వహించే మీటప్ గ్రూప్స్, క్లబ్స్ అనేకం ఉన్నాయి. శుక్రవారం రాత్రి బయలుదేరి సోమవారం ఉదయానికి తిరిగి వచ్చేలా ప్లాన్ చేస్తుంటారు. స్థానికంగా ఒకరోజు, సగం రోజు ట్రెక్స్, రాక్ క్లైంబింగ్, నైట్ క్యాంపింగ్ కార్యక్రమాలు కూడా ప్లాన్ చేస్తుంటారు. ఇక... ఏపీలో 'మెట్రోపాలిటన్' లక్షణాలున్న ఏకైక నగరం విశాఖలోనూ తొలి నుంచీ వారాంతపు విహారాలు అధికమే. విజయవాడలో మాత్రం రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఈ ట్రెండ్ బాగా ఊపందుకుంది. విజయవాడ 'రాజధాని' నగరం అయ్యాక అడ్వంచర్ల సంఖ్య 65 శాతం పెరిగింది. విజయవాడలోని 'యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' జూన్ నుంచి మార్చి చివరి వారం దాకా దాదాపు ప్రతి ఆదివారం ఒక ట్రెక్ నిర్వహిస్తుంది. విశాఖ జిల్లాలో స్క్యూబా డైవింగ్, పారా గ్లైడింగ్, బోట్ రైడింగ్ వంటి సాహసాలూ నిర్వహిస్తున్నారు.

కొత్త నేతలకు 'అనుబంధ' బాధ్యతలు!

- **సంఘాల పదవుల నుంచి సీనియర్లు పక్కకు**
- **నూతన నాయకత్వానికి ప్రోత్సాహం**
- **పార్టీ బలోపేతానికి టీఆర్ఎస్ వ్యూహం**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత టీఆర్ఎస్ అధిష్ఠానం పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా చర్యలు ప్రారంభించింది. సుదీర్ఘకాలం అధికారం, తెలంగాణ అంతటా బలంగా పాతుకుపోవడమే లక్ష్యంగా కొత్త నేతలను తెరపైకి తెచ్చే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందుకోసం వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాలకు గౌరవ అధ్యక్షులు, ఇతర హోదాల్లో ఉన్న పార్టీ ముఖ్య నేతలను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తోంది. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆర్టీసీ కార్మిక సంఘం టీఎంయూ గౌరవ అధ్యక్ష పదవికి రాజీనామా చేయగా, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ సహా వివిధ సంఘాల గౌరవ అధ్యక్షురాలి పదవులకు ఎంపీ కవిత శనివారం రాజీనామా చేశారు. ఇదే బాటలో పలు కార్మిక సంఘాలకు నేతృత్వం వహిస్తున్న నాయిని నర్సింహారెడ్డి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఉన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, టీఎన్జీవోల గౌరవ అధ్యక్షుడిగా ఉన్న రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ జి.దేవీప్రసాదరావు.. ఆ బాధ్యతల నుంచి తప్పుకొంటారని తెలుస్తోంది. ఇంకా ఎవరైనా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు ఇలాంటి బాధ్యతల్లో ఉంటే వారు కూడా వైదొలుగుతారని పార్టీ ముఖ్యులు చెబుతున్నారు. 2001లో టీఆర్ఎస్ ఆవిర్భవించగా, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీ నేతలు అన్ని వర్గాల్లోనూ మమేకమై ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ఆయా వర్గాలు ఏర్పాటు చేసుకున్న సంఘాల బాధ్యతలను చేపట్టారు. తెలంగాణ ఆవిర్భవించి, టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కూడా వారు ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. అయితే ప్రజాప్రతినిధిగా ఉండే పని ఒత్తిడి, సమయాభావం వల్ల 'కొసరు' బాధ్యతలకు వారు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారని, ఆయా వర్గాల అంచనాలను అందుకోలేకపోతున్నారనే అభిప్రాయం ఉంది. టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. తాను ప్రధానంగా ప్రభుత్వ కార్యకలాపాలను చూసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్‌ను నియమించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ పదవుల్లో ఉంటే స్వచ్ఛందంగా వదులుకోవాలని, కొత్త వారికి అవకాశం వచ్చేలా చూడాలని అంతర్గత సమావేశాల్లో కేసీఆర్ ఇప్పటికే నిర్దేశించారు. దీన్ని చాలా మంది పాటించారు.

పనిభారం, లోక్‌సభ ఎన్నికల వల్లే..

- **కార్మిక సంఘాల పదవులకు రాజీనామా: కవిత**



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్), తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్), తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్, తెలంగాణ గుర్తింపు పాఠశాలల యాజమాన్య సంఘం గౌరవ అధ్యక్షురాలి బాధ్యతల నుంచి నిజామాబాద్ టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత వైదొలిగారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గానికి ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శులకు పంపినట్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, రాష్ట్ర సాధన అనంతరం కార్మిక వర్గాల ప్రయోజనం కోసం పనిచేశానని వివరించారు. సంఘాల బాధ్యతల నుంచి తప్పుకొంటున్నప్పటికీ కార్మికులకు నిరంతరం అందుబాటులో ఉంటానని ఎంపీ కవిత హామీ ఇచ్చారు.

ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద తవ్వకాలు



ఫణిగిరి గుట్టపై తవ్వకాలు ప్రారంభిస్తున్న దృశ్యం

నాగారం, ఫిబ్రవరి 2: సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గుట్టపై ఉన్న బౌద్ధక్షేత్రంపై పురావస్తుశాఖ అధికారులు శనివారం తవ్వకాలు చేపట్టారు. గతంలో ఆరుసార్లు పాక్షికంగా తవ్వకాలు చేపట్టగా.. ఈ సారి పూర్తిస్థాయి విశ్లేషణకు అనుమతులు లభించాయని తెలంగాణ పురావస్తు శాఖ డైరెక్టర్ విశాలాచ్చి చెప్పారు. ఫణిగిరి బౌద్ధ క్షేత్రం దేశంలోనే అత్యంత ప్రాచీనమైనదని, గ్రీకు, రోమన్ల కాలం నుంచే ఫణిగిరి బౌద్ధ క్షేత్రానికి ప్రాముఖ్యత ఉండేదని తెలిపారు. నాటి విశేషాలను వెలికితీసేందుకే తవ్వకాలు చేపట్టామన్నారు. 90 రోజులపాటు చేపట్టనున్న ఈ తవ్వకాలకు ప్రభుత్వం రూ.56 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇంతకుముందు జరిపిన తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలను ముంబై, ఢిల్లీల్లో ఎగ్జిబిషన్లలో ప్రదర్శించామని, తాజా తవ్వకాల్లో బయల్పడే వస్తువులను 2026లో అమెరికాలో జరగనున్న అంతర్జాతీయ సదస్సులో ప్రదర్శిస్తామని చెప్పారు.

వీరప్పన్ వారసులు



- **అడవుల్లో టేకు చెట్లే వీరి టార్గెట్**
- **ఆ క్రమంలోనే పులులపైనా గురి**
- **అక్రమ రవాణాకు ప్రత్యేక కారిడార్**
- **ఆదిలాబాద్‌లో వెయ్యి కుటుంబాలు**
- **పరివర్తన కోసం సర్కారు ప్రయత్నం**



ముల్తానీల నుంచి స్వాధీనం చేసుకున్న కలప

నిర్మల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ గురించి కథలు కథలుగా విన్నాం! ఆ మీసాల ఆసామీకి వారేమీ తక్కువ కాదు. పంట మీద మిడతల దండు పడ్డట్లుగా రాత్రుళ్లు గుంపులుగా గొడ్డళ్లతో అడవి మీద విరుచుకుపడతారు. టేకు చెట్లనే లక్ష్యం చేసుకుంటారు. నరికిన కలపను 30-40 ఎడ్లబళ్లలో ఇళ్లకు తరలించుకుపోతారు. ఇదంతా ఒక్కరాత్రిలోనే పూర్తిచేస్తారు. తర్వాత అవే బండ్ల మీద కలపను ప్రధాన రహదారి దాకా తీసుకొస్తారు. బండ్ల మీద 40 మంది ఉంటే.. వాటికి ముందూ వెనుక ఎస్కార్ట్‌గా మరో 40 మంది దాకా వెళతారు. పోలీసులు, అటవీ అధికారులు కనిపిస్తే అలర్ట్ చేసేందుకు మరో 10మంది బైక్‌లేసుకొని రహదారిపై చక్కర్లు కొడుతుంటారు! కలప ఒకసారి రహదారి చేరిందంటే చాలు.. లారీల్లోకి మారి ఎటో గాయబ్ అవుతుంది! ఈ మధ్యలో అధికారులెవరైనా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలు తీసేందుకూ వెనుకాడరు. అడవుల్లో సంచరిస్తున్న వన్య ప్రాణుల పాలిట కాల యములయ్యారు. తమకు ఎదురుపడిన పులులకూ జంకట్లేదీ తెగ. వాటినీ చంపేస్తున్నారు. పోలీసులు, అటవీ అధికారులనే వణికిస్తున్న ఆ కరడుగట్టిన ముఠా ముల్తానీ తెగ ప్రజలు!

ఎవరీ ముల్తానీలు?

ముల్తానీల మూలం పాకిస్థాన్‌లోని ముల్తానీ ప్రావిన్స్. వీరిది ముస్లిం గిరిజన తెగ. దేశ విభజనకు ముందే వలస వచ్చి.. పలు రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. గుజరాత్‌లో స్థిరపడ్డ ముల్తానీలు వజ్రాలను సానపట్టడంలో సిద్ధహస్తులు. పంజాబ్‌లో ఉంటున్న ముల్తానీలు కూడా వస్త్ర వ్యాపారం, చేనేత రంగంలో స్థిరపడ్డారు. కశ్మీర్, ఇతర రాష్ట్రాల్లోనూ ముల్తానీలున్నారు. దేశ విభజన సమయంలోనే వీరిలో కొందరు ఉమ్మడి ఆదిలాబాద్‌లోని అటవీ ప్రాంతంలో స్థిరపడ్డారు. కవ్వాల్, తిర్యాణీ, ఇచ్చోడ అడవులు.. ఇతర రక్షిత అటవీ ప్రాంతాల్లో కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.

8మంది అధికారుల ప్రాణాలు తీశారు

కలప అక్రమ రవాణాకు ముల్తానీలు ప్రత్యేక కారిడార్‌నే ఏర్పాటు చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రాంతంలోని దట్టమైన అడవులు మొదలు.. నిర్మల్ జిల్లా కడెం, పెంబి, ఖానాపూర్, మామడ వరకు వీరి కారిడార్ ఉంది. ముల్తానీలు లారీలు, ట్రక్కులను హైజాక్ చేసి మరీ కలప అక్రమ రవాణాకు పాల్పడతారు. 44వ నంబరు జాతీయ రహదారిపై ఖాళీగా వెళ్లే లారీలు, ట్రక్కులను లక్ష్యంగా చేసుకుంటారు. లిఫ్ట్ అడిగి డ్రైవర్లను బెదిరిస్తారు. వాహనాలను దారిమళ్లించి వాటిల్లో కలప దుంగలను నింపి తరలిస్తారు. గత ఐదేళ్లలో ముల్తానీల దాడుల్లో 8 మంది అటవీ అధికారులు మృతిచెందారు. గత ఏడాది పెంబి ప్రాంతంలో కలపను తరలిస్తుండగా అడ్డుకున్న అటవీ సిబ్బందిని ముల్తానీలు చితకబాదారు. కొన్నిచోట్ల పులుల కళేబరాలు లభ్యం కావడం.. ఈ దారుణానికీ వీరే కారణం అని నిర్ధారణ కావడంతో ప్రభుత్వం వీరిపై దృష్టిపెట్టింది. ఈ ఘటన తర్వాతే అటవీ సిబ్బందికి తుపాకులు అందించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

ప్రత్యామ్నాయ ఉపాధి

ముల్తానీ తెగలో పరివర్తనకు రాష్ట్ర సర్కారు సన్నద్ధమైంది. కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలంటూ సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో ముల్తానీలపై అధికారులు దృష్టిసారించారు. హైదరాబాద్ ధూల్‌పేటలో గుడంబా వ్యాపారమే ప్రధాన వృత్తిగా ఉన్న లోధా క్షత్రియుల్లో ఎక్సైజ్‌శాఖ మార్పు తీసుకొచ్చినట్లే.. ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించడం ద్వారా ముల్తానీల్లో మార్పు తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు వారికి కౌన్సెలింగ్ మొదలుపెట్టారు. మహిళలకు కుట్టుపని, ఎంబ్రాయిడరీ, ఇతర కుటీర పరిశ్రమలకు సంబంధించిన వృత్తులు.. పురుషులకు ఆటోలు, క్యాబ్‌లు వంటివి ఇప్పించడంతోపాటు స్వయం ఉపాధి, ఇతర వృత్తుల వైపు మళ్లించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకించి ఇచ్చోడ మండలం కేశవపట్నం, గుండాల, జోగిపేట, ఎల్లమ్మ గూడల్లో నివసించే ముల్తానీలపై దృష్టి సారించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో వెయ్యిదాకా ముల్తానీల కుటుంబాలు ఉండగా.. ఈ నాలుగు గ్రామాల్లో 100 కుటుంబాలున్నాయి.

అడవుల పరిరక్షణలో ప్రజాప్రతినిధులు

'జంగల్ బచావో.. జంగల్ బడావో' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చిన నేపథ్యంలో.. అటవీ అధికారులు చర్యలు ప్రారంభించారు. అడవుల పరిరక్షణలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లతో అటవీశాఖ అధికారులు విడతల వారీగా సమావేశమవుతున్నారు. ఎన్నికల్లో విజయానికి గుర్తుగా ప్రజాప్రతినిధులతో స్థానిక అడవుల్లో మొక్కలు నాటిస్తున్నారు. కలప అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అటవీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. సాయుధ పోలీసులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సామిల్లుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కమాండ్ కంట్రోల్ కేంద్రాల నుంచి ఆయా సామిల్లులకు వచ్చే వాహనాలు, అవి ఎక్కడికెళ్తున్నాయి? ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనే వివరాలపై నిఘా పెడుతున్నారు. ప్రతి సామిల్లు వద్ద స్టాక్ రిజిస్టర్ ఏర్పాటు చేసి, అందులో కలప వివరాలు నమోదు చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు.

పులుల సంరక్షణపై పిల్

ఎల్లుండి హైకోర్టులో విచారణ

కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులోని పులుల సంరక్షణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. హైదరాబాద్‌కు చెందిన దియాసుర్ అనే మహిళ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ జరగనుంది.

స్మగ్లింగ్ నిరోధానికి చర్యలు

ముల్తానీ కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. కలప స్మగ్లింగ్ నిరోధానికి జాయింట్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాం. అటవీ సిబ్బంది, పోలీసు బలగాలతో గస్తీ పెంచుతున్నాం. పదేపదే స్మగ్లింగ్‌కు పాల్పడేవారిపై పీడీ చట్టాన్ని ప్రయోగిస్తాం.

– ప్రభాకర్, డీఎఫ్‌వో, ఆదిలాబాద్

పక్కా వ్యూహంతో..



అక్రమ కలప వ్యాపార నిర్మూలనకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నాం. ఇందుకోసం కంట్రోల్ సెల్‌లను ఏర్పాటు చేశాం. డయల్ 100తో పాటు స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ సెల్ నంబరు 8333986939, పోలీసు కంట్రోల్ రూం నంబరు 08734-242133కు కలప అక్రమ రవాణా, జంతువుల వేటపై ఫిర్యాదు చేయవచ్చు.

–శశిధర్ రాజు, నిర్మల్ ఎస్పీ



ఇంధన పొదుపులో రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ఆర్టీసీ డ్రైవర్‌కు బహుమతి అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ, ఈడీ రవీందర్ తదితరులు

ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు పాటుపడాలి

▸▸ ఇంధన పొదుపు అవార్డుల ప్రదానోత్సవంలో సునీల్ శర్మ

రాంనగర్/హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్లు ఇంధనాన్ని ఆదా చేయాలని, తద్వారా ఆర్టీసీ అభివృద్ధి పథంలో కొనసాగే అవకాశం ఉందని ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ సూచించారు. శనివారం ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన కేఎంపీఎల్ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రాష్ట్రస్థాయిలో 11 మంది ఉత్తమ డ్రైవర్లకు జ్ఞాపికలు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో బి.అనంతయ్య(మియాపూర్-2 డిపో), జె.ఆర్.రెడ్డి(ఉప్పల్), గౌస్ (మహబూబ్‌నగర్), కె.బుచ్చయ్య(హైదరాబాద్-1), పి.రమేశ్(వరంగల్-2), కేపీసీ రావు(మధిర), టి.మల్లేశం(సిద్దిపేట), దేవ(సూర్యాపేట), కె.శ్రీనివాస్ (మంచిర్యాల), సీహెచ్.లక్ష్మయ్య(కరీంనగర్-1), డి.మనోహర్(నిజామాబాద్-2) ఉన్నారు.

చట్టాలపై సర్పంచ్‌లకు శిక్షణ

4న రాష్ట్రస్థాయిలో అధికార్లకు.. అనంతరం జిల్లాల్లో సర్పంచ్‌లకు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు శిక్షణనివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్పంచ్‌లందరికీ చట్టాలు, పాలన, అధికారాలు, విధులు, నిధులు, వాటి అమలు తదితర అంశాలపై ప్రభుత్వం శిక్షణనివ్వనుంది. ఇందులో భాగంగా ఎంపీడీవోలు, ఈఓపీఆర్‌ఆర్‌డీ తదితర అధికారులకు ఈ నెల 4న హైదరాబాద్‌లో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఆయా అంశాలపై తర్ఫీదుపొందిన అధికారులు త్వరలో జిల్లా స్థాయిలో సర్పంచ్‌లకు శిక్షణనిస్తారు. కాగా.. సోమవారం నాటి సమావేశానికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

ఆ అప్పీలును 4 వారాల్లో పరిష్కరించాలి

▸▸ సమాచార కమిషన్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం కింద దాఖలైన అప్పీళ్లను 4 వారాల్లోగా పరిష్కరించాలని రాష్ట్ర సమాచార కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్ ఇటీవల ఆదేశాలిచ్చారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించని ప్రైవేటు ఆస్పత్రులపై తీసుకున్న చర్యలను తెలపాలని కోరుతూ.. ఎం.శ్రీనివాస్ అనే వ్యక్తి 2017లో వైద్య విద్య డైరెక్టర్‌కు దరఖాస్తు చేశారు. దీనిపై సరైన స్పందన లేకపోవడంతో నిరుడు సెప్టెంబరులో ఆయన రాష్ట్ర సమాచార కమిషన్‌కు అప్పీలు చేశారు. అక్కడా పెండింగ్‌లో పడిపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు.

అర్హులైన ఉప కలెక్టర్ల జాబితా పంపండి: ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కన్‌ఫర్డ్ ఐఏఎస్ జాబితాలో తమనూ చేర్చాలన్న డిప్యూటీ కలెక్టర్ల విజ్ఞప్తిపై ప్రభుత్వం స్పందించింది. సబ్‌స్టాన్సివ్ వేకన్సీస్‌లో పదోన్నతి పొంది, జనవరి 1వ తేదీ నాటికి డిప్యూటీ కలెక్టర్‌గా 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారి జాబితా పంపించాలని సీసీఎల్‌ఏ కార్యదర్శిని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఆదేశాలు జారీచేశారు. తెలంగాణలో 233 మంది డిప్యూటీ కలెక్టర్లు/స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు ఉన్నారు. వీరిలో 2019 జనవరి నాటికి 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 10 మంది జాబితాను కన్‌ఫర్డ్ ఐఏఎస్ కోసం ఇప్పటికే కేంద్రానికి పంపించారు. పలువురు డిప్యూటీ కలెక్టర్ల విజ్ఞప్తి మేరకు నిరంతరం గుర్తించిన ఖాళీల్లో 8 ఏళ్ల సర్వీసు పూర్తయిన వారి చిట్టా అందించాలని నిర్దేశించారు.

సీఎంకు 'ఈఆర్సీ' నామినేషన్ల జాబితా

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) చైర్మన్, మెంబర్(టెక్నికల్), మెంబర్(ఫైనాన్స్) పోస్టులకు దాఖలైన 49 నామినేషన్లు సీఎం కేసీఆర్‌కు చేరాయి. ప్రతి పోస్టుకు ఇద్దరేసి సభ్యుల జాబితాను త్రిసభ్య కమిటీ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందిస్తే.. ఆ తర్వాతే ఆ ఆరుగురిలో ముగ్గురిని ఎంపిక చేసి ఒకర్ని చైర్మన్‌గా ఇద్దరిని మెంబర్లు(టెక్నికల్, ఫైనాన్స్)గా నియమించనున్నారు.

పేదలకిచ్చే బియ్యంలో రాజీపడొద్దు: మారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతలో ఏ మాత్రం రాజీ పడవద్దని రైస్ మిల్లర్లను పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ప్రజాపంపిణీకి 3.5 లక్షల టన్నుల దొడ్డు, 1.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సేకరణ కోసం పౌర సరఫరాల సంస్థ టెండర్లను ఆహ్వానించింది. సేకరణ, ధర విషయంలో సంప్రదింపులు జరిపేందుకు రైస్‌మిల్లర్లతో చైర్మన్ మారెడ్డి, కమిషనర్ అకున్ సభర్వాల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు.

డీటీసీ కమిషనర్ పదోన్నతులకు కోటా

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలోని కీలకమైన డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) పోస్టులను పదోన్నతులపై భర్తీ చేయడానికి ప్రభుత్వం కోటాను నిర్ధారించింది. ఈ మేరకు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ పదోన్నతులు ఇచ్చేటపుడు తమకూ అవకాశం కల్పించాలంటూ రవాణాశాఖలో పనిచేసే అసిస్టెంట్ సెక్రటరీలు డిమాండ్ చేశారు. దీంతో రవాణా శాఖ కమిషనర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. సీఎం కేసీఆర్ ఈ ఫైలుకు ఆమోదం తెలిపారు. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ప్రకారం ఆర్టీఓలు, అసిస్టెంట్ సెక్రటరీలకు 24:1 నిష్పత్తి ప్రకారం పదోన్నతులుంటాయి.

మైక్రో ఇరిగేషన్‌లో వెసులుబాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద మైక్రో ఇరిగేషన్ పథకంలో ఇప్పటికే లబ్ధిపొందిన రైతులకు మరోమారు ఎలక్ట్రిక్ మోటార్లను పొందడానికి అవకాశం ఇచ్చారు. ఈ మేరకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి శనివారం జీవో జారీ చేశారు. ఉద్యానశాఖ డైరెక్టర్‌తో పాటు వరంగల్ జిల్లా కలెక్టర్ ఈ మేరకు విజ్ఞప్తి చేయడంతో ఈ వెసులుబాటు ఇచ్చారు.

ఆపద్బంధు కింద రూ.2.89 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆపద్బంధు పథకం కింద 18 జిల్లాలకు రూ.2.89 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2010-11 నుంచి 2017-18 సంవత్సరం దాకా ఈ పథకం కింద బాధిత కుటుంబాలకు రూ.50 వేల దాకా సహాయం అందించాల్సి ఉంది.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి: తమ్మినేని

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రధాని మోదీ మొండిచేయి చూపారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఉద్యానవర్సిటీ, గిరిజన విశ్వవిద్యాలయం, ఖమ్మంలో ఉక్కు ఫ్యాక్టరీ, ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం, ఎన్‌హెచ్‌ఏఐకి రోడ్ల కనెక్షన్, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి నిధులు కేటాయించాలని రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి పంపినా మోదీ సర్కారు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రానికి తక్షణం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్ రూపంలో బీజేపీ మేనిఫెస్టో: కోదండ

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోను బడ్జెట్ రూపంలో ప్రకటించిందని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు కోదండరాం ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై కోదండరాం అభిప్రాయాన్ని వీడియో సందేశం రూపంలో టీజేఎస్ శనివారం విడుదల చేసింది. విద్య, వైద్య రంగాలపై బడ్జెట్‌లో అనేక పరిమితులున్నాయని, నిత్యావసరాల పెరుగుదల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదని విమర్శించారు.

ఖమ్మం జడ్పీ చైర్‌పర్సన్ కవిత రాజీనామా

ఖమ్మం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత శనివారం తన పదవికి, వెంకటాపురం జడ్పీటీసీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు అందజేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఓటమి, ఉమ్మడి జిల్లాలో టీఆర్ఎస్ పరాజయంతో మనస్తాపం చెంది, రాజీనామా చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ ఆమె రాజీనామా పత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. ఆమోదించాల్సి ఉంది.

పెద్ద రైతుకు భూరి సాయం

బడా రైతులకే ఎక్కువ లబ్ధి.. 5 లక్షల మంది గుప్పిట్లో 50 లక్షల ఎకరాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆత్మహత్యలు చేసుకోకూడదని.. సాగుకు పెట్టుబడి కోసం ఇబ్బందులు పడకూడదని, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి కష్టాలపాలు కాకూడదని, రైతు ఆదాయం రెట్టింపు కావాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అమలు చేస్తోంది. చిన్న రైతు కూడా ఈ పథకంతో లబ్ధి పొందుతున్నా... బడా రైతులకే ఇది ఆత్మ బంధువుగా మారింది. పథకం కింద అందిస్తున్న నగదు సాయంలో అత్యధికంగా పెద్ద రైతులకే అందుతోంది. చిన్న రైతులతో పోలిస్తే, పెద్ద రైతులకు ఐదు రెట్లు అధికంగా ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం 'పీఎం-కిసాన్' పేరిట పెట్టుబడి సాయం పథకాన్ని తెరపైకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న ఒక్కో రైతుకు రూ.6 వేల చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, 'రైతుబంధు' పథకం ద్వారా ఎవరెవరికి ఎంత లబ్ధి కలుగుతోందనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సాగు భూమి 140 లక్షల ఎకరాలు. గడిచిన ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్లలో 'రైతుబంధు' పథకం లబ్ధిదారులుగా రాష్ట్రవ్యాప్తంగా 52 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో 5 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు 47 లక్షల మంది. కాగా, 5-10 ఎకరాలు, అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు 5 లక్షల మంది ఉన్నారు. వీరిలో 47 లక్షల రైతులకు కలిపి 90 లక్షల ఎకరాల భూ విస్తీర్ణం ఉండగా.. 5 లక్షల మంది రైతులకు 50 లక్షల ఎకరాల భూ విస్తీర్ణం ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎకరానికి రూ.8 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందించింది. మొత్తంగా రూ.11,200 కోట్ల వరకు పంపిణీ చేసింది. ఇందులో, చిన్న, సన్నకారు రైతులకు అందిన రైతుబంధు సాయం సగటు తక్కువగా ఉంది. అర ఎకరం ఉంటే రూ.4 వేలు రావచ్చు. 5 ఎకరాలున్న రైతుకు రూ.40 వేలు అందొచ్చు. మొత్తంగా 90 లక్షల ఎకరాలున్న రైతులందరికీ కలిపి రూ.7200 కోట్లు అందాయి. అంటే, ఒక్కొక్కరికి సగటున రూ.15,319 అందాయి. ఇక, 5-10 ఎకరాల మధ్య భూమి ఉన్న రైతులు 4 లక్షల మంది; 10 ఎకరాలకు మించి పదులు, వందల ఎకరాలున్న రైతులు మరో లక్ష మంది ఉన్నారు. దాదాపు 50 లక్షల ఎకరాలున్న వీరందరికీ కలిపి రూ.4000 కోట్లు పంపిణీ చేశారు. వారికి ఒక్కొక్కరికి సగటున రూ.80 వేలు అందినట్లయింది. దాంతో, రైతు బంధు పథకంతో చిన్న, సన్నకారు రైతుల కంటే బడా రైతులకే ఎక్కువగా ఆర్థిక లబ్ధి చేకూరిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి, కొంత మంది బడా రైతులు తమకు పెట్టుబడి సాయం వద్దని నిరాకరించారు. చెక్కులను తిరిగి ఇచ్చేశారు. కానీ, వారి సంఖ్య పరిమితమే. ఇక, వచ్చే ఏడాది నుంచి పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలకు పెంచనుంది. దాంతో, చిన్న, సన్నకారు రైతుకు సగటున రూ.19,149 చొప్పున దక్కనుంది. అదే పెద్ద రైతుకు రూ.1 లక్ష చొప్పున అందనుంది. మొత్తంగా 5 లక్షల మంది పెద్ద రైతులకు రూ.5000 కోట్లు, 47 లక్షల మంది చిన్న రైతులకు కలిపి రూ.9000 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది.



రైతుబంధులో ఎవరికి అందేది ఎంత?

రైతుల కేటగిరీ	విస్తీర్ణం	రైతుల సంఖ్య	సగటు లబ్ధి	పంపిణీ మొత్తం (8 వేల చొప్పున)	10 వేల చొప్పున (పంపిణీ చేయాల్సింది)	సగటు లబ్ధి
5 ఎకరాల వరకు	90 లక్షల ఎకరాలు	47 లక్షలు	15,319	రూ. 7,200 కోట్లు	రూ. 9 వేల కోట్లు	రూ. 19,149
5 ఎకరాలకు మించి	50 లక్షల ఎకరాలు	5 లక్షలు	80,000	రూ. 4 వేల కోట్లు	రూ. 5 వేల కోట్లు	రూ. 1 లక్ష



మాట్లాడుతున్న రెడ్డి జాగృతి జాతీయ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

24న పరేడ్ గ్రౌండ్స్‌లో కృతజ్ఞత సభ: రెడ్డి జాగృతి

పంజాగుట్ట/హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు ఈ నెల 24న పరేడ్ గ్రౌండ్స్‌లో 10 లక్షల మందితో కృతజ్ఞత సభను నిర్వహించనున్నట్లు రెడ్డి జాగృతి జాతీయ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 5న శంషాబాద్ మల్లిక కన్వేషన్‌లో బహిరంగ సభ పోస్టర్‌ను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆవిష్కరిస్తారన్నారు. ఈ సభకు రావాలని ప్రధాని మోదీకి రెండు రోజుల క్రితమే వినతిపత్రం అందజేశామని తెలిపారు. సభకు మోదీతోపాటు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్ హాజరవుతారని చెప్పారు. ప్రాంతాలకతీతంగా ఆర్థిక బలహీనవర్గాలవారు హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి 6 నెలలుగా లేని జీతం

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీల పరిస్థితి దయనీయంగా మారింది. వీరి వేతనాలకు సంబంధించిన ఫైలు ఆర్థిక శాఖలోనే మూలుగుతుండటంతో ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2018-19 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 132 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 863 మందిని గెస్ట్ లెక్చరర్లుగా నియమించుకున్నారు. వీరికి ఈ ఏడాదే వేతనం కూడా పెంచారు. దీని ప్రకారం ప్రతి క్లాసుకు రూ.300 చొప్పున నెలకు గరిష్ఠంగా 72 క్లాసులకు గానూ రూ.21,600 చెల్లిస్తారు. అయితే వేతనం పెరిగినప్పటి నుంచి ఒక సెమిస్టర్ కూడా పూర్తయింది. అయినప్పటికీ వారికి వేతనాలు మాత్రం అందడం లేదు. ఈ ఫైలు గతంలోనే కళాశాల విద్యాశాఖ ఆర్థిక శాఖకు పంపించింది. ఆర్థికశాఖలో ఈ ఫైలుకు ఆమోదం లభించకపోవడంతో వేతనాలు పెండింగ్‌లో పడిపోయాయి. ఇంటర్మీడియట్ గెస్ట్ ఫ్యాకల్టీకి మాత్రం వేతనాలందాయి. దీంతో తమకూ వేతనాలందేలా చర్యలు తీసుకోవాలని డిగ్రీ గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు.

బడ్జెట్‌లో మంచిని స్వీకరించండి

▸▸ విపక్షాలవి రాజకీయ విమర్శలు: లక్ష్మణ్

▸▸ 2 కోట్ల మందికి ఉపాధి: దత్తాత్రేయ

▸▸ బాబు రాజీనామా చేయాలి: కిషన్

▸▸ కేంద్ర బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ భేటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు మంచి చేసే ఉద్దేశంతో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మంచిని స్వీకరించకుండా రాజకీయ విమర్శలు చేస్తారా? అని టీఆర్ఎస్ నేతలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. రైతుకు మేలు చేసే కార్యక్రమాన్ని రూపొందిస్తే దానిపైనా కొందరు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌పై బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)లో శనివారం సెంటర్ ఫర్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆ సంస్థ ప్రతినిధి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. వేలాది కోట్ల రూపాయల మొండి బకాయిలను రాబట్టిన ఘనత మోదీ సర్కారుదే అన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో తెలంగాణ ఎందుకు చేరడం లేదని టీఆర్ఎస్ సర్కారుని ప్రశ్నించారు. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ చెప్పిన 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' నినాదానికి నిదర్శనంగా బడ్జెట్ ఉందని కొనియాడారు. ఈపీఎఫ్‌వోలో 2 కోట్ల మందికి కొత్తగా ఖాతాలు తెరిచినట్టు గణాంకాలు చెబుతున్నాయని, వాళ్లంతా వివిధ రంగాల్లో కొత్తగా ఉద్యోగాలు పొందారని తెలిపారు. బీజేపీ 2014లో ఈవీఎంల ట్యాంపరింగ్ చేసి గెలిచిందంటున్న చంద్రబాబు కూడా అలాగే గెలిచారా? అని ప్రశ్నించారు. ఆయన సీఎం పదవికి రాజీనామా చేశాకే ఈవీఎంల గురించి మాట్లాడాలని సవాల్ చేశారు. అంబానీ లాంటి బడాబాబులను పెంచి పోషించిందే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు.

బడ్జెట్‌కు అన్ని వర్గాల మద్దతు

మరోవైపు కిషన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌కు దేశంలోని అన్ని వర్గాల మద్దతు లభించిందన్నారు. ప్రధాని మోదీ ఆర్థిక వ్యవహారాలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో, విప్లవాత్మక నిర్ణయాలతో చక్కదిద్ది ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి తీసుకొచ్చారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, క్రమశిక్షణతో సాధించిన ఫలితాలను ప్రజలకు అందించే పథకాలకు బడ్జెట్ ప్రతిబింబిస్తోందన్నారు. తాము చెల్లించే పన్నులను బీజేపీ ప్రభుత్వం దేశ ప్రగతి, పేదల సంక్షేమానికే వినియోగిస్తుందనే నమ్మకం పన్ను చెల్లింపుదారుల్లో కలిగిందన్నారు. పంజాగుట్టలో ట్రామా సెంటర్, యాదాద్రికి ఎంఎంటీఎస్, చర్లపల్లిలో రైల్వే షెడ్ తదితర పథకాలతో తెలంగాణకు కూడా బడ్జెట్‌లో పెద్దపీట వేశారని కొనియాడారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలు మోదీ, బీజేపీ చుట్టూ తిరుగుతాయని కిషన్‌రెడ్డి చెప్పారు.

ప్రజలకు మేలు చేసే బడ్జెట్: రాంమాధవ్



నిజామాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర బడ్జెట్ ప్రజలకు మేలు చేసే విధంగా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ అన్నారు. 50% ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగ పడేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. కిసాన్ యోజన పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం వస్తే జూలైలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడ్తామన్నారు. విపక్షాలవి అనవసరపు విమర్శలని, దేశంలో ఆర్థిక స్థిరత్వం సాధించే దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రధాని మోదీ కృషి వల్లే కేంద్రానికి ఆదాయం భారీగా పెరిగిందన్నారు. ఈ నెల 13న నిజామాబాద్‌లో నిర్వహించే శక్తి కేంద్రాల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు అమిత్ షా పాల్గొంటారని తెలిపారు. ఎన్ని కూటములు ఏర్పాటు చేసినా మళ్లీ ఎన్డీయే అధికారంలోకి రావడం ఖాయమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెరుగైనఫలితాలు సాధిస్తామని బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు కె.లక్ష్మణ్ చెప్పారు.

మోసం చేసిన బీజేపీ, టీఆర్ఎస్: దాసోజు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై తెలంగాణ ప్రజలను మోసం చేశాయని కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. చివరి బడ్జెట్‌లోనూ బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను వంచించిందని విమర్శించారు. ఇది టీఆర్ఎస్ ఎంపీల వైఫల్యమేనని, ఎంపీల బానిసత్వాన్ని అదనుగా తీసుకొని రాష్ట్రానికి బీజేపీ మొండిచెయ్యి చూపిందని అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ప్రాజెక్టులకు నిధులివ్వాలని ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులకు సీఎం కేసీఆర్ వినతి పత్రాలిచ్చినా కేంద్రం నిధులు కేటాయించలేదన్నా రు. కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు, జాతీయహోదా తెస్తామన్న టీఆర్ఎస్ ఎంపీలు నిరసన అయినా ప్రకటించలేదన్నారు. రాష్ట్ర విభజన హామీలపై కేం ద్రం కనీస ప్రకటన చేయలేదని, ప్రజల నోట్లో టీఆర్ఎస్ ఎంపీలు మన్ను కొట్టారని మండిపడ్డారు. దోపిడీదారులకు, కార్పొరేట్లకు రూ.3.5 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం రైతాంగానికి రోజుకు రూ.17 మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. దేశంలో సగటున ఒక రైతుకు రూ.47 వేల అప్పు ఉంటే ఎంగిలి మెతుకులా ఏడాదికి రూ.6 వేలు ప్రకటించారని ఎద్దేవా చేశారు. ఓట్లు దండుకోవడానికి మాత్రమే ఈ పథకాన్ని ప్రకటించారని, ఇది రైతులను అవమానించడమే అన్నారు. రానున్న ఎన్నికల్లో రైతులు బీజేపీకి కర్రుకాల్చి వాతపెడ్తారని తెలిపారు.

నా పెళ్లికి 800 ఖర్చయింది

▸▸ ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి



బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసి చూడు.. ఇల్లు కట్టి చూడు అన్నారు! పెళ్లంటే అంత ఖర్చు మరి! అలాంటిది ఆర్థికంగా ఉన్నత కుటుంబంలో పుట్టి యువతి పెళ్లి ఎంత అంగరంగ వైభవంగా నిర్వహిస్తారో.. ఎంత ఖర్చవుతుందో ఊహకే అందదు అవునా! అయితే, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి పెళ్లికి రూ.800 మాత్రమే ఖర్చయిందంటే నమ్ముతారా? ఈ విషయాన్ని ఆమే స్వయంగా పంచుకున్నారు. కర్ణాటకలోని మైసూరు జిల్లా సుత్తూరు జాతర మహోత్సవంలో భాగంగా శనివారం జరిగిన సామూహిక వివాహాల కార్యక్రమంలో సుధామూర్తి పాల్గొన్నారు. '1978లో నారాయణమూర్తితో నా పెళ్లికి రూ.800 ఖర్చయింది. పెళ్లిళ్లను నిరాడంబరంగా చేసుకోండి. ఆనందమయమైన వైవాహిక జీవితం గడపండి' అంటూ ఆమె యువతకు పిలుపునిచ్చారు. దంపతులకు ఆమె మంగళసూత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి కూడా పాల్గొన్నారు.



సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ నేతలు

మీ తాతలు దిగొచ్చినా.. కాంగ్రెస్‌ను కదిలించలేరు

▸▸ బలమైన నాయకులే కొట్టుకుపోయారు

▸▸ సన్మాన కార్యక్రమంలో టీఆర్ఎస్‌పై భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది కదా.. ఇక వారు మాట్లాడరు.. మాట్లాడినా మంద బలంతో నొక్కేద్దామనే ఆలోచనలో ఉన్నారేమో! మాది సిద్ధాంతాలు కలిగిన పార్టీ. ఒక్కోసారి అసెంబ్లీలో తక్కువ మంది ఉన్నా.. మారుమూల ప్రాంతాల్లోనూ వెళ్లూనుకున్న పార్టీ. నువ్వు కాదు కదా.. నీ తాతలు దిగొచ్చినా కాంగ్రెస్‌ను కదిలించలేరు.. పెకిలించలేరు" అని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క టీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో తాము మళ్లీ లేస్తామన్నారు. టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో శనివారం భట్టిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ నేతల చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నట్లుగా ఉన్నాయన్నారు. గతంలో వచ్చిన వారి కంటే బలమైన నాయకులు కాలగర్భంలో కలిసి పోయారన్నారు. అలాంటి బలమైన రాజకీయ పార్టీకి మనం వారసులమని, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ ముఖ్య నేతల, ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు తనను సీఎల్పీ నేతగా నియమించిన పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి భట్టి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలందరి గొంతుకగా ఒళ్లు దగ్గర పెట్టుకొని పని చేస్తానని మాటిచ్చారు. నిధులు, నీళ్లు, నియామకాలు, ఆత్మ గౌరవంతో బతికేందుకే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వచ్చిందని, సామాజిక తెలంగాణ నిర్మాణం జరగాలనే సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని చెప్పారు. అయితే, ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ నాలుగు లక్ష్యాలకు భిన్నంగా పని చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత రాహుల్‌ను ప్రధానిని చేసేందుకు ప్రతి నేత, కార్యకర్త కంకణబద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు. ఓబీసీ సెల్ నాయకులపై టీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడితే తన దృష్టికి తేవాలని, వారికి అండగా నిలుస్తామన్నారు. కాగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలపైనే సస్పెన్షన్ వేటు ఎక్కువగా వేస్తున్నారని, పార్టీలో ఎవరు తప్పు చేసినా శిక్ష ఒకేలా ఉండాలని టీపీసీసీ మాజీ చీఫ్ వి.హన్మంతరావు సూచించారు. స్వశక్తితో గెలిచిన 2,700 మంది కాంగ్రెస్ సర్పంచ్‌లకు సన్మానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓడిన వారికి ఇంచార్జి పదవులిచ్చారని, వారు అందర్నీ కలుపుకొని పోవాల్సిన అవసరం ఉందని ఓబీసీ సెల్ చైర్మన్ చిత్తరంజన్‌దాస్ సూచించారు.

అంబర్‌పేట నేతల బాహాబాహీ

భట్టి సన్మాన సభలో వీహెచ్ అనుచరులు, టీపీసీసీ ఓబీసీ సెల్ నగర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్ అనుచరుల మధ్య చెలరేగిన వివాదం బాహాబాహీకి దారి తీసింది. వీహెచ్‌కు వ్యతిరేకంగా శ్రీకాంత్ అనుచరుల నినాదాలతో గాంధీభవన్ దద్దరిల్లింది. పరిస్థితి సద్దుమణిగిన తర్వాత శ్రీకాంత్‌ను ఓబీసీ సెల్ నగర అధ్యక్ష బాధ్యతల నుంచి చిత్తరంజన్‌దాస్ తొలగించారు.

ఈవీఎంల్లో సమాచారాన్ని తొలగించారు

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంల్లో ట్యాంపరింగ్ జరిగిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. వికారాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయి గడ్డం ప్రసాద్‌కుమార్, పార్టీనేతలు మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) రజత్‌కుమార్‌కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. వికారాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో తప్పుడు విధానాలతో టీఆర్ఎస్ అభ్యర్థి ఎం.ఆనంద్ 2993 ఓట్ల తేడాతో గెలిచినట్లు ప్రకటించారని ఆరోపించారు. లెక్కింపులో అవకతవకలపై తాము హైకోర్టులో ఎన్నికల పిటిషన్(ఈపీ)ను దాఖలు చేశామన్నారు. వికారాబాద్ నియోజకవర్గ అభ్యర్థులకు సమాచారం ఇవ్వకుండానే కలెక్టర్ స్థానిక నేతలను పిలిచి ఈవీఎంలను తెరిచారని, 122 ఈవీఎంల్లోని సమాచారాన్ని తొలగించారని తెలిపారు. వికారాబాద్ కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఈ అంశంపై గాంధీభవన్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మర్రి శశిధర్‌రెడ్డి, నిరంజన్, పార్టీ నేతలతో కలిసి ప్రసాద్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
ఆదివారం • 3 ఫిబ్రవరి 2019



గుండెలోతుల్లోని ప్రేమను గుట్టుగా చెప్పాలంటే వేల మాటలెందుకు? వందల కవితలెందుకు? ఓరగా ఒక్క చూపు చూసి, సన్నగా కన్ను కొడితే చాలదా? ఆ మధ్య ఈ పనే చేసింది ప్రియా ప్రకాశ్ వారియర్. ఆమె చూసిన ఓర చూపులకు కుర్రకారు మనసు పారేసుకున్నారు. 2018లో 'మోస్ట్ గూగుల్డ్ యాక్ట్రెస్'గా గుర్తింపు పొందిన ప్రియ 'నవ్య'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

ఆ పని చేస్తే... మొత్తం మారిపోతుందంతే!

మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోండి?

నేను పుట్టి పెరిగింది అంతా కేరళలోనే. నాన్న సెంట్రల్ ఎక్సైజ్‌లో పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. ఒక తమ్ముడున్నాడు. ఏడో తరగతి చదువుతున్నాడు. నేను బీకామ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాను. చిన్నతనం నుంచీ నటి కావాలన్నదే నా ధ్యేయం. మా ఇంట్లో వాళ్లకు సినిమాలతో సంబంధం లేదు. అయినా నా ఇష్టాన్ని గుర్తించి, గౌరవించి, ప్రోత్సహించారు. వారిచ్చిన ప్రోత్సాహంతోనే కాలేజీలో చేరగానే ఫ్యాషన్ షోల్లో పాల్గొనేదాన్ని. ఆడిషన్స్‌కు వెళ్లేదాన్ని.

ఎన్నిసార్లు ఆడిషన్స్ ఇచ్చారు? ఆ సమయంలో నెర్వస్ ఫీలయ్యేవారా?

మలయాళ చిత్రం 'ఒరు అడార్ లవ్'కు (తెలుగులో 'లవర్స్ డే'గా వస్తోంది) ముందు రెండు ఆడిషన్స్ చేశాను. ఈ చిత్రం నా మూడో ఆడిషన్. నిజానికి నేను నా ఫస్ట్ ఆడిషన్‌కి అసలు టెన్షన్ పడలేదు. చిల్‌గా ఉన్నా. వాతావరణం సరదాగా అనిపించింది. వాళ్లు నన్ను సెలెక్ట్ చేసి షూటింగ్‌కు కూడా రమ్మన్నారు. కానీ అప్పుడు ప్లస్‌టూ ఎగ్జామ్స్ జరుగుతుండటం వల్ల వెళ్లలేకపోయా. రెండోసారి ఆడిషన్ చేసినప్పుడు ఒక రకమైన టెన్షన్ మొదలైంది. 'ఒరు అడార్ లవ్'కి కూడా కంగారుగానే ఆడిషన్ ఇచ్చా. అయినా సెలక్ట్ చేసుకున్నారు. నా డిగ్రీ సెకండ్ ఇయర్ క్లాసులు, ఈ సినిమా షూటింగ్ ఒకేసారి మొదలయ్యాయి.

రెండూ ఒకేసారి అనగానే చదువా, సినిమానా అనే డైలమా మొదలైందా?

(నవ్వుతూ)... పెద్ద డిస్కషన్ అండీ బాబూ! 'దీని మీద ఎక్కువ దృష్టి పెట్టి నీ స్టడీస్‌ని డ్రాప్ చేసుకోకు. స్టడీస్ చాలా ఇంపార్టెంట్. కనీసం డిగ్రీ అయినా పూర్తి చేయాలి' అని ఇంట్లోవాళ్లు చెప్పారు. నేను బాగా ఆలోచించి కాలేజ్ వాళ్లతో మాట్లాడుకుని ఎగ్జామ్స్‌కు మాత్రం అటెండ్ అవుతూ, మిగిలిన టైమ్‌లో షూటింగ్ చేశా.

మీరు బాగా చదువుతారా?

గుడ్ స్టూడెంట్‌నే. నేను స్టడీస్ మీద బాగా ఫోకస్ చేస్తే, మంచి మార్కులు స్కోర్ చేస్తా. కానీ ఇప్పుడు క్లాసులకు అటెండ్ అవడం కుదరడం లేదు. అందువల్ల మార్కులు యావరేజ్‌గానే వస్తున్నాయి.

చూడ్డానికి సిగ్గరిగా కనిపిస్తున్నారు. స్కూల్లో కూడా అలాగే ఉండేవారా? లేకుంటే టామ్ బాయా?

నేను స్కూల్లో ట్రబుల్ మేకర్‌ని. నాటీగా ఉండేదాన్ని. క్లాసులో తప్ప కాంపౌండ్‌లో ఎక్కడైనా కనిపించేదాన్ని. అదర్ యాక్టివిటీస్ అంటే మొదటి నుంచీ ఇష్టమే. డ్యాన్సు, డ్రామా, సింగింగ్... అన్నిట్లోనూ యాక్టివ్‌గానే ఉండేదాన్ని. ఏ అకేషన్ అయినా టీచర్స్ నన్ను కూడా అడక్కుండా కల్చరల్ ప్రోగ్రామ్స్‌కి నా పేరు ఇచ్చేసేవారంటే నమ్మండి.

సింగింగ్ ఎక్కడైనా నేర్చుకున్నారా?

ఇప్పుడు కూడా కర్ణాటక సంగీతం నేర్చుకుంటూ ఉన్నా. నేను యు.కె.జీలో ఉన్నప్పుడు ఒకల్ నేర్చుకోవడం మొదలుపెట్టాను. మీనాక్షి టీచర్, వాసుదేవన్ సార్ దగ్గర ఇంతకు ముందు నేర్చుకున్నా. ప్రస్తుతం మహిత టీచర్ దగ్గర నేర్చుకుంటున్నా. కర్ణాటక సంగీతంలో గురువు దగ్గర నేర్చుకుంటున్నప్పుడు స్పెషల్‌గా గ్రేడ్స్ అంటూ ఏమీ ఉండవు. కాకపోతే స్టెప్ బై స్టెప్‌గా మనం నేర్చుకుంటూ ముందుకెళ్లాలి. నేనెప్పుడూ సినిమాల్లో పాడటానికి ట్రై చేయలేదు. కాకపోతే తప్పకుండా సింగింగ్‌ని కూడా ప్రొఫెషన్‌గా తీసుకోవాలని ఉంది.

కచ్చేరీలు చేశారా?

నేను ఐదో తరగతి చదువుతున్నప్పుడే తొలిసారి అరంగేట్ర కచ్చేరీ చేశా. అప్పటి నుంచి ప్రతి ఏటా సంగీతోత్సవాలకు వెళ్తూనే ఉన్నా. ఎన్నో గుళ్లల్లో సంగీత కచ్చేరీలు ఇచ్చాను. గత ఏడేళ్లుగా చెంబై సంగీతోత్సవంలో పాడుతున్నా. ఎన్ని పనులున్నా దాన్ని మిస్ కావడం లేదు.

భరతనాట్యం కూడా నేర్చుకున్నట్టున్నారు?

నేను పదో తరగతి చదివే వరకు భరతనాట్యం నేర్చుకున్నా. ఆ తర్వాత భరతనాట్యం, మోహినీ ఆట్టమ్‌లో అరంగేట్రం చేశా. ఆ మధ్య కూచిపూడి నేర్చుకోవడం మొదలుపెట్టాను. కానీ కంటిన్యూ చేయలేకపోయా.

తెలుగు సినిమాలు చూసేవారా?

అప్పట్లో ఒకటో, రెండో చూశా.

నోటికొచ్చింది చెప్పాం!

కాలేజ్ బంక్ కొట్టి ఎక్కడికెళ్తామన్నది తర్వాత సంగతి. ముందు మాత్రం బంక్ కొట్టాల్సిందే! ఒకసారి మా కాలేజ్‌లో ఓ ఫంక్షన్ జరిగింది. ఆ ప్రోగ్రామ్ మధ్యాహ్నం 12 నుంచి 2.30 వరకు అన్నమాట. మా కాలేజ్ మూడు గంటలకు పూర్తవుతుంది. సరే అరగంట కోసం ఎవరూ క్లాసులకు రారు కదా! అని అనుకుని, మా ఫ్రెండ్స్ అందరం మా ఇంటికి వెళ్లి ఫుడ్ ఆర్డర్ ఇచ్చి, జాలీగా ఉన్నాం. కాలేజీ నుంచి ఒకమ్మాయి నాకు ఫోన్ చేసి 'ఆ ప్రోగ్రామ్ 1.30కే కంప్లీట్ అయింది. మేడమ్ క్లాసుకి వచ్చేశారు' అని చెప్పింది. మేం ఆర్డర్ ఇచ్చిన ఫుడ్ దారిలో ఉంది. పోనీ ఫుడ్ వదిలేసి వెళ్దామా అంటే... ఎంత హడావిడిగా వెళ్లినా, మేం వెళ్లేసరికి మా అటెండెన్స్ వేసేస్తారు.. అందుకే ఇదంతా వివరించి, అందరినీ ఒప్పించి కూర్చోబెట్టా. ఆ పూటకైతే అందరూ కూర్చున్నారు. కానీ నెక్స్ట్ రోజు మా అందర్నీ క్లాసులో మేడమ్ నిలబెట్టారు. 'అక్కడే ఉన్నాం మేడమ్. కేఫ్టీరియాలో ఉన్నాం మేడమ్' అని నోటికి వచ్చింది చెప్పి, తప్పించుకున్నాం. కానీ ఆ తర్వాత ఏ ఫంక్షన్ జరిగినా, మా గ్రూప్ స్పాట్‌లో ఉందా? లేదా? అని మాత్రం అందరూ చాలా అబ్జర్వ్ చేసేవాళ్లు.



'లవర్స్ డే' ఆడియో వేడుకలో సరదాగా అల్లు అర్జున్‌కు చేతి గన్ను గురిపెట్టిన ప్రియ

ఈ సారి ఫ్యామిలీతో వస్తా!

నేను తెలుగు రాష్ట్రాలకు ఇంతకు ముందు ఎప్పుడూ రాలేదు. 'ఒరు అడార్ లవ్' తెలుగు వెర్షన్ 'లవర్స్ డే' కోసమే వచ్చాను. హైదరాబాద్ అంతా తిరిగేయాలనిపించింది. కానీ ఇంటర్వ్యూలు, ప్రోగ్రామ్‌తో బిజీగా గడిచిపోయింది. భవిష్యత్తులో మళ్లీ తప్పకుండా వచ్చి అన్ని ప్రదేశాలనూ మా ఫ్యామిలీతో కలిసి చూడాలనుకుంటున్నా.



'లవర్స్ డే' లో ఓ సన్నివేశం

నటిగా ఎదగాలనుకున్న క్రమంలో మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకున్న తీరు ఎలాంటిది?

డైటింగూ, ఎక్సర్‌సైజ్‌లు నేనెప్పుడూ ట్రై చేయలేదు. దేవుడి దయ వల్ల నేనెంత తిన్నా, ఇలాగే ఉన్నా. చాలా మంది కొంచెం తినగానే బరువు పెరుగుతారు. నేను అలా కాదు. నచ్చింది కడుపునిండా తింటుంటా. స్పెషల్‌గా అదే కావాలి, ఇదే కావాలి అని అనుకోను. నా మూడ్‌ని బట్టి తినే ఫుడ్ ఉంటుందంతే!

సరదాగా ఉండే కాలేజీ అమ్మాయికీ, బిజీగా గడిపే సినిమా అమ్మాయికీ మధ్యతేడా ఉందా?

భలే అడిగారు. సరదాగా తిరగడమే నా ఫేవరేట్ హాబీ. కానీ ఇప్పుడు నేను చాలా బిజీగా ఉన్నా. కాలేజీకి వెళ్లలేకపోతున్నా. బంక్ కొట్టలేకపోతున్నా. అంతా కొత్తకొత్తగా ఉంది.

బ్యాలెన్స్ చేయడం నేర్చుకుంటున్నారా?

ఇప్పుడిప్పుడే అలవాటుపడుతున్నా. మరీ ఎక్కువ బిజీగా గడపాల్సి వచ్చిందనుకోండి.. కొన్ని రోజులు బ్రేక్ తీసుకుని తర్వాత వర్క్ మోడ్‌లోకి రావాలనుకుంటున్నా.

మలయాళంలో 'ఒరు అడార్ లవ్' తప్ప ఇంకేమైనా కమిట్ అయ్యారా?

లేదండీ! నేను ఈ సినిమా విడుదలయ్యాక, తప్పొప్పులను గ్రహించాలి., ఆ తర్వాతే మరో సినిమా.

అల్లు అర్జున్‌తో సినిమా అలా వద్దనుకున్నదేనా?

అలా కాదండీ. అప్పుడు 'ఒరు అడార్ లవ్' షూటింగ్‌లో ఉన్నాను. కాల్షీట్లు లేవు. అందుకే మిస్ అయ్యా. అల్లు అర్జున్‌కు ఇక్కడ ఎంత మంది ఫ్యాన్స్ ఉన్నారో కానీ, అక్కడ కేరళలో మాత్రం చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. నేను ఆయనకు చాలా పెద్ద ఫ్యాన్. ఆయన అన్నీ సినిమాలనూ చూశాను. ఆయన డ్యాన్సులు చాలా ఇష్టం. నెక్స్ట్ లెవల్ డ్యాన్సులు చేసే హీరో ఆయన. మలయాళంలో మోహన్‌లాల్‌గారు ఇష్టం. నాయికల్లో నాకు దీపికా పదుకోన్, నయనతార ఇష్టం. నయనతార అంత ఎదిగినా కూడా ఎంతో సింపుల్‌గా ఉంటారు. చాలా భక్తిగా ఉంటారు. ఆవిడలాగా నాక్కూడా భక్తి ఉంది.

మీలో మీకు నచ్చిన పాయింట్స్?

నా ప్యాషన్! నా డ్రీమ్‌ని బాగా ఫాలో అవుతాను. డెడికేటెడ్‌గా ఉంటాను. డిటర్మినేషన్ ఎక్కువ. ఏదైనా కావాలనుకుంటే సాధించి తీరుతా!

మరి మైనస్ ఏంటి?

చెప్పక తప్పదా..!(నవ్వుతూ) నేను చాలా లేజీగా ఉంటాను. ఎక్కువగా నిద్రపోతాను. అదే నా పెద్ద మైనస్. అలాగే పంక్చువాలిటీ ఉండదు. మీరు నన్ను 8 గంటలకు రెడీ అవ్వమంటే నేను 8.30కి మాత్రమే రెడీగా ఉంటాను. పంక్చువాలిటీని ఎంత నేర్చుకుందామన్నా కుదరడం లేదు. వీటన్నిటికీ సమస్య ఒక్కటే. నిద్ర! నేను ఏమాత్రం త్వరగా లేచినా వీటన్నిటికీ ఫుల్‌స్టాప్ పెట్టేయవచ్చు.

ఇది గ్లామర్ ఫీల్డ్. కాస్ట్యూమ్స్ పరంగా, కొన్ని సీన్స్ పరంగా హద్దు మీరి చేయాల్సి రావచ్చు. వాటికి మానసికంగా సిద్ధంగానే ఉన్నారా?

నా కంఫర్ట్ లెవల్‌కి తగ్గట్టు డ్రెస్ చేసుకుంటా. అనవసరంగా గ్లామర్‌గా నటించమంటే నా వల్ల కాదు. బికినీగానీ, లిప్‌లాక్‌ల గురించి ఇప్పటి దాకా ఏమీ ఆలోచించలేదు.

• డా. చల్లా భాగ్యలక్ష్మి

అమ్మ మాట గుర్తే!

నా చేతిలో ఎప్పుడూ సెల్ ఉంటుంది. ఎప్పుడూ సినిమా కబుర్లు, కొత్త చిత్రాల వార్తలను చదువుతూ ఉంటా. '24 గంటలూ దాంతో ఏం పని? ఆ సోషల్ మీడియాలో ఏం ఉంటుంది?' అని మా అమ్మ తెగ తిడుతూనే ఉంటుంది. ఒకసారి అమ్మ అలా అన్నదని నేను సెల్ పక్కన పడేశా. కరెక్ట్‌గా అప్పుడే 'మోస్ట్ గూగుల్డ్ యాక్ట్రెస్'గా నా పేరు ప్రకటించారని మా వాళ్లు ఫోన్ చేసి చెప్పారు. అప్పుడు చాలా సంతోషపడ్డా. 'ఎవరు ఎంత ఎత్తు ఎదిగినా కాళ్లు నేల మీదే ఉండాలనే సంగతిని మర్చిపోకూడదు. వినమ్రంగా ఉండాలి' అని అప్పుడు అమ్మ చెప్పిన మాటల్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటా.

ఏ కలర్ డ్రెస్ బెటర్?

డ్రెస్ స్టయిల్ మీ వ్యక్తిత్వాన్ని చెప్పినట్టే, వాటి రంగులు కూడా మీ మూడ్‌ను తెలియజేస్తాయి. ఆఫీసు వాతావరణాన్ని ప్రభావితం కూడా చేస్తాయి. అందుకే పని ప్రదేశంలో మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెట్టే దుస్తుల ఎంపికలో రంగుల పాత్ర కీలకం అనే విషయం మరిచిపోకండి.

❖ మీరు ధరించిన దుస్తుల రంగుకు మీ సహోద్యోగుల మనఃస్థితిని ప్రభావితం చేసే శక్తి ఉంది. ఆఫీసుకు ఆకుపచ్చ (లేత) రంగు దుస్తులు సరైన ఎంపిక. మీరు స్నేహపాత్రులనే సందేశం ఎదుటివారికి అందుతుంది. వాతావరణంలో ఆహ్లాదాన్ని నింపుతుంది.

❖ నీలం రంగు దుస్తులు పని ప్రదేశంలో ఉత్సాహపూరితమైన వాతావరణాన్ని నింపుతాయి.



వర్క్‌ప్లేస్

❖ జ్ఞానానికీ, పరిపక్వత కూ ప్రతీక గోధుమరంగు. ఈ రంగు దుస్తులు ధరిస్తే నలుగురిలో ప్రతిభావంతులుగా కనిపిస్తారు. అయితే వీటిని అరుదుగా ధరిస్తేనే అందం.

❖ నలుపు అధికార దర్పానికి సూచిక. ఈ రంగు దుస్తులు అన్ని రకాల వేడుకలకు నప్పుతాయి.

❖ పరిపూర్ణత్వాన్ని ప్రతిఫలించే రంగు తెలుపు. తెలుపు రంగు దుస్తులు ఆఫీసుకు చక్కగా సరిపోయే దుస్తులు. వీటికి తోడుగా నగలు ధరిస్తే అందం, రెట్టింపవుతుంది. నలుగురిలో ప్రత్యేకంగా నిలుస్తారు.

❖ ఎరుపు, నారింజ, గులాబీ రంగులు అసహనం, కోపానికి కారణమవుతాయి కాబట్టి ఇలాంటి రంగు దుస్తులు ఆఫీసుకు నప్పవు.

బ్యూటీ

ముఖం మెరిసిపోతుందిలా...!

రోజువారీ పనులు, ఒత్తిడి, తగినంత విశ్రాంతి లేకపోవటం వల్ల చర్మం కళ తప్పుతుంది. అలాంటప్పుడు ఈ కింది సూచనలు పాటిస్తే ముఖం మెరిసిపోవటం ఖాయం అంటున్నారు సౌందర్య నిపుణులు.

గోల్డెన్ రూల్: రాత్రిళ్లు మేకప్ తీయకుండా పడుకుంటే చర్మంలోని స్వేదరంధ్రాలు పూడుకుపోతాయి. దీనివల్ల మొహంపైన మచ్చలు ఏర్పడి ఇబ్బంది పెడతాయి. అందుకే నిద్రపోయే ముందు కాటన్ వస్త్రంపైన కొంచెం ఆలివ్ ఆయిల్ వేసి ముఖంపైన మృదువుగా మసాజ్ చేస్తే మేకప్, దుమ్మూ తొలగిపోతాయి. ఉదయాని కల్లా మొహం కళకళలాడుతుంది.

వాల్‌నట్ పౌడర్: వాల్‌నట్ పౌడర్‌ను పెరుగులో కలిపి ముఖంపైన రాయటం వల్ల మృత చర్మం తొలగిపోతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపైన ఉండే మృతకణాలు, దుమ్మును తొలగించి చర్మానికి కొత్త కాంతినిస్తాయి.

సన్‌స్క్రీన్: ఎక్కువ సమయం ఎండలో గడిపితే చర్మం కమిలిపోతుంది. ముడత లు పడుతుంది. ఎండలోకి వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుంటే అతి నీలలోహిత కిరణాల ప్రభావాన్ని అరికడుతుంది. బయట వాతావరణం చల్లగా ఉన్నా సన్‌స్క్రీన్ వాడాలి.

బ్యూటీ స్లీప్: కంటికి తగినంత నిద్ర లేకపోతే చర్మం కూడా అలసిపోతుంది. దీనివల్ల కంటికింద వలయాలు ఏర్పడతాయి. వారంలో రెండు మూడుసార్లు తేనె రాయటం వల్ల చర్మం మృదువుగా మారుతుంది.

ఫేస్‌వాష్: నిద్రపోయే ముందు ముఖం చల్లటి నీళ్లతో శుభ్రంగా కడిగి మాయిశ్చరైజర్‌ను రాయాలి. అలాగని మరీ ఎక్కువగా రాయకూడదు. వేడినీళ్లతో మొహాన్ని శుభ్రం చేస్తే చర్మం పొడిబారుతుంది. ప్రతి రోజూ కనీసం 8 గ్లాసుల నీరు తాగాలి. దాంతో పాటు నీటి పరిమాణం ఎక్కువగా ఉండే పుచ్చ, దోస, నారింజ, ద్రాక్ష లాంటి పండ్లు తినాలి.



ఫ్లాష్‌బ్యాక్

ఆ డైలాగ్ ఎన్టీఆర్‌దే!

నందమూరి బాలకృష్ణ నటించిన 'నరసింహనాయుడు' చిత్రంలో 'కత్తులతో కాదురా.. కంటి చూపుతో చంపేస్తా అనే డైలాగ్ ఉంది. పరుచూరి సోదరులు రాసిన ఈ డైలాగ్ చాలా పాపులర్ అయింది. ఆ సినిమా వచ్చి ఇప్పటికి 18 ఏళ్లు అయినా ఆ డైలాగ్ ఇప్పటికీ జనం నోళ్లలో నానుతూనే ఉంది. అయితే ఒరిజనల్‌గా ఈ డైలాగ్ పరుచూరి సోదరులది కాదు.. మహానటుడు ఎన్టీఆర్‌ది.



అదేలాగంటే..

రాజకీయాల్లోకి వెళ్లే ముందు ఎన్టీఆర్ నటించిన చివరి చిత్రం 'నాదేశం'. కె. బాపయ్య దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి కె.దేవీవరప్రసాద్, ఎస్.వెంకటరత్నం నిర్మాతలు. హిందీలో అమితాబ్ నటించిన 'లావరిస్' సినిమాకు ఇది రీమేక్. .

అసలు విషయానికి వస్తే... 'నాదేశం'లో ముగింపు సన్నివేశంలో మాత్రమే ఒకే ఒక ఫైట్ ఉంది. మాస్ ఇమేజ్ కలిగిన ఎన్టీఆర్‌కు కేవలం ఒకేఒక ఫైట్ కాకుండా మరో ఫైట్ ఉంటే బాగుంటుందని నిర్మాతల అభిప్రాయం. అయితే ఆ విషయం డైరెక్ట్‌గా ఎన్టీఆర్‌కు చెప్పలేక, ఆ బాధ్యతను పరుచూరి గోపాలకృష్ణకు అప్పగించారు. ఒక రోజు ఎన్టీఆర్‌ను ఇంటి దగ్గర పికప్ చేసుకొని కారులో షూటింగ్‌కు బయలుదేరారు. ముందు సీటులో దేవీవరప్రసాద్, ఎన్టీఆర్ మేకప్‌మన్, వెనుక సీటులో ఎన్టీఆర్, పరుచూరి గోపాలకృష్ణ కూర్చున్నారు.

మాటల మధ్యలో సినిమాలో మరో ఫైట్ ఉంటే బాగుంటుందనే విషయాన్ని ప్రస్తావించారు గోపాలకృష్ణ. ఎన్టీఆర్‌కు మూడ్ బాగుండటంతో 'ఏ సీనులో ఆ ఫైట్ పెడతారు?' అని ప్రసన్నంగా అడిగారు.

పరుచూరి గోపాలకృష్ణ ఒక ఆర్టిస్ట్ పేరు చెప్పి 'ఈ సందర్భంలో వారితో మీకు ఫైట్ పెడితే బాగుంటుందండి' అని చెప్పారు.

'అసలు బాగుండదు' అని చెప్పి ఆ విషయం అంతటితో ముగించారు ఎన్టీఆర్.

అది గ్రహించి టాపిక్ మళ్లించారు గోపాలకృష్ణ. అయితే ముందు సీటులో ఉన్న దేవీవరప్రసాద్ మాత్రం ఆ విషయాన్ని వదిలిపెట్టలేదు. 'మళ్లీ అడుగు' అన్నట్లు గోపాలకృష్ణకు సైగ చేశారు.

దాంతో ధైర్యం చేసి 'అది కాదు అన్నగారూ.. మీరు నాలుగు దెబ్బలేసినా మాలాంటి అభిమానులకు ఆనందంగా ఉంటుంది కదా' అన్నారు. దేవీవరప్రసాద్ ఈ విషయం అడిగిస్తున్నారన్న విషయం ఎన్టీఆర్‌కు అర్థమైంది.

అందుకే వివరణ ఇస్తూ 'దేనికైనా ఓ స్థాయి ఉంటుంది. సత్యనారాయణగారితో ఫైట్ ఉంటే చెప్పండి.. చేస్తాం. అంతేకానీ మీరు చెప్పిన వారితో ఫైట్ చెయ్యమంటారా.. మేం గట్టిగా కన్నెర్ర చేస్తే గుండాగి చస్తారు వారు' అన్నారు.

ఈ సంఘటన 1982లో జరిగింది. దాదాపు ఇరవై ఏళ్ల అనంతరం వచ్చిన 'నరసింహనాయుడు' చిత్రంలో యధాలాపంగా 'కత్తులతో కాదురా.. కంటి చూపుతో చంపేస్తా' అనే డైలాగ్ రాశారు గోపాలకృష్ణ. రాసిన తర్వాత కానీ అది ఎన్టీఆర్ ఆ నాడు తనతో అన్న డైలాగ్ అని ఆయనకు గుర్తు రాలేదు.

బాడీ షేమింగ్

బిడ్డను కన్న తల్లి ఇలాగే ఉంటుంది

- నేహా ధూపియా

సినిమా యాక్టర్లంటే నాజూగ్గా, సన్నజాజిలా మెరిసిపోవాలనే లెక్కలుంటాయి. ట్రెండింగ్‌లో ఉన్న హీరోయిన్ బరువు తగ్గినా, పెరిగినా అది చర్చనీయాంశం అవుతుంది. ఆ చర్చతోపాటు ఫొటోలూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంటాయి. 'స్లిమ్‌గా తయారవ్వమ్మా' అని కొందరు సలహాలిస్తే, మరి కొందరు బాడీ షేమింగ్ చేస్తారు. ఇప్పుడు బాలీవుడ్ కథానాయిక నేహా ధూపియాకు అలాంటి అనుభవమే ఎదురైంది. ఆమె 'తల్లి అయిన తర్వాత కాస్త బరువు పెరిగారు. 'నేహా ధూపియా బరువు చూస్తే షాక్ అవుతారు' అంటూ ఓ బాలీవుడ్ వెబ్‌సైట్ రాసింది. వారికి నేహా సరైన కౌంటర్ ఇచ్చారు. " 'బాడీ షేమింగ్' గురించి మీరు చేసే కామెంట్లకు కుంగిపోయే స్థితిలో నేను లేను. అసలు అలాంటి మాటల్ని నేను పట్టించుకోను. మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు అస్సలు లేదు. సెలబ్రిటీలనే కాదు.. సాధారణ మనుషులను కూడా బరువు, అందం విషయంలో అవమానించొద్దు. బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఇలాగే ఉంటారు. చిన్నారి పాప కోసం నేను ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండాలి. కాబట్టి ప్రతి రోజు వ్యాయామం చేస్తున్నా. కుదిరినప్పుడు జిమ్‌కు వెళ్తున్నా. ఇలాంటి సందర్భంలో ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి కానీ సమాజానికి అందంగా కనపడటానికి ప్రాధాన్యం ఇవ్వకూడదు. దయచేసి ఇలాంటి కామెంట్లు చెయొద్దు" అని నేహాధూపియా మండిపడ్డారు. ఈ విషయంలో కరణ్ జోహార్, సోనమ్ కపూర్, తాప్సి, రకుల్‌ప్రీత్ సింగ్ నేహాను మెచ్చుకుంటూ ట్వీట్లు చేశారు. "నువ్వు అమేజింగ్. నీ ధైర్యం, తెలివితేటలతో ఎన్నో ఎదుర్కొన్నావు. బరువు తగ్గించుకోవడంలో గొప్పేం లేదు.. విలువ సంపాదించుకోవడం ముఖ్యం" అని కరణ్ ట్వీట్ చేశారు. "నువ్వెంత బరువున్నా, నీ బాడీ లాంగ్వేజ్ ఎలా ఉన్నా సూపర్ స్టైల్‌గా ఉంటావు" అని తాప్సి, రాసుకొచ్చారు. "వ్యక్తిత్వం చూసి మహిళల్ని గౌరవించాలి కానీ అందం, లుక్స్‌ను బట్టి కామెంట్లు చేయకూడదు" అని రకుల్ ట్వీటారు.





రకుల్‌ప్రీత్‌సింగ్

జనవరి వచ్చింది... జగడాల చలి మంటలు పెట్టింది...

జనాలకు వివాదాలను వదిలి వెళ్లింది!

విజయాలతో కొత్త ఏడాది మొదలవుతుందని కోటి ఆశలతో జనవరిలో అడుగుపెట్టిన చలనచిత్ర ప్రముఖులకు, ప్రేక్షకులకు గడచిన నెల ఓ పీడ కలలా మిగిలింది. జనవరిలో విజయాల కంటే వివాదాలే ఎక్కువగా వార్తల్లో నిలిచాయి. నలిగాయి! గత జ్ఞాపకాల్లోంచి జనవరిని తుడిచేయాలనేంతలా జగడాలు చికాకు తెప్పించాయి. ఈ వివాదాలను నిశితంగా గమనిస్తే... నోరు జారడం వల్ల వచ్చినవే ఎక్కువ!!

• సత్య పులగం

జగడ రగడ జగడం!

'కారు'కూతకు ట్విట్టర్ దెబ్బ!

జగడాల జనవరిలో వివాదాలన్నీ పరిశ్రమలో వ్యక్తుల మధ్య జరిగాయి. ఇదొక్కటీ పరిశ్రమకూ, ప్రేక్షకులకూ మధ్య జరిగింది. ముంబైలో ఓ చోట రకుల్ కారు దిగిన ఫొటోని ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన భగత్ అనే నెటిజన్ "కారులో సెషన్ పూర్తయిన తర్వాత ఫ్యాంట్ వేసుకోవడం మర్చిపోయింది" అని పేర్కొన్నాడు. "మీ మదర్ కారులో చాలా సెషన్స్‌లో పాల్గొన్నారనుకుంట! అందుకని, నీకు బాగా తెలిసింది. ఆమెను కొంచెం మర్యాద కూడా నేర్పమని అడుగు. సంకుచిత స్వభావం ఉన్న ఇటువంటి వ్యక్తులు ఉన్నంత వరకూ మహిళలకు రక్షణ ఉండదు. స్త్రీ-పురుష సమానత్వం, మహిళ రక్షణ గురించి చర్చల వల్ల ఉపయోగం ఉండదు" అని అతడికి రకుల్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. "అతడికి బుద్ధి చెప్పడానికి తల్లి ప్రస్తావన తీసుకురావడం ఎందుకు? రకుల్‌దే సంకుచిత స్వభావం" అని పలువురు నెటిజన్లు ఆమెపై మండిపడ్డారు. "నాపై విరుచుకు పడుతున్నవారందరూ ఓ మహిళను భగత్ కించపరుస్తూ కామెంట్ చేసినప్పుడు ఏమయ్యారు?" అని రకుల్ ఎదురు ప్రశ్నించారు. ఆమెకు మద్దతు తెలిపినందుకు నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ కొందరు నెటిజన్ల నుంచి వ్యతిరేకత చవిచూశారు.



వివాదానికి కారణమైన ఫొటో ఇదే

ప్రియా ప్రకాశ్ వారియర్ నటించిన తమిళ చిత్రం 'శ్రీదేవి బంగ్లా' ట్రైలర్ కూడా వివాదాస్పదమైంది. సినిమాలో ప్రియా ప్రకాశ్ పాత్ర పేరు శ్రీదేవి కావడం, ఆమె నటి కావడం, బాత్‌టబ్‌లో పడి మరణించిందని చూపడం వల్ల శ్రీదేవి జీవితాన్ని ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని చాలామంది ఓ అంచనాకు వచ్చారు. శ్రీదేవి భర్త బోనీ కపూర్ 'శ్రీదేవి బంగ్లా' దర్శకుడు, నిర్మాత, నటికి లీగల్ నోటీసులు పంపారు. మరోవైపు శ్రీదేవి జీవితం ఆధారంగా చిత్రం తీశామా? లేదా? అనే విషయమై చిత్రబృందం స్పష్టమైన వివరణ ఇవ్వడం లేదు.




ప్రియా వారియర్




'మణికర్ణిక'లో కంగనా రనౌత్

ఎవరు ఎక్కువ.. ఎవరు తక్కువ?

'మణికర్ణిక'లో ఎవరెంత భాగానికి దర్శకత్వం వహించారు? క్రిష్.. కంగనా రనౌత్... ఇద్దరిలో ఎవరు ఎక్కువ? ఎవరు తక్కువ? ఇటు ప్రేక్షకుల్లోనూ.. అటు పరిశ్రమలోనూ... ఒక్కటే చర్చ! 'మణికర్ణిక'లో 70 శాతం చిత్రానికి తానే దర్శకత్వం వహించానని కంగనా రనౌత్ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొనడం... తాను స్వచ్ఛమైన బంగారం వంటి చిత్రం తీస్తే, కంగనా రనౌత్ దాన్ని వెండిగా మార్చిందని, ఆమె చరిత్రను వక్రీకరించిందని, తనతో మూర్ఖంగా ప్రవర్తించిందని క్రిష్ పేర్కొనడం... తెలిసిన విషయాలే. ఈ వివాదంలో క్రిష్‌కు మద్దతుగా నటీనటులు మిస్తీ చక్రవర్తి, సోనూ సూద్, జిష్షుసేన్ గుప్తా తదితరులు నిలబడితే... కంగనా రనౌత్ తరపున చిత్రసహ నిర్మాత కమల్ జైన్, ఆమె సోదరి రంగోలి నిలబడ్డారు. ఓ దశలో వార్తాపత్రికల నుంచి ట్విట్టర్ చేరుకున్న ఈ వివాదం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. "క్రిష్ మా చిత్రానికి చేటు చేస్తున్నారు. ఆయన దగ్గర ఆధారాలుంటే చట్టపరంగా చర్యలు తీసుకోమనండి. క్రిష్‌కు చెప్పకుండా మేం ఏ నిర్ణయాన్నీ తీసుకోలేదు. అలాగే, కంగనా రనౌత్ ప్రతి నిర్ణయాన్ని ప్రొడక్షన్ టీమ్‌కి చెప్పి తీసుకున్నారు" అని కమల్ జైన్ అన్నారు. స్విట్జర్లాండ్ నుంచి తిరిగొచ్చిన కంగనా రనౌత్ "నేనే 'మణికర్ణిక'కు దర్శకత్వం వహించా. క్రిష్ చెప్పేది నిజమైతే నిరూపించుకోమనండి. తమ పాత్రల నిడివి తగ్గించారని ఆరోపించే వారికి చెప్పేది ఒక్కటే... మరొకర్ని చూసి ఏడిస్తే, ఫలితం లేదు. నేను మూడు జాతీయ పురస్కారాలు అందుకున్నా. వాటిని మా నాన్న ఇవ్వలేదు. కష్టపడి సంపాదించుకున్నా. మీరూ కష్టపడి ఆ స్థాయికి చేరుకోండి" అన్నారు.



క్రిష్





వివాదాల 'ముద్ర'!

జగపతిబాబు హీరోగా నట్టికుమార్ నిర్మించిన సినిమా 'ముద్ర'. నిఖిల్ హీరోగా 'ఠాగూర్' మధు నిర్మిస్తున్న సినిమా 'ముద్ర'. అసలు టైటిల్ 'నిఖిల్ ముద్ర'. పోస్టర్‌లో 'ముద్ర'ను హైలైట్ చేసి, 'నిఖిల్'ను చిన్న అక్షరాల్లో డిజైన్ చేశారు. అందువల్ల, నిఖిల్ సినిమా టైటిల్ 'ముద్ర' అనుకున్నారంతా. ఇదే అసలు వివాదానికి కారణం! జనవరి నెలాఖరున జగపతిబాబు 'ముద్ర' విడుదలైంది. విడుదలకు ముందు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ యాప్స్‌లో జగపతిబాబు పేరు బదులు హీరోగా నిఖిల్ పేరు, ఆయన సినిమా కాస్ట్ అండ్ క్రూ పేర్లు పొందుపరిచారు. ఓ థియేటర్‌లో అయితే... నిఖిల్ సినిమా పోస్టర్ వేసి, సాయంత్రం 4.45 గంటలకు షో అని రాశారు. ఇవన్నీ చూసిన నిఖిల్ ట్విట్టర్‌లో నెత్తినోరు బాదుకున్నారు. "నా సినిమా ఈ వారం విడుదల కావడం లేదు. కొందరు వ్యక్తులు దురుద్దేశంతో కావాలనే ఇదంతా చేశారు" అని నిఖిల్ ట్వీట్ చేశారు. ఆయన ట్వీట్స్‌పై నట్టికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నిఖిల్ ట్వీట్స్ వల్ల మా సినిమా నష్టపోయింది. ఆ నష్టాన్ని నిఖిల్ భర్తీ చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు. టైటిల్ గొడవల్లో ఇదో కొత్త కోణం!!



నిఖిల్

నిర్మాతలను కాల్చి పారేయాలా!?

సంక్రాంతికి రజనీకాంత్ 'పేట' విడుదలైంది. ఈ చిత్రం విజయం సాధించిందా? లేదా? ప్రేక్షకులందర్నీ ఆకట్టుకుందా? లేదా? అనే విషయాలు పక్కన పెడితే... వివాదాలకు నెలవుగా నిలిచింది. నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, యువి క్రియేషన్స్ అధినేతలు తమ చిత్రానికి థియేటర్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని 'పేట' తెలుగు నిర్మాత అశోక్ వల్లభనేని ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో మండిపడ్డారు. అంతటితో ఆగలేదు. "ఈ కుక్కలకు ప్రభుత్వాలు బుద్ధి చెప్పాలి. గ్యాంగ్‌స్టర్ నయీమ్‌ని చంపినట్టు ఇటువంటివారిని ఎందుకు షూట్ చేయరు?" అన్నారు. నిర్మాతలను ఎన్‌కౌంటర్ చేయాలనడం, జంతువులతో పోల్చడం వంటి వ్యాఖ్యలు విని సామాన్య ప్రేక్షకులు సైతం విస్మయం వ్యక్తం చేశారు. ఈ వివాదంపై 'దిల్' రాజు హుందాగా స్పందించారు. "సంక్రాంతికి ఆరు నెలల ముందే 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'వినయ విధేయ రామ', 'ఎఫ్ 2' విడుదల తేదీలు ఖరారు అయ్యాయి. మధ్యలో వచ్చిన అనువాద చిత్రానికి థియేటర్లు ఇచ్చే పరిస్థితి లేదు" అని ఆయన వివరించారు. అయినా... అశోక్ వల్లభనేని ఆగలేదు. ఓ వార్తా ఛానల్ చర్చలో నిర్మాతల కుటుంబ సభ్యులపై రాయలేని భాషలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. తర్వాత ఆయన వార్తల్లో ఎక్కడా కనిపించలేదు.



'పేట'లో రజనీకాంత్



అశోక్ వల్లభనేని



'దిల్' రాజు

డైలీ సుడోకు 441

9								1
		4			3			5
	3	5				2	6	
					2	9	4	
			8	4	7			
	8	6	3					
	2	5				8	1	
6			7			5		
1								6

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువు, అడ్డంగా ఉన్న ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలు పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 440 సమాధానం

భయం... భయం!

బాలీవుడ్ తార మల్లికా శెరావత్ ఇప్పుడు తెరపై పెద్దగా కనిపించకపోవచ్చు. కానీ కొన్నేళ్ల క్రితం ఆమె క్రేజీ హాట్ హీరోయిన్. మహేశ్‌భట్ తెరకెక్కించిన 'మర్డర్' సినిమాతో బాలీవుడ్‌కు పరిచయమైన మల్లిక ఆ తర్వాత హాలీవుడ్‌కూ వెళ్లారు. 'హిస్', జాకీచాన్ సరసన 'మిత్' అనే చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. నాలుగేళ్ల క్రితం 'డర్టీ పాలిటిక్స్' అనే చిత్రంలో నటించారు. కొంచెం గ్యాప్ తర్వాత, ఇప్పుడు మళ్లీ నటనవైపు దృష్టిమళ్లించారు. నిర్మాత ఏక్తాకపూర్ నిర్మించనున్న ఓ వెబ్ సిరీస్‌లో నటించడానికి మల్లికా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పేరు 'బూ- సబ్‌కీ ఫతేగీ'. ఇందులో హీరోగా ఏక్తాకపూర్ సోదరుడు తుషార్ కపూర్ నటించనున్నారు. హారర్ కామెడీగా రూపొందనున్న ఈ వెబ్‌సిరీస్‌కు ఫర్హాద్ సమ్జీ దర్శకత్వం వహిస్తున్నారు.



మల్లికా శెరావత్



ప్రియాంకా చోప్రా

అక్కడ థియేటర్లో... ఇక్కడ నెట్‌ఫ్లిక్స్‌లో!

ప్రియాంకా చోప్రా ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లోకి కూడా అడుగుపెట్టనున్నారు. 'క్వాంటికో' టీవీ షో తర్వాత ఆమె నటించిన చిత్రం 'బేవాచ్'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆకట్టుకోలేకపోయింది. కానీ ఆమెలోని విలనిజాన్ని వెండితెరకు పరిచయం చేసింది ఆ చిత్రమే. 'కిడ్ లైక్ జేక్' అనే చిత్రంలోనూ నటించారు. అయితే ఆ సినిమా భారత్‌లో విడుదల కాలేదు. తాజాగా ఆమె నటించిన హాలీవుడ్ చిత్రం 'ఈజింట్ ఇట్ రొమాంటిక్' ఇక్కడ విడుదల కానుంది. అయితే థియేటర్లలో కాదు. 'ఎవెంజర్స్' ఫేమ్ లియామ్ హెమ్స్‌వర్త్, రెబెల్ విల్సన్ నటించిన ఈ చిత్రం ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. ఇందులో ప్రియాంక ఓ యోగా శిక్షకురాలిగా కనిపిస్తారట. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా(భారత్ తప్ప) ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది. ఈ నెల 28న భారత్‌లో విడుదల కానున్న ఈ చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్‌లో చూడవచ్చు.

వెబ్‌లో మరోసారి!

'పొన్నియన్ సెల్వన్'... ప్రస్తుతం తమిళ చిత్రసీమలో చక్కర్లు కొడుతున్న పేరిది. తమిళులకు ఎంతో ఇష్టమైన, ప్రఖ్యాతికెక్కిన చారిత్రక నవల ఇది. కల్కి కృష్ణమూర్తి రాసిన ఈ నవల చోళ సామ్రాజ్యం నేపథ్యంలో సాగుతుంది. దిగ్దర్శకుడు మణిరత్నం ఈ నవలను సినిమాగా తీసే సన్నాహాల్లో ఉన్నారనే విషయం తెలిసిందే. అంతేకాదు దర్శకుడు క్రిష్ కూడా ఈ చారిత్రక గాథను ఓ వెబ్‌సిరీస్‌గా తీస్తానని ప్రకటించారు కూడా. ఇప్పుడీ జాబితాలో హీరో రజనీకాంత్ కుమార్తె సౌందర్యా రజనీకాంత్ కూడా చేరారు. గతంలో రజనీ హీరోగా 'అవతార్' తరహాలో మోషన్ కాప్చర్ టెక్నాలజీని ఉపయోగించి 'కొచ్చాడయాన్' అనే చిత్రాన్ని తెరకెక్కించిన సంగతి తెలిసిందే. కానీ ఆ సినిమా పెద్దగా సక్సెస్ కాలేదు. ఆ తర్వాత తన సోదరి ఐశ్వర్య భర్త ధనుష్ హీరోగా 'వీఐపీ-2' అనే చిత్రాన్నీ రూపొందించారు. ఆ సినిమా కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయింది. ఇప్పుడు 'పొన్నియన్ సెల్వన్' వెబ్‌సిరీస్ ద్వారా తొలిసారిగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి నిర్మాతగా అడుగుపెట్టనున్నారు. అప్పట్లో 'కొచ్చాడయాన్'కి వీఎఫ్‌ఎక్స్ విభాగంలో పనిచేసిన సూర్యప్రతాప్ ఎ.ఎస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఇటీవలే ఈ వెబ్‌సిరీస్‌కు సంబంధించిన టైటిల్ టీజర్‌ను తన ట్విట్టర్ ఖాతా ద్వారా విడుదల చేశారు. ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ సంస్థ 'ఎమ్ఎక్స్ ప్లేయర్' కూడా ఈ వెబ్‌సిరీస్ నిర్మాణంలో భాగం పంచుకోనుంది.



సౌందర్య రజనీకాంత్

టీవీ దృశ్యం

నవ్వులే కాదు..

'జబర్దస్త్' రియాలిటీ షో జడ్జిగా బుల్లితెరలోకి ఎంట్రీ ఇచ్చారు కథానాయిక రోజా. ఆ షోతో బుల్లితెర ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. 'బతుకు జట్కాబండి' లాంటి రియలిస్టిక్ షోలలో హోస్ట్‌గా వ్యవహరించారు కూడా. తాజాగా 'రంగస్థలం' అనే రియాలిటీ డ్యాన్స్ షోకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తోన్న రోజా మరో కొత్త షోలో కనిపించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. హిందీ చానెల్ సోనీలో ప్రసారమవుతోన్న 'క్రైమ్ పెట్రోల్' జాతీయ వ్యాప్తంగా క్లిక్ అయింది. ఇంకా చెప్పాలంటే 'నేరాలు-ఘోరాలు' తరహా షో ఇది. ఇప్పుడు 'క్రైమ్ పెట్రోల్'ను 'తస్మాత్ జాగ్రత్త' పేరుతో తెలుగులోకి రీమేక్ చేస్తోంది ఓ ఛానెల్. దీనికి రోజా వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. మొదట్లో నటుడు పోసాని కృష్ణమురళిని అనుకున్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ షోకు యాంకర్‌గా రోజాను ఎంపిక చేశారు. త్వరలోనే టీజర్ విడుదల కానుంది. ఈ నెలలోనే ప్రారంభం కానుందని టాక్.



రోజా

అందుకే ప్రకటించలేదు

- అదితీరావు హైదరీ



"మనం చేయదగ్గ గొప్ప పనులు కొన్ని ఉంటాయి. దత్తత తీసుకోవడం నా దృష్టిలో అలాంటిదే" అని అంటున్నారు అదితీరావ్ హైదరీ. ఇటీవల తెలుగులో ఆమె నటించిన 'అంతరిక్షం' విడుదలైంది. ఇందులో స్పేస్ సైంటిస్ట్ దియా పాత్రలో కనిపించారు అదితీ. ఆమె మాట్లాడుతూ "నాకు పిల్లలంటే చాలా ఇష్టం. ఏడెనిమిది మందిని పెంచుకోవాలనుకున్నా. అయితే అది ఎప్పుడు కార్యరూపం దాలుస్తుందో నాకు తెలియదు. అందుకే నా మనసులోని మాటను ఎవరితోనూ పంచుకోలేదు. ఒకవేళ ముందే ఈ విషయాలను చెప్పేస్తే నా నెత్తిమీద తుపాకీ పెట్టి ప్రతిసారీ 'ఏమైంది? ఎంతవరకు వచ్చింది' అని ప్రశ్నల బుల్లెట్లతో కాల్చేస్తారు (నవ్వుతూ)" అని అన్నారు. చిన్నారుల చదువు గురించి మాట్లాడుతూ "చిన్నారులను చదివించడం మన బాధ్యత. నేను కొందరిని చదివిస్తున్నాను. 'టీచ్ ఫర్ చేంజ్' నినాదం నాకు ఎంతో ఇష్టం" అని చెప్పారు. సినిమాల గురించి మాట్లాడుతూ "దక్షిణాదిన వరుసగా సినిమాలు చేస్తుండటం వల్ల బాలీవుడ్ చిత్రాలకు సంతకం చేయలేకపోయా. బాలీవుడ్‌లో కొన్ని స్క్రిప్టులు చదివాను. త్వరలోనే నా హిందీ సినిమా గురించి ప్రకటిస్తాను. మాట్లాడటం తెలిసిన భాషలో నటించడంలో ఉన్న సౌలభ్యాన్ని ఆస్వాదిస్తే తప్ప, మాటల్లో చెబితే అర్థం కాదు" అని అన్నారు.

కొట్టేవాళ్లు లేరంతే..!



పూజా హెగ్డే

రోజులు మారుతున్నకొద్దీ కొన్ని వస్తువులకు క్రేజ్ తగ్గిపోతుంది. మరికొన్ని కనుమరుగైపోతాయి. అయితే తను చూస్తున్న రెండు విషయాలకు మాత్రం ఎప్పటికీ క్రేజ్ నిత్యనూతనంగా ఉంటోందని అంటున్నారు పూజా హెగ్డే. గతేడాది ఎన్టీఆర్ సరసన 'అరవింద సమేత వీరరాఘవ' చిత్రంలో నటించిన పూజా ప్రస్తుతం తెలుగులో మహేశ్ సరసన 'మహర్షి', ప్రభాస్ సరసన మరో చిత్రంలో నటిస్తున్నారు. బాలీవుడ్‌లో 'హౌస్‌ఫుల్ 4' ఆమె చేతిలో ఉంది. పూజా హెగ్డే మాట్లాడుతూ "చల్లటి గాలి, సూర్యోదయం.. ఇవి రెండూ నా దృష్టిలో ఎవర్‌గ్రీన్. అదేపనిగా ఎన్నిసార్లు ఆస్వాదించినా తనివితీరవు. అసలు వాటిని కొట్టేవాళ్లు, దాటే విషయాలూ లేవంతే. వీటి తర్వాత నేను అత్యంత ఎక్కువగా ప్రేమించేది మాత్రం కుటుంబాన్నే. ఎవరైనా ప్రకృతికి, కుటుంబానికి విలువ ఇవ్వాలి. నేచర్, ఫ్యామిలీ మనల్ని అడుగడుగునా కాపాడుతుంటాయి" అని చెప్పారు పూజా హెగ్డే.

ఒక్క శాతం ప్రేమను పంచండి

- మమ్ముట్టి



మమ్ముట్టి, విజయ్ చిల్లా, సుధీర్‌బాబు

"రాజశేఖర్ రెడ్డిగారి జీవితంలో పాదయాత్ర వంటి ఘట్టాలకు బాగా కనెక్ట్ అయ్యా. ఎంతోమంది ఆయన్ని గుండెల్లో పెట్టుకున్నారు. ఈ సినిమాతో నాక్కూడా మీ హృదయాల్లో చోటిస్తారని ఆశిస్తున్నా. ఆయనకు పంచిన ప్రేమలో ఒక శాతం నాకు పంచితే చాలు" అని మమ్ముట్టి అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'యాత్ర'. మహి.వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదలకానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. సుధీర్‌బాబు మాట్లాడుతూ "స్ఫూర్తిదాయకమైన నాయకుడి కథ ఇది. వై.ఎస్.ఆర్ ఫ్యాన్స్‌కే కాదు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చుతుంది. అన్ని రాజకీయ పార్టీలూ చూడొచ్చు" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "దూకిన తర్వాత ఆలోచిద్దాంలే అనుకునే టైప్ నేను. స్క్రిప్ట్ పూర్తి చేసి, మమ్ముట్టిగారిని ఒప్పించాక గోదావరి జిల్లాలో పర్యటిస్తున్న జగన్‌గారిని కలిసి ఈ సినిమా గురించి చెప్పా. 'మా నాయన ఏం చేశాడో చూపించు, ఆయన చేయని దానికి క్రెడిట్ ఆపాదించొద్దు' అన్నారు. ట్రైలర్ బావుందన్నారు. సినిమా చూడమని కోరా. 'మీ నాయకుడి కథ మీరు చెప్పారు అన్నారే తప్ప మా నాన్న కథ' అని అనలేదు. అది ఆయన గొప్పతనం. కథ మాత్రమే నాది. అక్కడి నుండి నా టీమ్ నన్ను ముందుకు నడిపించింది. వాటిని ఎందరో ఎన్నో రకాలుగా చెప్పి ఉండొచ్చు. అలాంటి కథలను వినడం వల్లనే నేను రాజశేఖర్‌రెడ్డిగారి కథ చేద్దామని అనుకున్నాను. మమ్ముట్టిగారికి రుణపడి ఉంటా" అని చెప్పారు. మమ్ముట్టి మాట్లాడుతూ "నాకు తెలుగు భాష అంటే చాలా ఇష్టం. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని తెలుగు భాషను పిలుస్తారు. కవితాత్మకమైన భాష ఇది. 21 ఏళ్ల తర్వాత తెలుగులో సినిమా అనగానే చాలా ఎగ్జైట్ అయ్యా. 'యాత్ర' తెలుగులో నా మూడో స్ట్రెయిట్ సినిమా. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా" అని చెప్పారు. "వై.ఎస్.ఆర్ ఆత్మ, స్ఫూర్తిని ఇందులో చూడొచ్చు. ఈ నెల 8న విడుదలవుతున్న ఈ చిత్రం వై.ఎస్.ఆర్ ఫ్యాన్స్‌కే కాదు.. ప్రతి కుటుంబాన్ని ఆకట్టుకుంటుంది" అని విజయ్ చిల్లా తెలిపారు.

సుకుమార్ శిష్యుడితో...



సుకుమార్



శరత్ మరార్



నాగశౌర్య

నాగశౌర్య కథానాయకుడిగా సుకుమార్ శిష్యుడు కాశీ విశాల్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రానికి సుకుమార్, శరత్ మరార్ నిర్మాతలు. సుకుమార్ రైటింగ్స్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై సంయుక్తంగా ఈ చిత్రం రూపొందనుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు నిర్మాతలు. ఈ నెలలోనే పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభం కానుందని సమాచారం.

రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టేలా...



దేవీప్రసాద్

దర్శకుడు దేవీప్రసాద్ ముఖ్య పాత్రధారిగా రూపుదిద్దుకొన్న 'నేనే ముఖ్యమంత్రి' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి మోహన్ రావిపాటి దర్శకత్వం వహించారు. ఈ సినిమా గురించి నిర్మాతల్లో ఒకరైన నారాయణరావు మాట్లాడుతూ 'సమకాలీన రాజకీయ అంశాల గురించి మా సినిమాలో చర్చించాం. అన్ని వర్గాల వారికీ నచ్చే అంశాలు, ఆలోచింపజేసే సన్నివేశాలు, సంభాషణలు ఉంటాయి. దేవిప్రసాద్, వాయుతనయ్, శశి, సుచిత్ర చక్కని నటన ప్రదర్శించారు. కాన్సెప్ట్ నచ్చి ఈ సినిమా తీశాం' అని తెలిపారు. మరో నిర్మాత సాంబశివరావు మాట్లాడుతూ 'సినిమా చాలా బాగా వచ్చింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టేలా సినిమా ఉంటుంది. చక్కని ప్లానింగ్‌తో మా దర్శకుడు ఎక్కడా ఇబ్బంది రాకుండా సినిమాను పూర్తి చేశారు' అన్నారు.

ఫ్యామిలీస్ చూడొద్దు



నిక్కీ తంబోలి, ఆదిత్

ఆదిత్, నిక్కీ తంబోలి జంటగా నటించిన చిత్రం 'చీకటి గదిలో చితక్కొట్టుడు'. సంతోశ్.పి.జయకుమార్ దర్శకుడు. బ్లూ ఘోస్ట్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రంలో పోసాని కృష్ణ మురళి, రఘుబాబు, మిర్చి హేమంత్, తాగుబోతు రమేశ్ ఇతర పాత్రధారులు. శనివారం ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "అడల్ట్ హారర్ థ్రిల్లర్ ఇది. ఆడవాళ్లపై అత్యాచారాలకు పాల్పడకుండా ఉండాలంటే మగవాళ్లు ఏం చెయ్యాలి అన్న అంశంతోపాటు సందేశం ఇస్తున్నాం. కుటుంబ ప్రేక్షకులు మినహా యువత, పెద్దలు చూసేలా సినిమా ఉంటుంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం" అని చెప్పారు.

వాళ్లు... అలాగే కనిపిస్తారు!



అనుపమ పరమేశ్వరన్

"నేను ఏ సినిమా చూసినా అందులో ఉన్న వారందరూ నాకు కేరక్టర్లలాగా మాత్రమే కనిపిస్తారు. నేనెప్పుడూ ఎవరినీ 'హీరో', 'హీరోయిన్' అని అనుకోను" అని అనుపమ పరమేశ్వరన్ అన్నారు. మల్టీ హీరోయిన్లున్న సినిమాలకు సంతకం చేయడం గురించి అనుపమ పరమేశ్వరన్ మాట్లాడారు. "సినిమా హిట్ కావాలంటే ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలి. నేను సినిమాను అంగీకరించినపుడు నన్ను నేను హీరోయిన్‌లాగా ఊహించుకోను. ఆ కథకు నా పాత్ర అందించే సహకారం ఏంటి? అని మాత్రమే ఆలోచిస్తా. అందుకేనేమో మిగిలిన అంశాల గురించి నేను పట్టించుకోను. నా పాత్ర ఎలాంటి ప్రభావాన్ని కలుగజేస్తుందన్న విషయం గురించి కచ్చితంగా ఆలోచిస్తా" అని అన్నారు. ఆమె ప్రస్తుతం కన్నడలో 'నటసార్వభౌమ'లో నటిస్తున్నారు. ఆ చిత్రంలో పునీత్ రాజ్‌కుమార్ సరసన నటించడం పట్ల ఆమె ఆనందాన్ని వ్యక్తం చేశారు.


మా మధ్య మనస్పర్ధలు లేవు

- షకీలా



శృంగార తార సిల్క్ స్మిత నిజ జీవితాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కించిన చిత్రం 'డర్టీ పిక్చర్'. ఈ చిత్రంలో సిల్క్ స్మిత పాత్రలో విద్యాబాలన్ నటించిన విషయం తెలిసిందే. సిల్క్ స్మితకు షకీలాకు మధ్య సఖ్యత ఉండేది కాదని, షకీలను స్మిత ఎప్పుడూ చిన్న చూపు చూసేవారనే అర్థంలో 'డర్టీ పిక్చర్‌'లో కొన్ని డైలాగులు ఉన్నాయి. అయితే వాటిలో నిజం లేదని అంటున్నారు షకీలా. దీని గురించి ఆమె మాట్లాడుతూ "విద్యాబాలన్ 'డర్టీ పిక్చర్'లో నా గురించి చూపించినదానిలో వాస్తవం లేదు. నా తొలి చిత్రం 'ప్లే గర్ల్స్'లో నేను స్మిత చెల్లెలిగా నటించాను. అప్పటి నుంచి కూడా మా మధ్య ఎలాంటి మనస్పర్ధలు లేవు. 'డర్టీ పిక్చర్' లో వాళ్లకు కావాల్సింది ఏదో వాళ్లు రాసుకున్నారులే... అని అప్పుడు నేను కూడా పెద్దగా పట్టించుకోలేదు" అని అన్నారు షకీలా.

సీతారామరాజు.. ట్రూ వారియర్



పి.సునీల్‌కుమార్ రెడ్డి

సామాజిక కథాంశాలతోపాటు యూత్‌ఫుల్ చిత్రాలనూ అందించే పి.సునీల్‌కుమార్ రెడ్డి అల్లూరి సీతారామరాజు జీవిత కథ ఆధారంగా 'సీతారామరాజు' సినిమా తీయడానికి శ్రీకారం చుట్టారు. 'ఏ ట్రూ వారియర్' అన్నది ఉపశీర్షిక. డా. శ్రీనివాస్ నిర్మాత. మార్చిలో షూటింగ్ ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు మాట్లాడుతూ "అప్పటి చరిత్రతో ఇప్పటి యువతకి స్ఫూర్తి నింపేలా అల్లూరి సీతారామరాజు త్యాగం, ఆయన కీర్తిని మరింత ఇనుమడింపజేసే దిశగా 'సీతారామరాజు' - ఏ ట్రూ వారియర్ చిత్రాన్ని రూపొందిస్తాం. చరిత్రకారుల సహకారంతో ఆయన మరణానికి సంబంధించిన మిస్టరీని కూడా ఈ చిత్రంలో చూపించనున్నాం. విశాఖ, కాకినాడ, రాజమండ్రి, ఏజెన్సీల పరిసర ప్రాంతాల్లో సింహ భాగం షూటింగ్ జరుపనున్నాం. నూతన నటీనటులతో పాటు సీనియర్ తారలు, సాంకేతిక నిపుణుల బృందం ఈ సినిమాకు పనిచేస్తుంది. సాయుధ పోరాట నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో గ్రాఫిక్స్‌కి మంచి స్కోపుంది. ఇప్పటికే గ్రాఫిక్స్ పనుల మొదలయ్యాయి. వీలైనంత త్వరగా సినిమా పూర్తి చేసి ఆగస్ట్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అని అన్నారు.

చలో గోవా!



ధన్యా బాలకృష్ణ, సిద్ధీ ఇద్నాని, త్రిధ, కోమలి ప్రసాద్

త్రిధా చౌదరి, ధన్యా బాలకృష్ణ, సిద్ధీ ఇద్నాని, కోమలి ప్రసాద్ ముఖ్య తారలుగా ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. బాలు దర్శకత్వంలో హిమబిందు వెలగపూడి నిర్మిస్తున్న ఈ చిత్రం తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. త్వరలో గోవాలో రెండో షెడ్యూల్ జరగనుంది. ఈ సందర్భంగా దర్శకుడు బాలు మాట్లాడుతూ "ఈ నెల రెండో వారంలో గోవాలో ముఖ్య సన్నివేశాలు, రెండు పాటలూ, పోరాట దృశ్యాలను చిత్రీకరించనున్నాం. మార్చిలో హైదరాబాద్‌లో మూడో షెడ్యూల్ జరుగుతుంది. మే నెలలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం. వినోదాత్మకంగా నేటితరం అమ్మాయిల మనోభావాలను ప్రతిబింబించేలా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రఘుకుంచె, సహ నిర్మాతలు: రాధికా శ్రీనివాస్ వెత్సా, ఉమా కూచిపూడి.

కోర్టుకు వెళ్లి న్యాయం సాధిస్తా

- నిర్మాత వెంకట్



సుమన్ రంగనాథన్

బెనర్జీ, వెంకట్, ముమైత్‌ఖాన్, సంజీవ్‌కుమార్, సుమన్ రంగనాథన్ కీలక పాత్రధారులుగా కె.టి.నాయక్ దర్శకత్వం వహించిన 'దండుపాళ్యం 4' చిత్రం అదే టైటిల్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకురానుంది. వెంకట్ నిర్మాత. మార్చిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాత వెంకట్ మాట్లాడుతూ "ఇటీవల సెన్సార్‌కి అప్లై చేశాను. కంటెంట్ పరంగా ఏదన్నా సమస్య ఉంటే సన్నివేశాన్ని లేదా డైలాగ్‌ని తొలగించడం జరుగుతుంది. నా సినిమా చూసిన సెన్సార్ బోర్డ్ ఆఫీసర్ సినిమాలో కొన్ని సీన్లు తొలగించాలి.. లేదంటే రిజక్ట్ చేస్తానని చెప్పారు. సమస్య ఏంటో చెప్పకుండా రిజెక్ట్ చేస్తాననడం మొదటిసారి చూశా. ఆ తర్వాత సెన్సార్ చెయ్యను. రివైజ్ కమిటీకి వెళ్లండన్నారు. ప్రస్తుతం నేను అదే పని మీద ఉన్నా. రివైజ్ కమిటీకే కాదు.. ట్రిబ్యూనల్‌కీ వెళ్తా. అదీ కాకపోతే.. కోర్టుకెక్కి న్యాయం సాధిస్తా. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చిలో సినిమా విడుదల చేస్తాం" అని తెలిపారు. "ఇంతకన్నా క్రైమ్ సినిమాలు సెన్సార్ పూర్తి చేసుకుని విజయవంతంగా ఆడి థియేటర్స్ నుంచి వెళ్లిపోయాయి. మా సినిమాతో సెన్సార్ బోర్డ్‌కి ఇబ్బంది ఏంటో అర్థం కావడం లేదు" అని దర్శకుడు అన్నారు.

చిన్న చిత్రాలను ఆదరించాలి

-విశ్వనాథ్ తన్నీరు



'నటుడు కావాలనే కోరికతో పరిశ్రమలోకి వచ్చా. కొన్ని సీరియల్స్‌లో నటించాను. కొన్ని నిర్మించాను కూడా. ఆ అనుభవంతో 'యమ్ 6' చిత్రాన్ని నిర్మించాను. ఇదొక హారర్, కామెడీ థ్రిల్లర్' అని తెలిపారు విశ్వనాథ్ తన్నీరు. ధ్రువ, శ్రావణి జంటగా ఆయన నిర్మించిన 'యమ్ 6' చిత్రం ఈ నెల ఎనిమిదిన విడుదల కానుంది. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ 'దర్శకుడు జైరామ్ వర్మ చెప్పిన కథ నచ్చి ఈ సినిమా తీశా. చూస్తున్నంతసేపూ ప్రేక్షకులు ఎక్కడా బోర్ ఫీలవరు. అనుకోకుండా వచ్చే మలుపులు ప్రేక్షకుల్ని ఆకట్టుకొంటాయి. నటీనటులు కొత్తవాళ్లయినా బాగా నటించారు. ఇటువంటి చిన్న చిత్రాలను ఆదరిస్తేనే మాలాంటి కొత్త నిర్మాతలు మరిన్ని సినిమాలు తీయడానికి వీలుంటుంది. మా సినిమాకు ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది. నా స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నా. ఆ వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని చెప్పారు.

జీవితం ఒక్కటే!



జితన్ రమేశ్, శ్రుతీ యుగల్

సూపర్‌గుడ్ ఫిల్మ్స్ అధినేత ఆర్.బి. చౌదరి తనయుడు జితన్ రమేశ్ హీరోగా రూపుదిద్దుకొన్న చిత్రం 'ఒకటే లైఫ్'. నారాయణ్ స్వామి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.వెంకట్ దర్శకుడు. శ్రుతీ యుగల్ కథానాయికగా నటించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ 'టెక్నాలజీ పేరుతో పరుగెడుతున్న నేటి తరం మానవతా విలువలకు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే కాన్సెప్ట్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొన్న చిత్రమిది. సెన్సార్ సభ్యులు మంచి సినిమా తీశావని అభినందించారు. అమ్రీష్ స్వరపరిచిన పాటలు, నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి' అని చెప్పారు. నిర్మాత నారాయణ్ స్వామి మాట్లాడుతూ 'తెలంగాణ శాసనసభ్యుడు హరీశ్‌రావు మా సినిమా ట్రైలర్ విడుదల చేశారు. దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కించిన విధానం అలరిస్తుంది. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

11, 12 తేదీల్లో ఆర్వోలకు శిక్షణ

» లోక్‌సభ ఎన్నికలకు యంత్రాంగం సన్నద్ధం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇందులోభాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో జిల్లా ఎన్నికల అధికారులు, పార్లమెంటరీ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణలో మొత్తం 17 పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులుగా ఉండగా... రానున్న ఎన్నికల్లో హైదరాబాద్ మినహా మిగతా జిల్లాల్లో కలెక్టర్లే రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు. హైదరాబాద్ జిల్లాలోని హైదరాబాద్ స్థానానికి కలెక్టర్, సికింద్రాబాద్ స్థానానికి జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అయితే, ప్రస్తుతం హైదరాబాద్ కలెక్టర్ దీర్ఘకాలిక సెలవులో ఉన్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. త్వరలో ఆయనకు కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి రానుండటంతో ఆయన్నే సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా నియమిస్తారా? ఇతరులకు బదలాయిస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఈ నెల 11, 12 తేదీల్లో రిటర్నింగ్ అధికారులకు సమగ్ర శిక్షణ ఇవ్వనున్నారు. ఆలోగా కొత్త అధికారికి కలెక్టర్‌గా పోస్టింగ్ ఇవ్వకపోతే రెండు పార్లమెంట్ స్థానాలకూ ఒక్కరే రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించే అవకాశం ఉంది. కాగా, ఓటరు జాబితా సవరణలో భాగంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ఉంటారని పేర్కొన్నారు.

ఏసీబీ వలలో జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్



మల్కాజిగిరి/హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ మల్కాజిగిరి సర్కిల్‌లో ఓ వ్యక్తి నుంచి 80 వేలు లంచం తీసుకుంటూ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. ఇంటి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) కోసం వ్యక్తినుంచి లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ ఈ వివరాలు తెలిపారు. యాప్రాల్ స్వర్ణధామ కాలనీకి చెందిన ప్రదీప్‌కుమార్ ఓసీ కోసం టీపీఎస్ నరేష్‌ను ప్రదీప్‌కుమార్ పలుమార్లు కలిశారు. 80 వేలు ఇస్తేనే ఓసీ ఇప్పిస్తానని చెప్పడంతో ప్రదీప్‌కుమార్ ఏసీబీని ఆశ్రయించారు. డబ్బును నరేష్ సహాయకుడైన శ్రీనివాస్ అలియాస్ యోగేశ్వర్ ద్వారా తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని నిందితులను ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి

» అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం: కృష్ణయ్య

» జంతర్ మంతర్ వద్ద బీసీ నేతల ధర్నా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బీసీ బిల్లు ఆమోదించి చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు వర్తింపజేయాలని అన్నారు. తమ డిమాండ్ల సాధనకు శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఆర్థిక వెనుకబడిన వర్గాలకు 10% రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు పెట్టి ఒక్క రోజులో ఆమోదించారని, కానీ 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా బీసీ బిల్లు గురించి ఏ రాజకీయ పార్టీ పట్టించుకోవడం లేదన్నారు. గొర్రెలు, బర్రెలు, పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని బీసీలను శాశ్వతంగా బిచ్చగాళ్లను చేస్తున్నారని విమర్శించారు. అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని, దేశ జనాభాలో 52% ఉన్న బీసీలకు చట్టసభల్లో 14% ప్రాతినిధ్యం కూడా లేకపోవడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిందని, ఎన్నికల్లో డబ్బులు లేని బీసీలు గెలిచే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని 29 రాష్ట్రాలుంటే 16 రాష్ట్రాల నుంచి ఒక్క బీసీ ఎంపీ కూడా లేరని తెలిపారు. గవర్నర్లు, బ్యాంకుల చైర్మన్లు, కేంద్ర కార్యదర్శుల్లో 98 శాతం అగ్రవర్ణాల వారే ఉన్నారని, ఇతర ఉన్నత స్థాయి పోస్టుల్లో 80 శాతం ఉన్నారని వివరించారు. ధర్నాకు తెలంగాణ, ఏపీ, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన బీసీ సంఘాల నేతలు హాజరయ్యారు.



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాలో పాల్గొన్న కృష్ణయ్య, తదితరులు

కేంద్ర పన్నుల్లో వాటా పెంచాలి

1971 జనాభా లెక్కలే ప్రామాణికం కావాలి.. 15వ ఆర్థిక సంఘాన్ని కోరనున్న ప్రభుత్వం

» కమిషన్‌కు సమర్పించే నివేదిక సిద్ధం

» 18, 19న సీఎం, అధికారులతో భేటీ

» 20న కాళేశ్వరం, 'భగీరథ' సందర్శన

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేంద్ర పన్నుల్లో వాటా పెంచాలని, ఇందుకు 1971 జనాభా లెక్కలనే ప్రామాణికంగా తీసుకోవాలని 15వ ఆర్థిక సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. ప్రగతిదాయక రాష్ట్రంగా పన్ను ప్రోత్సాహకాలివ్వాలని విజ్ఞప్తి చేయనుంది. ఈ మేరకు ఈ నెల 18న రాష్ట్రానికి రానున్న 15వ ఆర్థిక సంఘానికి సమర్పించేందుకు నివేదిక సిద్ధం చేసింది. పన్నుల వసూళ్లలో ముందంజలో ఉండటం, ప్రగతిదాయక రాష్ట్రంగా గుర్తింపు లభించడం, సులభతర వాణిజ్యంలో దేశంలోనే రెండో రాష్ట్రంగా నిలవడం వంటి అంశాలు తెలంగాణకు కలిసొచ్చే అంశాలుగా అధికారులు పేర్కొంటున్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటాలు, గ్రాంట్స్-ఇన్-ఎయిడ్, సెస్సుల కేటాయింపు తదితర అంశాలపై కేంద్రానికి సిఫారసు చేయనున్న 15వ ఆర్థిక సంఘం.. ఇందుకు సంబంధించి రాష్ట్రాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనుంది. దీంతోపాటు ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి, ఆర్థిక లోటు, అప్పులు, నగదు నిల్వలు, ఆర్థిక క్రమశిక్షణ వంటి వివరాలను సేకరిస్తోంది. ఎన్‌కే సింగ్ చైర్మన్‌గా ఉన్న కమిషన్ రాష్ట్రంలో మూడు రోజులపాటు పర్యటించనుంది. 18, 19వ తేదీల్లో జూబ్లీహాల్‌లో సీఎం కేసీఆర్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమవుతుంది. 20న కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ ప్రాజెక్టు సందర్శనకు వెళుతుంది. కాగా కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రాలకు 42 శాతం వాటా ఇవ్వాలంటూ 14వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. 1971 జనాభా లెక్కలు ఆధారంగా దీనిని నిర్దేశించింది. దీని ప్రకారం రాష్ట్రానికి 2.43 శాతం పన్ను వాటా లభిస్తోంది. అయితే 15వ ఆర్థిక సంఘం 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై దక్షిణాది రాష్ట్రాలు మండిపడుతున్నాయి. 2011 లెక్కల ప్రకారమైతే నిధుల మరింత తక్కువొచ్చే ప్రమాదం ఉందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. తాము 1971 నుంచి జనాభాను నియంత్రిస్తున్నామని, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని, ఉత్తరాది రాష్ట్రాలు అవేమీ చేయడం లేదని పేర్కొంటోంది. అలాంటిది ఉత్తరాది రాష్ట్రాలకు అధిక నిధులు ఇస్తూ.. తమను శిక్షించడమేమిటని ప్రశ్నిస్తోంది. ఇదే విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకెళ్లనుంది.

పత్తికి 'గులాబీ' ముప్పు

» చివరిదశ పత్తిపై 6 జిల్లాల్లో తీవ్ర ప్రభావం



హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పత్తి పంట ఎదుగుదల, దిగుబడికి గులాబీ రంగు పురుగు గుదిబండలా తయారైంది. పత్తి సాగు మొదలైనప్పటి నుంచి చివరి దశ వరకూ నీడలా వెంటాడుతూ.. పత్తి కాయలను పీల్చి పిప్పి చేస్తోంది. వరంగల్, నల్లగొండ, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్తలు క్షేత్ర పరిశీలన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17,96,471 హెక్టార్లలో పత్తి పంటను సాగు చేయగా, అన్ని జిల్లాల్లో పత్తి తీత చివరి దశకు వచ్చింది. మొదటి రెండు సార్లు ఏరిన పత్తిలో గులాబీ రంగు పురుగు ఉండటం ఒకెత్తయితే.. డిసెంబరు, జనవరి నెలల్లో ఏరిన పత్తిలో మరీ ఎక్కువగా కనిపించింది. పురుగు సోకిన పత్తి రంగు, నాణ్యతను కోల్పోతోంది. దూదిలోని గింజలను తినేస్తుండటంతో బరువు తగ్గుతోంది. కాగా, పురుగు ఆశించిన పత్తిని జిన్నింగ్ చేయగా వచ్చిన గింజలు, వ్యర్థాలను తొలగించాలని పరిశోధన డైరెక్టర్ జగదీశ్వర్ సూచించారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వధువు కావలెను



★ పద్మశాలి / 32 / 5'7" / Business / Monthly Income 2 Lakhs / Well Settled / Hyd అబ్బాయికి Well Settled, Hyd అమ్మాయి కావలెను. Direct Whatsapp: 9346148755 AJH-173

★ బ్రాహ్మణ్ తమిళ్ అయ్యర్ గౌతమ సంధ్యం / 42Y/ మొదటి వివాహం.Q: M.A. ప్రతి నెల 40 వేలు వైదికం కల వరునికి బ్రాహ్మణ్ అమ్మాయి కావలెను. పెళ్ళి ఖర్చులు సగం మావే. ఫోన్:7702206575 AJH-62322

★ నాయుడు / 42 / B.E. / బాగా స్థిరపడిన (రిచ్) / ఏకైక వారసుడైన వరుడుకు వధువు కావలెను. కుల, కట్న, వయస్సు, అభ్యంతరం లేదు. ఫోన్: 7095712005 (డైరెక్ట్) AJQ-628770

★ బహుమతి 50 గ్రాముల బంగారం (OR) KWIDCAR FC / లేటు మ్యారేజ్ / 36Years / 5.8" / ఫెయిర్ & స్లిమ్ / B.A. కంప్యూటర్ హార్డ్‌వేర్ / వెల్ సెటిల్డ్ / చెడు అలవాట్లు లేని వరునికి OC, BC, CNB వధువు కావలెను / కట్న పట్టింపులు లేవు. చాలా అందమైన / మంచి నడవడిక గల / సాంప్రదాయపు వధువు కావలెను / చాలా అర్జెంట్ / ఫోటోలు వివరాలు ఇ-మెయిల్ చెయ్యండి / డైరెక్టు. drmz@gmx.us, drmgl01@gmail.com Whatsapp No. 7036551071 AJZ-523795

★ FREE GOLD 50 Gms (OR) KWIDCAR, FC, Late MARRIAGE, 36years, 5.8", NO BAD HABITS, BA, FAIR & SLIM, WELL SETTLED, OC, BC, CNB, NO DOWRY, BRIDE WANTED, VERY BEAUTIFUL, TREDITIONAL, GOOD HEARTED, RESPECT OTHERS, VERY URGENT, PHOTO'S & DETAILS MAIL TO : drmz@gmx.us, drmgl01@gmail.com Whatsapp No. 7036551071 AJZ-523795

★ రెండవ పెళ్ళి, శెట్టిబలిజ 45 Y, fair, 5.5", ఆర్థికంగా స్థిరపడిన వరుడికి తగిన బాదర బందీ లేని వధువు కావలెను. (కుల, ఆస్థి పట్టింపులేదు) రాయలసీమ (కేవలం) నో బ్రోకర్స్ 9505332455, 9948253382 AJA-523548

★ కమ్మ, 47 Y 5.7 డాక్టర్ 2 లక్షలు నెలకు సంపాదించే వరుడుకు అందమైన వధువు కావలెను. డిగ్రీ, 40 సం..లోపు. సం.ప్ర. సెల్ : 94927 38981 (నోబ్రోకర్స్) AJR-517364

★ యాదవ, 29 సం॥, M.Pharma, MS, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ★ యాదవ, 29 సం॥, MS, జనరల్ సర్జన్, ★ యాదవ, 26 సం॥ B.Tech గల వరులకు తగిన వధువులు కావలెను. Ph: 90003 45360, 98485 88102 AJB-770

★ నాయుడు, 38, 5.9, P.G., వెల్ సెటిల్డ్, క్లిన్ హే బిట్స్, ఆస్థి గల అందమైన వరునకు వధువు కావలెను. డైరెక్ట్. ఫోన్: Whatsapp: 91335 00456 AJB-517947

★ 2 కమ్మ, సెకండ్, RMP డాక్టర్, 5'7", డిగ్రీ, 45 నుంచి 60 సం॥ల వయస్సు కలిగిన వధువు కావలెను. పిల్లలున్నా సరే, ఇల్లరికం ఓకే, నో బ్రోకర్స్, డైరెక్ట్ : Ph: 9550496735. AJG-524630

★ 2 వైశ్య 51 సంవత్సరములు డైవర్స్, కుల ప్రసక్తి లేదు. వరుడుకి వధువు కావలెను. సంప్ర॥ నో బ్రోకర్స్, డైరెక్ట్ : Cell No : 8309382789 AJG-512106

★ 35 సం॥ల వయస్సు, నెలకు 30 వేలు సంపాదన గల అబ్బాయికి రెండో వివాహము, తిరుపతి.నో బ్రోకర్స్. సంప్రదించాల్సిన ఫోన్ : 93810 73260 AJT-516724

★ Age : 32 పెళ్లి అయి 1 year లోపు డైవర్స్ అయిన వెల్ సెటిల్డ్ (కాంట్రాక్ట్) రెడ్డి అబ్బాయికి పెళ్లికాని పేద, మధ్య తరగతి OC, BC అందమైన అమ్మాయి కావలెను. సంప్ర : 8309441327 AJW-521183

వరుడు కావలెను



★ కమ్మ నాయుడు / విడో / 59 / V.Fair / Govt. Job / వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC మధ్య తరగతి వరుడు కావలెను. ఫోన్: 9573380048 AJH-173

★ BC / విడో / 49 / చామనఛాయ / Govt. Job / 10 ఎకరములు ల్యాండ్స్ / P.M. 80K / ఆదాయం గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9705349133 AJH-173

★ కాపు / విడో / 53 / V.Fair / ఫ్యామిలీ పెన్షనర్ / రెంట్స్ / P.M. 60K గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7675018931 AJH-173

★ యాదవ / విడో / 48 / B.Sc నర్సింగ్ / Govt. Job / Own House / 5 ఎకరములు / P.M. 75K ఆదాయం గల వెల్ సెటిల్డ్ వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్: 8186909024 AJH-173

★ రెడ్డి / విడో / 52 / 5'4" / బిజినెస్ / 1L P.M. / రెంట్స్ / 50,000 P.M. / 10 ఎకరాల పొలం / వెల్ సెటిల్డ్ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9666864807 AJH-173

★ FC / విడో / 60 / రిటైర్డ్ పెన్షనర్ / సొంత ఇల్లు & రెంట్స్ / సాంప్రదాయ కుటుంబంగల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9553583079 AJH-173

★ 46 / నాయీ బ్రాహ్మణ / Widow / Govt. Job / బిజినెస్ / సొంత ఇల్లు & భూములు కలిగిన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9581708805 AJH-173

★ నాయుడు / డైవర్స్ / 30 / 5'4" / Pvt. లెక్చరర్ / ఏకైక కూతురు గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 8897055133 AJH-173

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు / విడో / 35 / ఫెయిర్ / సొంత బిజినెస్ & ల్యాండ్స్, అపార్ట్ మెంట్స్ / గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9581592337 AJH-173

★ చౌదరి / విడో / 31 / 5'4" / M.D. / Doctor / డయాగ్నస్టిక్స్ ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 8106499144 AJH-173

★ కుల పట్టింపు లేదు / విడో / 45 / 5'4" / Hyd / గైనకాలజిస్ట్ డాక్టర్ / కరీంనగర్ / Own House వధువుకు (35 నుండి 50 సం॥లు) FC/BC వరుడు కావలెను. ఫోన్: 9394288881 AJH-173

★ కమ్మ / విడో / 48 / 5'4" / తిరుపతి / Own House, Rents / బిజినెస్ / అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9912916046 AJH-173

★ రెడ్డి / విడో / 45 / 5'4" / డిగ్రీ / Nellore / C.Govt. Job / 60,000 P.M. / Own House (Rents) వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9948070006 AJH-173

★ కుల పట్టింపులేదు / విడో / 45 / 5'3" / ఆంధ్ర / Govt. Job / 30,000 P.M. / Own House (Rents) / (1) పాప Married / అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9912038880 AJH-173

★ కుల పట్టింపులేదు / లేట్ మ్యారేజెస్ / 45 / 5'4" / తిరుపతిలో సొంత ఇల్లు / ఒక పాప / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7036358890 AJH-173

★ హైదరాబాద్, విజయవాడ, నంద్యాలకి 30 సం॥ నుండి 45 సం॥లోపు అందమైన వధువులకు కుల పట్టింపులేని వరులు కావలెను. ఫోన్: 7036358890 AJH-173

★ కుల, ఆస్తి పట్టింపులేదు / విడో / 48 / Hydలో బిజినెస్ / ఆంధ్రాలో పొలాలు గల అందమైన వధువుకు మంచి మనసున్న వరుడు కావలెను. ఫోన్: 8125901016 AJH-173

★ కుల ప్రసక్తి లేదు / విడో / 45 / 5'3" / సొంత ఇల్లు / హార్టి కల్చర్ ల్యాండ్స్ / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9121985289 AJH-173

★ రెడ్డి / 50 / విడో / 5'4" / Govt. Job / 60,000/- P.M. / 2 సొంత ఇల్లు / Rents / 30,000/- P.M. / సాంప్రదాయ కుటుంబంలోని వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఫోన్: 7032193280 AJH-173

★ రెడ్డి / 41 / విడో / డిగ్రీ / Govt. Job / 45,000/- P.M. / Hyd లో సొంత ఇల్లు / వెల్ సెటిల్డ్ / కులపట్టింపులేని వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఫోన్: 9160208469 AJH-173

★ కాపు / విడో / 40 / Private Job / Salary 35,000/- P.M. / సొంత ఇల్లు / 2 ఎకరముల పొలం / అందమైన వధువుకు వరుడు కావలెను. డైరెక్టు. ఫోన్: 8367013811 AJH-173

★ రెడ్డి / 59 / విడో / 5'5" / Fair / ఫ్యామిలీ పెన్షనర్ / సొంత ఇల్లు / బిజినెస్ / 10 ఎకరముల పొలం గల వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. ఫోన్: 7287079096 AJH-173

★ నాయుడు / 45 / 5'5" / డిగ్రీ / సింగరేణి జాబ్ / విడో / మార్బుల్ బిజినెస్ / వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఫోన్: 8978513964 AJH-173

★ కమ్మ / 50 / 5'5" / విడో / Govt. Job / 50,000/- P.M. / గల వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఫోన్: 7330957963 AJH-173

★ FC / విడో / 55 / 5'3" / Fair / Govt. జాబ్ / 70K P.M. / సొంత ఇల్లు / బిజినెస్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఫోన్: 9640602492 AJH-173

★ CNB / 48 / 5'4" / Degree / Govt. Employee / VRS / P.M. 42,000/- / Own Business / House / Lands వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9492572087 AJH-352

★ KAPU / 49 / Widow / 5'5" / PG / Govt. Employee / VRS / P.M. 45,000/- / Car Travels / Garments Business / వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 7095696715 AJH-352

★ Velama / 49 / Widow / 5'4" / M.A., B.Ed / Govt. Teacher / VRS / P.M. 48,000/- / వధువుకు తనను తన Businessను చూసుకోవడానికి FC/BC ఇల్లరికం వరుడు కావలెను. ఫోన్: 9618251957 AJH-352

★ Vysya / 48 / Widow / 5'4" / P.G. / Central Govt. Employee / VRS / P.M. 45,000/- / Gold Shop / Own Super Market / Duplex House / PM 3 Lakhs / వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. ఫోన్: 7729815438 AJH-352

★ కమ్మ / 32 / విడో / 5'5" / ఫుల్ ఫెయిర్ / MBA / ఓన్ టెక్స్‌టైల్స్ / బిజినెస్ / గల అందమైన వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. ఫోన్: 7036782989 AJH-62435

★ కుల ఆస్తి పట్టింపు లేదు / చౌదరి / విడో / 36 / 5'5" / MBBS, MS (గైనిక్) / V. ఫెయిర్ / ఓన్ హాస్పిటల్ గల అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 8499074736 AJH-62433

★ రెడ్డి / డైవర్స్ / 42y /5'3"/ Fair / డిగ్రీ / సూపర్ మార్కెట్ & ఫర్నీచర్ షోరూమ్స్ / ఓన్ బిజినెస్ / మంచి ఆస్తి కల్గిన వధువుకి వరుడు కావలెను. (నో బ్రోకర్స్)(CNB),ఫోన్:7287045913 / 9515552539 AJH-17101

★ రెడ్డి / విడో /43y / 5'3"/ డిగ్రీ / Fair / సొంత అపార్ట్‌మెంట్స్ / రెంట్స్ / టైల్స్‌షాప్ / మంచి ఆస్తి గల వధువుకి కుల ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (నో బ్రోకర్స్) ఫోన్:9581776711 / 9581151051 AJH-17101

★ కుల ఆస్తి పట్టింపు లేదు / విడో /32y / 5'4"/ చౌదరి / నో చిల్డ్రన్స్ / అందమైన వధువుకి 1, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 7036421871 AJH-17101

★ చౌదరి / విడో /40y / ఆయిల్ ఫ్యాక్టరీస్ / ఓన్ హౌస్ / కలిగి ఉన్న అందమైన వధువుకి కులపట్టింపులేని వరుడు కావలెను. వాట్సాప్ :8096780212 AJH-17101

★ కుల పట్టింపు లేదు / 2nd మ్యారేజ్ / 50y /5'3" / Inter, ఫ్యామిలీ పెన్షన్ 30,000/– PM గల వధువుకు ఇల్లరికం వరుడు కావలెను. ఫోన్:7993979542 AJH-62409

★ రెడ్డి, 26 Y, fair, 5.5", well settled ఫ్యామిలికి చెందిన వధువుకు కుల, ఆస్థి పట్టింపులేని వరుడు కావలెను. whatsapp 8886592443 AJA-523430

★ నూర్ బాషా వెల్ సెటిల్డ్ (రెండవ) వివాహ వధువుకు వరుడు కావలెను. లేట్ మ్యారేజెస్ కన్వర్టెడ్, రెండవ, అన్ని కులాల వారికి వివాహ సంబంధం చూడబడును. సంప్ర. దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ కలిగిన సంస్థ. మణిశ్రీ మ్యారేజ్ బ్యూరో (రి). 93911 18187, 93907 67614 గన్నవరం AJN-518832

★ కాపు, 23Y, B.Tech, 18 కోట్ల స్థిరాస్థి కలిగి పేరెంట్స్ లేని అందమైన ఏకైక కుమార్తెకు వరుడు కావలెను. (ఆస్థి, కుల పట్టింపు లేదు). Send Photos Whatsapp No: 90309 16399 AJB-185

★ కమ్మ, విడో, 24Y, B.Tech, 22 కోట్ల స్థిరాస్థి కలిగి పేరెంట్స్ లేని వధువుకు వరుడు కావలెను. (ఆస్థి, కుల పట్టింపు లేదు). Send Photos Whatsapp No: 90304 58459 AJB-186

కళ్యాణ వేదిక

★ స్పెషల్లీ డాక్టర్స్ (5 వేల ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MCH, MDS & Dr's మాత్రమే. 1వ, 2వ లేట్, దేశ, విదేశ సంబంధాలు అన్ని కులములకు కుదుర్చబడును. ఫోన్:9701655685 AJH-173

★ సుధా మ్యారేజ్ బ్యూరో, అన్ని కులాలు, అన్ని మతాల వారికి 1వ, 2వ లేటు సంబంధాలు వెంటనే కుదుర్చబడును. కాపు, కమ్మ, రెడ్డి సంబంధాలు మా ప్రత్యేకత. స్త్రీలకు ఫ్రీ. ఫోన్:7036657616 AJH-173

★ రెడ్డి కులస్తులకు తక్కువ సమయంలో ఉన్నతమైన వివాహ సంబంధాలు 1వ 2వ Late సంబంధాలు కుదుర్చబడును. (దండెం మ్యారేజ్ బ్యూరో) ఫోన్: 9959401588 / 9032339339 AJH-173

★ ముదిరాజ్ మహా కళ్యాణవేదిక: ముదిరాజ్ కులస్తులకు మాత్రమే పెళ్ళి సంబంధాలు చూడబడును. ఎం.పవన్‌కుమార్ ముదిరాజ్, ఫోన్:7093222626 / 7093222727, Org.by: ముదిరాజ్ సేవా సమితి. AJH-173

★ కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో 1వ 2వ లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి సంబంధాలు కుదుర్చబడును. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. ఫోన్: 7416303057 AJH-173

★ Whatsapp your Photo & Biodata to 9347262769. We will send the suitable matches www.pellisandadi.com. ESTD.1990 AJH-173

★ FREE రిజిస్ట్రేషన్, బ్రాహ్మణ మరియు అన్ని కులాల వధూ-వరులకు సువర్ణ అవకాశం. bhavanimatrimony.com, ECIL, Hyd. ఫోన్: 9704656103/9533608887 AJH-13518

★ లక్ష్మి మ్యారేజ్ బ్యూరో కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు ఫోన్: 9705588313, 9182731506 AJH-13511

★ F.C. 56 yrs. P.G. 5"6 Divorce వారికి పెన్షనర్స్, Widows, Govt. Employees, BC or FC కావలెను. నేరుగా సంప్రదించండి. 9603283026 AJV-490238

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.



పై స్థాయి నుంచి కింది స్థాయి వరకూ ఉద్యోగులు కంపెనీ తమదని భావిస్తే.. తమ శక్తి సామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించి తాము ఇవ్వగలిగినంత ఇస్తారు. ఉద్యోగులు అలా ప్రవర్తించేలా చేయడం కంపెనీ అనుసరించే విలువలు, పని సంస్కృతిపై ఆధార పడి ఉందని హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ దీపక్ పరేఖ్ అన్నారు. ఉద్యోగులు కంపెనీని తమదిగా భావించినప్పుడే విజయం సాధించడం సాధ్యమని, ఒక కంపెనీ విజయం సాధించడానికి ఇంతకు మించిన మార్గం లేదన్నారు. విలువలు, సంస్కృతి క్షీణత కంటే హాని చేసేవి వేరే ఏమీ లేవని తన అనుభవాన్ని రంగరించి వివరించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఫ్యామిలీ వ్యాపార సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా ఏమన్నారంటే..

విజయం సాధించాలంటే..

- కంపెనీలతో కార్పొరేట్ సామ్రాజ్యాన్ని నిర్మించుకోవాలంటే.. ఆ కంపెనీల నిర్వహణకు తగిన వ్యక్తులను గుర్తించడం చాలా ముఖ్యం. నిర్వహణకు వ్యక్తులే కీలకం. ఇందుకు ప్రైవేట్, ప్రభుత్వ, కుటుంబ నిర్వహణ కంపెనీ అన్న భేదం లేదు. ఇది అన్ని కంపెనీలకు వర్తిస్తుంది.
- ఆయా రంగాల్లో నైపుణ్యం ఉంటే.. సరిపోదు. సరైన సంస్కృతి అన్నింటికన్నా ముఖ్యమైంది. అవసరమైదీ కూడా. పనికి సంబంధించిన నైతిక విలువలు (వర్క్ ఎథిక్స్) చాలా ముఖ్యం. హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్‌లో చాలా లిస్టెడ్ కంపెనీలున్నాయి. వాటిని నిర్వహించే వ్యక్తులకే అన్ని అధికారాలు ఇస్తాం. అయితే.. ఒక కంట కనిపెడుతూ ఉంటాం. ఏదైనా తప్పు జరగనంత వరకూ రోజు వారీ వ్యవహారాల్లో తల దూర్చం. అలా కాకపోతే ఆ కంపెనీలు ఎదగవు. ఈ విధానం వల్లే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పురోభివృద్ధి చెందుతోంది.
- ఉద్యోగులను నియంత్రించడానికి బదులు సాధికారత కల్పించాలి. కంపెనీని వారు తమదిగా భావించాలి. అలాంటి భావాన్ని కల్పిస్తే.. వారు తాము చేయగలిగినదంతా చేస్తారు.

నిపుణులను తీసుకురండి..

కుటుంబ నిర్వహణ కంపెనీలు మూడో తరం తర్వాత ఉండవని చాలా మంది అంటారు. అది కొన్ని కంపెనీల విషయంలో మాత్రమే నిజం. ఎన్నో కంపెనీలు దశాబ్దాల తరబడి కొనసాగుతున్నాయి. కుటుంబ నిర్వహణ కంపెనీల పరంగా భారత్ మూడో స్థానంలో ఉంటే.. చైనా రెండు, రష్యా ప్రథమ స్థానాల్లో ఉన్నాయి. అయితే.. పరిస్థితులు మారుతున్నాయి. ముఖ్య కార్యనిర్వహణ అధికారులకు (సీఈఓ) న్యాయ, చట్ట, నిర్వహణ పరమైన అంశాలతోపాటు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వ్యాపారంలో తలెత్తే ఇబ్బందులను అధిగమించడానికి కుటుంబ నిర్వహణ కంపెనీలు వృత్తిపరమైన నిపుణులను కంపెనీలోకి ఆహ్వానించాలి. కుటుంబ కన్నా వ్యాపారం ముఖ్యమని గుర్తించిన కంపెనీల ప్రమోటర్లు ముందుకు వెళతారు. వృత్తిపరమైన నిపుణులు, స్వతంత్ర బోర్డు చాలా అవసరం. ఇటువంటి నిపుణులు, సలహా బోర్డు వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకోగలదు. విశ్వసపాత్రమైన నిపుణులు కష్టకాలంలో సరైన సలహాలతో కంపెనీలను ఆదుకోగలరు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్





వినియోగదారుడికి ఉత్సాహం.. కంపెనీలకు ప్రోత్సాహం

ఎఫ్‌ఎంసీజీ, గృహోపకరణాలకు గిరాకీ.. వాహన, సిమెంట్ రంగాలకూ మేలు

వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ వినియోగాన్ని పెంచనుంది. రైతులకు ప్రకటించిన నగదు బదిలీ పథకం.. రూ.5 లక్షల వార్షిక ఆదాయం వరకూ ఆదాయ పన్ను మినహాయింపు..గ్రామీణ వినియోగాన్ని, మధ్య తరగతి వర్గాల కొనుగోలు శక్తిని పెంచనున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వంటి గృహోపకరణాలకు, సబ్బులు, అలంకరణ వస్తువులు ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ)కు గిరాకీ ఆకర్షణీయంగా పెరగొచ్చని భావిస్తున్నాయి. సాధారణ విక్రయాలతోపాటు ఆన్‌లైన్ విక్రయాలూ పుంజుకునే వీలుంది. దేశ జనాభాలో 65 శాతం గ్రామాలు, చిన్న పట్టణాల్లోనే నివసిస్తున్నారు. ఎఫ్‌ఎంసీజీ విక్రయాల్లో గ్రామీణ మార్కెట్ వాటా 35-40 శాతం ఉంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలుతో గ్రామీణ మార్కెట్లో ఎఫ్‌ఎంసీజీ, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ విక్రయాలు కుంటుపడ్డాయి. గృహోపకరణాల రంగంలో గత కొద్ది నెలల నుంచి అమ్మకాలు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా బడ్జెట్‌లో చేసిన ప్రకటనలు నూతనోత్తేజాన్ని నింపనున్నాయి. 2018లో ఎఫ్‌ఎంసీజీ పరిశ్రమ 15 శాతం వృద్ధి చెందింది. ఈ ఏడాది మరింత మెరుగైన వృద్ధి సాధించే అవకాశం ఉంది.

- ఆంధ్రజ్యోతి, బిజినెస్ డెస్క్

వాహన



మధ్య తరగతికి పన్ను ఆదాతో ద్విచక్ర వాహనాలు, చిన్న కార్ల విక్రయాలు పెరిగే అవకాశం ఉంటుందని వాహన కంపెనీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. వ్యవసాయ రంగ పునరుద్ధరణ చర్యలు ట్రాక్టర్ల విక్రయాలకు దన్నుగా నిలవనున్నాయి. మౌలిక రంగానికీ పెద్దపీట వేయడం భారీ యంత్రాల తయారీ రంగానికి ప్రోత్సాహం లభించనుంది. రైల్వే శాఖకు, మెట్రో ప్రాజెక్టులకు కేటాయింపులు పెంచడం కూడా ఈ రంగానికి కలిసిరానుంది.



సిమెంట్

రియల్టీ రంగానికి భారీగా పన్ను రాయితీలు ప్రకటించిన నేపథ్యంలో మందకొడిగా సాగుతున్న గృహ విక్రయాలు మళ్లీ పుంజుకోవచ్చు. దీంతో సిమెంట్, టైల్స్, ఎలక్ట్రికల్, పైపులు, ప్లైవుడ్, ఫర్నీచర్‌కు ప్రయోజనం చేకూరనుంది.

పర్యాటకం

బడ్జెట్‌లో ప్రకటించిన ఆదాయ పన్ను రాయితీలతో పర్యాటక రంగానికీ కలిసిరానుంది. మధ్యతరగతి వర్గాలు, వేతన జీవులకు పన్ను ఆదాతో విహారయాత్రల కోసం మరింత ఖర్చు చేసే వెసులుబాటు లభిస్తుంది.



బడ్జెట్ నిర్ణయాలు వినియోగం పెంచడంతో పాటు వృద్ధికి దోహదం చేయనున్నాయి. వ్యవసాయ రంగంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తగ్గవచ్చు.

- సంజీవ్ పూరి, ఐటీసీ ఎండీ



కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగానికి చెందిన పలు ఉత్పత్తులపై జీఎస్‌టీ భారం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింది. ఇందుకుతోడు బడ్జెట్ నిర్ణయాలు వచ్చే ఆర్థిక సంవత్సరంలో విక్రయాలను భారీగా పెంచవచ్చని ఆశిస్తున్నాం.

- సునీల్ డిసౌజా, వర్ల్‌పూల్ ఇండియా ఎండీ





వినియోగ డిమాండ్‌కు బడ్జెట్ ఉత్ప్రేరకంగా పనిచేయనుంది. ముఖ్యంగా ప్యాకేజింగ్ ఆహారోత్పత్తులు, ఇతర కన్స్యూమర్ ఉత్పత్తులకు గిరాకీ గణనీయంగా పెరగవచ్చని భావిస్తున్నాం.

- సునీల్ దుగ్గల్, డాబర్ ఇండియా సీఈఓ



బ్రాండెడ్ ఉత్పత్తుల కొనుగోళ్లు పెరగడంతోపాటు గ్రామీణ జీవనశైలి మరింత మెరుగుపడేందుకు ఈ బడ్జెట్ దోహదపడనుంది.

- వివేక్ గంభీర్, గోద్రేజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఎండీ



దేశంలో తయారీ రంగం, ఉద్యోగాల కల్పన పుంజుకోవాలంటే వస్తు వినియోగం పెరగడం చాలా కీలకం.

- క్రిష్ అయ్యర్, వాల్‌మార్ట్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ

చందా కొచ్చర్‌పై మనీలాండరింగ్ కేసు

దాఖలు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్



న్యూఢిల్లీ : ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈఓ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ ప్రమోటర్ వేణుగోపాల్ ధూత్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. మనీ లాండరింగ్ (అక్రమంగా నిధుల మళ్లింపు) కేసును నమోదు చేసింది. కార్పొరేట్ గ్రూప్‌నకు బ్యాంక్ మంజూరు చేసిన రూ.1,875 కోట్ల రుణాలను అక్రమ పద్ధతుల్లో మళ్లించారని పేర్కొంటూ వీరిపై క్రిమినల్ కేసును దాఖలు చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. గత నెలలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చేసిన ఫిర్యాదు ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ నివేదిక (ఈసీఐఆర్)ను ఈడీ నమోదు చేసిందని తెలిపారు. ఈసీఐఆర్.. పోలీస్ ఎఫ్ఐఆర్‌కు సమానమైదని వారు పేర్కొన్నారు. ఈ కేసులో సీబీఐ నిందితులుగా పేర్కొన్న వారినే ఈడీ కూడా తన నిందితుల జాబితాలో చేర్చింది. చందా కొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్ సహా ఆయన కంపెనీలైన వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (వీఐఈఎల్), వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (వీఐఎల్)లపై సీబీఐ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ధూత్ ఏర్పాటు చేసిన సుప్రీం ఎనర్జీ, దీపక్ కొచ్చర్ నేతృత్వంలోని న్యుపవర్ రెన్యువబుల్స్‌ను కూడా సీబీఐ.. తన ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. భారతీయ శిక్షాస్మృతిలోని పలు సెక్షన్ల కింద సీబీఐ ఈ కేసులు నమోదు చేసింది.

బులియన్




బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	34,430	---	34,400	33,720	33,410
క్రితం ముగింపు	34,280	33,800	34,400	33,660	33,330
22 క్యారెట్లు	31,880	---	31,640	31,220	31,940
క్రితం ముగింపు	31,740	31,130	31,640	31,210	31,860
వెండి (కిలో)	41,600	---	41,700	41,500	43,800
క్రితం ముగింపు	41,300	41,800	41,700	41,400	43,800

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.55 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	395	చిత్తూరు	428
వరంగల్	397	చెన్నై	435
విజయవాడ	395	నమక్కల్	425
గోదావరి	395	బెంగళూరు	425
విశాఖపట్నం	395	ముంబై	450

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	83
కరీంనగర్	79	గుంటూరు	84
వరంగల్	78	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	88
కర్నూలు	80	నెల్లూరు	88
విశాఖపట్నం	83	అనంతపురం	89
గోదావరి	81		

జపాన్ మార్కెట్ భిన్నమైంది

భారత ఐటీ కంపెనీలు అక్కడ పాగా వేయగలవు

వర్ధమాన మార్కెట్లపై దృష్టి పెడుతున్నాయి

అమెరికాలో సవాళ్లు కొనసాగుతాయ్

సాఫ్ట్‌వేర్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఈడీ సరీన్



హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్

రానున్న కాలంలో దేశీయ మార్కెట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఆకర్షణీయం కానుంది. విద్యా, వైద్యం, నగదురహిత ఆర్థిక వ్యవస్థ మారే దిశగా వేస్తున్న అడుగులు, ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులు తదితర సానుకూల పరిణామాల కారణంగా దేశీయ మార్కెట్‌లో ఐటీ కంపెనీల ఆదాయాలు పెరగనున్నాయని ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఈసీఎస్ఈపీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీకే సరీన్ చెబుతున్నారు. అమెరికా తర్వాత సాఫ్ట్‌వేర్‌కు అతిపెద్ద మార్కెట్ అయిన జపాన్ మార్కెట్‌లో భారత కంపెనీలు పట్టు సాధించడానికి కొంత సమయం పడుతుందని, అమెరికా మార్కెట్‌లో భవిష్యత్తులో కూడా భారత ఐటీ కంపెనీలకు సవాళ్లు కొనసాగే వీలుందని అంటున్నారు. కెన్యా, ఘనా, నైజీరియా, ఆఫ్రికా, అర్జెంటీనా, బ్రెజిల్, కొలంబియా వంటి లాటిన్ అమెరికా దేశాల మార్కెట్లపై దృష్టి సారిస్తే.. అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని 'ఆంధ్రజ్యోతి బిజినెస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ముఖాముఖి లోని ముఖ్యాంశాలు..

ఇప్పటికీ భారత ఐటీ కంపెనీలకు అమెరికా మార్కెట్టే కీలకం. రానున్న కాలంలో దేశీయ మార్కెట్ ఐటీ కంపెనీలకు ఎటువంటి అవకాశాలను అందించనుంది?

అన్ని రంగాల్లో డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం పెరిగిపోతోంది. 'డిజిటల్ ఇండియా'గా మారే దిశలో వడివడిగా అడుగులు వేస్తున్నాం. డిజిటల్ చెల్లింపులు ఆకర్షణీయంగా పెరుగుతున్నాయి. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఐటీ అప్లికేషన్ల వినియోగం పెరుగుతోంది. బ్యాంకింగ్ రంగంలో చెల్లింపుల విభాగంలో ఐటీ విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. ప్రభుత్వ విభాగాలు, కార్యకలాపాలు, వినియోగదారు సేవల్లో మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం భారీ ఐటీ ప్రాజెక్టులను చేపడుతోంది. ఇప్పటి వరకూ లేని విధంగా భవిష్యత్తులో దేశంలో ఐటీపై వ్యయం పెరగనుంది. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని దేశీయ ఐటీ కంపెనీలు దేశీయ మార్కెట్‌పై కూడా దృష్టి సారిస్తున్నాయి. ప్రస్తుతం ఐటీ, ఐటీ ఆధారిత సేవలు, హార్డ్‌వేర్ ద్వారా కంపెనీలకు దాదాపు 4,100 కోట్ల డాలర్ల ఆదాయం లభిస్తోంది. ఇది భవిష్యత్తులో ఆకర్షణీయంగా పెరగనుంది.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అమెరికా తర్వాత సాఫ్ట్‌వేర్‌కు జపాన్ అతిపెద్ద మార్కెట్. ఈ మార్కెట్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భారత కంపెనీలు వెనుకబడే ఉన్నాయి. కారణాలు?

సాఫ్ట్‌వేర్‌కు జపాన్ రెండో అతిపెద్ద మార్కెట్. అయితే.. జపాన్ మార్కెట్‌కు కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. జపాన్ కంపెనీలు జపాన్ భాషలోనే అన్నీ జరగాలంటారు. అందువల్ల భారత ఐటీ కంపెనీలు ఉద్యోగులకు జపనీస్ భాషను నేర్పించాల్సిన అవసరం ఉంది. అమెరికా, యూరప్ కంపెనీల తరహాలో జపాన్ కంపెనీలు వెంటనే ఎవరితో పడితే వారితో వ్యాపారం చేయడానికి ఇష్టపడవు. భద్రతపై భరోసా లభించినప్పుడే వారు వ్యాపార కార్యకలాపాలకు ముందుకు వస్తారు. ధర, సేవల డెలివరీ అన్నీ బాగున్నాయని నిర్ధారించుకున్న తర్వాతే చేతులు కలుపుతారు. వ్యాపారం చేసేటప్పుడు వారు ఎటువంటి తలనొప్పులను ఇష్టపడరు. అయితే.. ప్రస్తుతం అనేక ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లోని జపాన్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి. వారి సంస్కృతి మనకు అర్థం అవుతోంది. భవిష్యత్తులో భారత ఐటీ కంపెనీలకు జపాన్ మంచి మార్కెట్ కాగలదు. భారత కంపెనీలకు అక్కడ పాగా వేయగల సత్తా ఉంది. అమెరికా కంపెనీలకు పోటీ కాగలవు.

కొన్ని జపాన్ ఐటీ కంపెనీలు భారత్‌లో ఐటీ కంపెనీలను సొంతం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. కారణాలు ఏమిటీ?

టెక్నాలజీ పరంగా భారత ఐటీ కంపెనీలు చాలా ముందున్నాయి. వ్యాపారంలో కొనుగోళ్లు, విలీనాలు సాధారణమే. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కంపెనీలు వెంటనే స్పందిస్తాయి. జపాన్ కంపెనీలే కాదు. అమెరికా కంపెనీలు సైతం అవకాశం లభిస్తే.. భారత ఐటీ కంపెనీలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. జపాన్ కంపెనీలు అంతే.

అమెరికాలో ఐటీ కంపెనీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భవిష్యత్తు ఎలా ఉంటుంది?

భారత ఐటీ కంపెనీలకు భవిష్యత్తులో అమెరికాలో సవాళ్లు కొనసాగే అవకాశాలే ఉన్నాయి. అక్కడి ప్రభుత్వం బయట వారి కన్నా అమెరికన్లను తీసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఒత్తిడి చేస్తోంది. అయితే.. భవిష్యత్తుల ఎలా ఉంటుందన్నది వేచి చూడాలి. భారత ఐటీ కంపెనీలకు అమెరికానే ప్రధాన మార్కెట్. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల మార్కెట్లపై ఐటీ కంపెనీలు దృష్టిసారిస్తున్నాయి. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్లలోకి ప్రవేశించడానికి ప్రత్నిస్తున్నాయి. ఎగుమతుల ప్రోత్సాహక మండలి కూడా ఇందుకు చర్యలుచేపడుతోంది. ఇందులో భాగంగానే ఇండియా సాఫ్ట్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆయా దేశాల్లో జరిగే కార్యక్రమాల్లో భారత కంపెనీలు పాల్గొనేందుకు చర్యలు తీసుకుంటోంది.

రానున్న కాలంలో ఐటీ కంపెనీల నియామకాల తీరు ఎలా ఉంటుంది?

ఐటీ రంగంలో భారీగా టెక్నాలజీ మార్పులు వస్తున్నాయి. డిజిటల్ టెక్నాలజీల్లో నైపుణ్యం ఉన్న వారికి భవిష్యత్తు బాగుంటుంది. టెక్నాలజీ పరంగా క్లిష్టమైన ఉద్యోగాలు భారీగా వచ్చే అవకాశం ఉంది. వాస్తవానికి బిగ్‌డేటా, డేటా అనలిటిక్స్, ఐఓటీ, ఎథికల్ హ్యాకింగ్ వంటి విభాగాల్లో నిపుణుల కొరత ఉంది. ఇటువంటి విభాగాల్లో నైపుణ్యాలున్న వారికి కంపెనీలు మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ఆటోమొబైల్ రంగం 4.౦ దశకు చేరింది. అలానే ఐటీ రంగంలో కూడా భారీ మార్పులు వస్తున్నాయి. ప్రస్తుతం దాదాపు 30 లక్షల మంది నిపుణులు ఈ రంగంలో పని చేస్తున్నారు. ఉద్యోగ అవకాశాలు సాధారణంగా సగటున 10-12 శాతం పెరుగుతాయి.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నష్టం రూ.718 కోట్లు

న్యూఢిల్లీ: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నష్టం తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి బ్యాంక్ రూ.718.23 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ నష్టం రూ.1,664.22 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.6,589.32 కోట్ల నుంచి రూ.6,329.17 కోట్లకు తగ్గింది. స్థూల మొండి పద్దులు (ఎన్‌పీఏ) 18.08 శాతం నుంచి 20.64 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు కూడా 9.45 శాతం నుంచి 10.32 శాతానికి ఎగబాకాయి. మొండి రుణాలు, కాంటిజెన్సీల కోసం కేటాయింపులు మాత్రం రూ.3,427 కోట్ల నుంచి రూ.1,818.85 కోట్లకు తగ్గాయి.

విత్త లోటును 3.3 శాతానికి కట్టడి చేస్తాం

ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి గార్గ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) ముగిసే నాటికి విత్త లోటును 3.3 శాతానికి చేరుస్తామని విశ్వసిస్తున్నట్లు ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ వెల్లడించారు. 2018-19లో ఇది 3.4 శాతంగా ఉంటుందని అంచనా వేసామని, తాజాగా దీన్ని 3.3 శాతానికి సవరించినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా 2020-21 నాటికి విత్త లోటును 3 శాతానికి చేర్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గడచిన రెండేళ్లలో ద్రవ్య లోటు ఎక్కడా కూడా కట్టు దప్పలేదని, నిర్దేశిత లక్ష్యాన్ని ఎప్పుడు కూడా అధిగమించలేదని ఆయన పేర్కొన్నారు. పరిస్థితులు పూర్తిగా నియంత్రణలో ఉండటంతో విత్త లోటు అంచనాలను 3.4 శాతం నుంచి 3.3 శాతానికి సవరించినట్లు గార్గ్ తెలిపారు. దీంతో 2020-21 నాటికి 3 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

టీవీఎస్ విక్రయాల్లో 4 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : జనవరి నెలలో టీవీఎస్ మోటార్ కంపెనీ విక్రయాలు 4 శాతం పెరిగాయి. కంపెనీ ఈ నెలలో మొత్తం 2,82,630 యూనిట్లను విక్రయించింది. గత ఏడాది ఇదే కాలంలో ఇవి 2,71,901 యూనిట్లుగా ఉన్నాయి. ఇందులో స్కూటర్ విక్రయాలు 85,299 యూనిట్లుగా ఉండగా మోటార్ సైకిల్ విక్రయాలు 1,11,253 యూనిట్లుగా ఉన్నాయి. మరోవైపు త్రి చక్ర వాహన విక్రయాలు 13,353 యూనిట్లుగా ఉన్నాయని తెలిపింది. త్రి చక్ర వాహన విక్రయాల్లో ఏకంగా 52 శాతం వృద్ధిని సాధించినట్లు పేర్కొంది.

70 ఏళ్లు దాటిన వారికి 15% అదనపు పెన్షన్ ఇవ్వండి

» 'హై ఎంపవర్డ్' నివేదిక బహిర్గతం చేయండి: పెన్షనర్లు

నల్లకుంట/హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పదో పీఆర్సీ కమిషన్ సిఫార్సు మేరకు 70 ఏళ్లు దాటిన పింఛనుదారులకు 15 శాతం అదనపు పింఛను ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ కోరింది. జేఏసీ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు పలు తీర్మానాలు చేసినట్లు జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టి.సుధాకర్‌రావు పేర్కొన్నారు. కొత్త పీఆర్సీ నివేదికను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని, కరువు భత్యం బకాయిలు వెంటనే చెల్లించాలని, 60 ఏళ్లు దాటిన పెన్షనర్లకు ఆర్టీసీ బస్సుల్లో సగం రాయితీ కల్పించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. కాగా, హై ఎంపవర్డ్ మానిటరింగ్ కమిటీ సమర్పించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం వెంటనే బహిర్గతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.కృష్ణమూర్తి, ఎం.ఎన్.రెడ్డి, డిమాండ్ చేశారు. దీనిపై తెలంగాణ ఎంపీలు ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఆదిత్య ఎండీ అరెస్టుకు కన్స్యూమర్ ఫోరం ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఫ్లాట్ల కొనుగోలుదారులతో చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘించడంతోపాటు తమ ఆదేశాలను బేఖాతరు చేసినందుకు ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ రమేశ్ పగడాలకు రాష్ట్ర వినియోగదారుల ఫోరం షాక్ ఇచ్చింది. ఆయన్ను అరెస్టు చేసి తమ ముందు హాజరుపర్చాలని పోలీసులను ఆదేశిస్తూ నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఎం. శ్రీనివాస్ మరో ఇద్దరికి ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకపోగా, వారు చెల్లించిన అడ్వాన్స్‌ను ఆ సంస్థ రీఫండ్ చేయలేదు. వారి పిటిషన్లను విచారించిన రాష్ట్ర ఫోరం వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పును బేఖాతరు చేసిన సంస్థ ఎండీ రాజేశ్‌ను కమిషన్ ముందు హాజరుపర్చాలని ఫోరం అధ్యక్షుడు జైస్వాల్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

టెన్త్ హాస్టల్ విద్యార్థులకు 'స్పెషల్ డైట్'

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మార్చిలో పరీక్షలు ఉన్నందున పదో తరగతి విద్యార్థుల ఆరోగ్యం, బోధనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎస్సీ అభివృద్ధి శాఖ డైరెక్టర్ పి.కరుణాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల అధికారులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు స్పెషల్ డైట్ ఏర్పాటు చేయాలని, ట్యూటర్ల ద్వారా ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించాలన్నారు.

4, 5న ఉన్నత విద్యా సదస్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో తీసుకురావాల్సిన మార్పులపై చర్చించేందుకు ఈనెల 4, 5న సాంకేతిక విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా ఉన్నత విద్యా సదస్సును నిర్వహిస్తున్నాయి. వివరాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్-1 లింబాద్రి వెల్లడించారు.

వ్యవసాయ విద్య కోర్సుల్లో 20 నుంచి శిక్షణ

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నైపుణ్య శిక్షణ కింద అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ప్రొవైడర్ కోర్సుల్లో నిరుద్యోగులకు ఈనెల 20 నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ఇంటర్ లేదా అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లొమా పాసైన విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులు. శిక్షణ అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థల్లో ఉపాధి దొరుకుతుందని వర్సిటీ విస్తరణ విద్యా సంస్థ డైరెక్టర్ డాక్టర్ మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 15 లోగా పంపించాలని, వివరాలకు www.eeihyd.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎఫ్‌బీవో అభ్యర్థులకు 5న ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీలో భాగంగా రెండో విడత ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులకు 5న టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు సెక్రెటరీ వాణిప్రసాద్ వెల్లడించారు. వెరిఫికేషన్‌లో పాల్గొన్న అభ్యర్థులకు 6న నెహ్రూ జూలాజికల్ పార్కులో ఫిజికల్ టెస్టులు నిర్వహించనున్నారు.

అమెరికాకు భారత్ నిరసన

129 మంది విద్యార్థుల నిర్బంధమా?.. మోసం చేసింది అక్కడి నకిలీ వర్సిటీ

» విద్యార్థులను మోసగాళ్లుగా చూడొద్దు
» వారిని సత్వరం విడుదల చేయాలి
» డీమార్ష్‌లో కోరిన విదేశాంగ శాఖ
» వాషింగ్టన్‌లో భారత ఎంబసీలో 24 గంటల హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వీసా కుంభకోణంలో దాదాపు 129 మంది విద్యార్థులను అమెరికా ప్రభుత్వం నిర్బంధించడంపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దీనికి సంబంధించి అమెరికా దౌత్య కార్యాలయానికి తన నిరసనతో కూడిన విజ్ఞప్తిని (డీమార్ష్) శనివారం నాడు పంపింది. "పే అండ్ స్టే" స్కాంలో ఇరుక్కున్న వారిని రక్షించడమే తమకిపుడు అత్యధిక ప్రాధాన్యాంశమని విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం ప్రకటించింది. "నిర్బంధంలో ఉన్న విద్యార్థుల బాగోగులతోపాటు వారితో భారతీయ దౌత్యాధికారులు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరినట్లు" విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఆ నకిలీ యూనివర్సిటీ ఉన్నది అమెరికా గడ్డపైనే....దరఖాస్తు చేసి మోసపోయినవారు భారతీయ విద్యార్థులు. వారిని మోసం చేసినది రిక్రూటర్లు (చేర్పించినవారు). ఆ మోసగాళ్లతో సమానంగా విద్యార్థులను చూడరాదు. మోసానికి పాల్పడ్డ వారిని పరిగణించేట్లు వీరిపై చర్యలు తీసుకోరాదు. ఆ విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి. వారి అంగీకారం లేకుండా, వారి ఇష్టానికి వ్యతిరేకంగా వారిని బలవంతంగా స్వదేశానికి తిరిగి పంపించవద్దు" అని అమెరికన్ ప్రభుత్వాన్ని కోరినట్లు ఆ ప్రకటన వెల్లడించింది. విద్యార్థుల పరిస్థితిపై మేం నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. మా అధికారులు అక్కడ విద్యార్థులను సంప్రదించే పనిలో ఉన్నారు. ఇప్పటికే 30 ...



వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం



సాయం కోరారు. అమెరికాలో ఉన్న భారతీయ సంఘాలు కూడా లాయర్లను ఏర్పాటు చేస్తున్నాయి. వివరాలను, పరిస్థితులను ఎప్పటికప్పుడు భారత ప్రభుత్వంతో పంచుకోవాలి" అని అమెరికాకు చెప్పినట్లు విదేశాంగశాఖ తెలిపింది. నిర్బంధంలోని విద్యార్థుల సాధకబాధకాలేంటి, వారికి కావల్సినదేంటి, వారిపై ఉన్న కేసు తీవ్రత ఎంత.. ఇత్యాది వివరాలను భారత ఎంబసీ నిరంతరం చర్చిస్తోంది. డిటెన్షన్ కేంద్రాలను దౌత్యాధికారులు సందర్శిస్తున్నారు. న్యాయ సహకారం కోరిన వారికి కాన్సులేట్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, ఈ సహకారం అందించడానికి అక్కడి భారతీయులను సమీకరిస్తున్నామని కూడా విదేశాంగ శాఖ వివరించింది. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా మిగిలిన వ్యవహారాలను పక్కనపెట్టి దీన్నొక్కటే చేపట్టాలని ఎంబసీని ఆదేశించామని, సమస్యను పరిష్కరించడానికి అమెరికా అధికార వర్గాలు, ఇతర భాగస్వామ్యులతో కలిసి పని చేస్తామని తెలిపింది.

హెల్ప్‌లైన్ ఏర్పాటు

నిర్బంధంలోని విద్యార్థులకు సంబంధించిన వివరాలు, సందేహాల కోసం వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయంలో 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వివరాల కోసం ఈ కింది నెంబర్లు, ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని సూచించింది.

టెలిఫోన్ నెంబర్లు

+1-202-322-1190, +1-202-340-2590

ఈ - మెయిల్: cons3.washington@mea.gov.in (సీఓఎన్ఎస్3.వాషింగ్టన్@ఎంఈఏ.గవ్.ఇన్)

కర్కశ అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

నిర్దిష్ట పరిధిలోనే సంచరించాలని, అది దాటి వెళ్లరాదని ఆంక్ష పెట్టింది. ట్రాకర్లను నిరంతరం చార్జింగ్ చేసుకోవాలని, తామెప్పుడు కాంటాక్ట్ చేసినా వెంటనే బదులివ్వాలని స్పష్టం చేసింది. రేడియో ట్యాగింగ్ ద్వారా వారెక్కడున్నదీ నమోదు చేస్తోంది. వారి మొబైల్ నంబర్లనూ నిరంతరం ట్యాపింగ్ చేస్తున్నట్లు సమాచారం. వారిపై కేసు తేలేదాకా ఫెడరల్ పోలీసుల నిఘా కొనసాగించాలని నిశ్చయించింది. కొంతమంది విద్యార్థులిచ్చిన సమాచారమిది. అయితే భారత దౌత్య అధికారులు దీన్ని ఇంకా ధ్రువీకరించలేదు. అమెరికన్ అధికారులు 2011లో ట్రైవ్యాలీ నకిలీ వర్సిటీ ఉదంతంలో చిక్కుకున్న భారతీయ విద్యార్థుల పట్ల కూడా ఇదే తీరున వ్యవహరించడంతో ఆనాడు తీవ్ర విమర్శలు రేగాయి. ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను సమూలంగా మార్చాలన్న కృతనిశ్చయంతో ఉన్న ట్రంప్ ప్రభుత్వం ప్రస్తుత వీసా కుంభకోణంలో దొరికిపోయిన వారి పట్ల కఠినంగానే వ్యవహరించాలన్న అభిప్రాయంతో ఉన్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఐదు డిటెన్షన్ సెంటర్లలో ఎక్కువమంది భారత విద్యార్థులను పెట్టారు. షికాగో, డెట్రాయిట్, న్యూజెర్సీ, న్యూయార్క్, డాలస్. వీరందరినీ సంప్రదించడానికి ప్రైవేటు లాయర్లను అనుమతించడం లేదు. భారత రాయబార కార్యాలయ ఉద్యోగి ఉంటేనే వారితో పాటు ఒక లాయర్‌ను అనుమతిన్నారని ప్రవాస తెలుగువారి సంఘం (ఏపీఎన్ఆర్‌టీఏ) మీడియా కోఆర్డినేటర్ సాగర్ దొడ్డపనేని చెప్పారు. "డాలస్‌లోని నిర్బంధకేంద్రంలో ఉన్న 11 మందిని కలిశాం. వారందరిలో ఒకటే భయం. ఏమీ చెప్పలేకపోతున్నారు. మాకు వారి తలిదండ్రుల నుంచి, బంధువుల నుంచి వందల సంఖ్యలో కాల్స్ వస్తున్నాయి. మేం సకల ప్రయత్నాలూ చేస్తున్నప్పటికీ భారత ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరిగితేనే సమస్య వెంటనే పరిష్కారం కాగలదు" అని సాగర్ వివరించారు. పూర్తిగా స్టేటస్ కోల్పోయి- చట్టవిరుద్ధంగా ఉన్న విద్యార్థులకు ఏమీ చేయలేమని, వారిని వెనక్కి పంపేస్తారని సాగర్ చెప్పారు. 'ఫార్మింగ్‌టన్ వీసా ఆపరేషన్‌లో అన్యాయంగా ఇరుక్కున్న విద్యార్థులు తప్పనిసరిగా భారత్ వెళ్లాల్సిన అవసరం లేకుండా వారికి ఇంటర్నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉండడానికి ఏర్పాటు చేస్తున్నామని, దీన్ని వినియోగించుకోవచ్చని వివరించారు. వారంతపు సెలవుల వల్ల చాలా మంది అధికారులు అందుబాటులో ఉండ... బహుశా బుధవారాల నాటికి సమస్య పరిష్కారం కావొచ్చని వివరించారు. కాగా, విద్యార్థులను సత్వరం విడుదల చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖలో ఎస్‌సీపీ విభాగం బ్యూరోలో సీనియర్ అధికారి డేవిడ్ రాంజ్ కూడా ధ్రువీకరించారు. "తీవ్రమైన అభియోగాలుంటే తప్ప మిగిలిన ప్రతీ విద్యార్థినీ ఎక్కువకాలం నిర్బంధంలో ఉంచం. వారిని ఒక తేదీ ఇచ్చి ఆరోజున ఇమిగ్రేషన్ జడ్జి ముందు హాజరుకావాలని చెబుతాం. వారు వచ్చి తమ పరిస్థితి వివరించాలి. జడ్జి నిర్ణయాన్ని బట్టి వారిక్కడ ఉండడమా.. భారత్‌కు వెళ్లడమా అన్నది ఆధారపడుతుంది. ప్రతీరోజూ కస్టడీలో ఉన్నవారి వివరాలను వెల్లడిస్తాం. సమస్య త్వరగా పరిష్కరించాలన్నదే మా అభిమతం" అని రాంజ్ వివరించారు.

3,00,000 కోట్లు

» అమెరికా ఆర్థిక వ్యవస్థలో విదేశీ విద్యార్థుల వాటా
» చైనీయుల తర్వాత మనోళ్లే ఎక్కువ

(ఎడ్యుకేషన్ డెస్క్, స్పెషల్ డెస్క్)

అమెరికాలో చదువుకుంటున్న అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య తొలిసారి 10 లక్షలు దాటింది. వారి వల్ల ఆదేశానికి 2017-18 ఆర్థిక సంవత్సరంలో 42.4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3లక్షల కోట్లు) ఆదాయం సమకూరింది. 2017-18లో 10,94,792 మంది విదేశీయులువిద్యనభ్యసించారు. 2018 నవంబర్‌లో వెలువడిన 'ఓపెన్ డోర్స్' నివేదిక ప్రకారం.. అమెరికాలో చదివే విద్యార్థుల్లో.. చైనా, భారత్, దక్షిణ కొరియావారు తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

దేశాలు	విద్యార్థుల సంఖ్య
చైనా	3,63,341 (33%)
ఇండియా	1,96,271 (17.3%)
దక్షిణ కొరియా	54,555 (5%)

..తర్వాతి స్థానాల్లో వరుసగా కెనడా (3%), మెక్సికో (2%), జపాన్ (2%), తైవాన్ (2%), వియత్నాం (2%), బ్రెజిల్ (1%) ఉన్నాయి. మొత్తం మీద చూస్తే అమెరికాలో చదువుకునే అంతర్జాతీయ విద్యార్థుల్లో 50 శాతానికి పైగా.. భారత్, చైనా దేశాలకు చెందినవారే! ఓపెన్‌డోర్స్ నివేదిక ప్రకారం.. అమెరికాలో చదువుకుంటున్న భారతీయుల సంఖ్య గత పదేళ్లలో రెట్టింపు అయ్యింది.

ఫాల్తూ వర్సిటీపై బాలీవుడ్ సినిమా

అమెరికా కలలపై హాస్య చిత్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: హాలీవుడ్‌లో 2006లో వచ్చిన 'యాక్సెప్టెడ్' సినిమా ఆధారంగా 2011లో బాలీవుడ్‌లో 'ఫాల్తు' పేరుతో ఒక సినిమా వచ్చింది. ఇంటర్ చదివే నలుగురు విద్యార్థుల్లో ఒకరికి మంచి మార్కులు రావడంతో టాప్ యూనివర్సిటీలో సీటు లభిస్తుంది. దీంతో తక్కువ మార్కులు వచ్చిన మిగిలిన ముగ్గురూ.. తల్లిదండ్రుల ఒత్తిడిని తప్పించుకోవడానికి తామే 'ఫాల్తు' అనే ఒక నకిలీ వర్సిటీని సృష్టించి అందులో అడ్మిషన్ వచ్చినట్లుగా లెటర్లు సృష్టించుకుంటారు. అయితే పత్రికల్లో ఆ యూనివర్సిటీ ప్రకటన చూసి ఇతర విద్యార్థులూ అందులో అడ్మిషన్ తీసుకుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో వీరు తమ యూనివర్సిటీనీ నడిపించాల్సి వస్తుంది. దాంతో ఏ అనుమతుల్లేకుండా వర్సిటీని నడుపుతున్నారంటూ నిర్వాహకులతో పాటు విద్యార్థులపైనా ప్రభుత్వం కేసు పెడుతుంది. కొన్ని నాటకీయ పరిణామాల తర్వాత ప్రభుత్వం వీరి ప్రమాణాలను పరీక్షించగా, అన్ని అనుమతులున్న విద్యార్థుల కంటే 'ఫాల్తు' యూనివర్సిటీ విద్యార్థులు మంచి ప్రతిభ చూపడంతో వీరికి అధికారిక సర్టిఫికెట్లు ప్రదానం చేస్తుంది.



ఆస్తి గొడవే చంపేసింది

పోలీసుల అదుపులో శిఖా చౌదరి.. ఆమె పేరిట కొన్ని ఆస్తులు రాసిన జయరామ్

విజయవాడ, నందిగామ రూరల్, హైదరాబాద్/బంజారాహిల్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పారిశ్రామికవేత్తల్లో ఒకరైన చిగురుపాటి జయరామ్ హత్య కేసులో పోలీసులు కీలక చిక్కుముడి వీడుతోంది. హత్యకు సూత్రధారి, పాత్రధారి ఆయన మేనకోడలు శిఖా చౌదరి అని నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. కాల్‌డేటాను విశ్లేషించిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శిఖాతోపాటు ఆమె సోదరి మనీషా, శిఖా బాయ్‌ఫ్రెండ్ రాకేశ్ చౌదరి స్నేహితుడు శ్రీకాంత్ రెడ్డిని కూడా విచారిస్తున్నారని తెలుస్తోంది. మొత్తం పది బృందాలు ఈ కేసులోని చిక్కుముడులను ఛేదించే పనిలో ఉన్నారు.



జయరామ్ (ఫైల్)



రాకేశ్

కొన్ని ఆస్తులు ఆమె పేరిటే

రూ.2000 కోట్ల వ్యాపార సామ్రాజ్యానికి అధినేత అయిన జయరామ్ తన ఆస్తుల్లో కొన్నిటిని శిఖా చౌదరి పేరిటే ఉంచాడు. కానీ, వాటి డాక్యుమెంట్లను మాత్రం తన వద్దనే ఉంచుకున్నాడు. వీటి గురించి కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవి. వ్యాపార విషయాల్లో శిఖా చౌదరి జోక్యం పెరగడంతో జయరామ్ భార్య పద్మజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని వాచ్‌మన్ వెంకటేశ్ తెలిపాడు. ఇక, హత్య జరిగిన మరుసటి రోజు అంటే, 31వ తేదీ ఉదయం 7 గంటల ప్రాంతంలో శిఖా చౌదరి జూబ్లీహిల్స్‌లోని జయరాం ఇంటికి వచ్చి హల్‌చల్ చేసినట్టు వాచ్‌మన్ వెంకటేశ్ చెబుతున్నాడు. జయరామ్ గది, బీరువా తాళాలు ఇవ్వాలని వెంకటేశ్‌తో వాదులాటకు దిగింది. తాను ఇవ్వనని అతను చెప్పడంతో పెద్ద పెద్ద కేకలు వేసింది. శిఖాతోపాటు ఆమె స్నేహితుడు రాకేశ్ కూడా వచ్చినట్టు వెంకటేశ్ తెలిపాడు. వెంకటేశ్ కథనం ఆధారంగా పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. గచ్చిబౌలిలోని శిఖా ఇంట్లో తనిఖీలు చేపట్టారు.

విష ప్రయోగమేనా!?

జయరామ్‌కు బయట మద్యం తాగే అలవాటు లేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. కానీ, ఆయన తలపై బీరు బాటిల్‌తో కొట్టినట్టు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. దాంతో, జయరామ్ తలపై హైదరాబాద్‌లోనే దాడి జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తాము చెప్పినట్లు చేయకపోవడం వల్లే బీరు బాటిల్‌తో తలపై కొట్టినట్టు అనుమానిస్తున్నారు. శిఖా ఇంట్లో గానీ, హైదరాబాద్‌లో మరో చోట గానీ బీరులో విషం కలిపి జయరామ్‌తో తాగించి, చంపేశారని అనుమానిస్తున్నారు. అందుకే, ఆయన నోరు, ముక్కు నుంచి రక్తస్రావం జరిగిందని చెబుతున్నారు. అనంతరం బీరు సీసాతో తలపై కొట్టి, ఊపిరాడకుండా చేసి చంపేశారని అనుమానిస్తున్నారు. ఈ విషయంలో నందిగామ వైద్యులు ఇచ్చే పోస్టుమార్టం నివేదిక కీలకంగా మారనుంది.

హత్య చేసింది ఎక్కడ!?

జయరామ్ మృతదేహం కృష్ణా జిల్లాలోని కంచికచర్ల ఠాణా పరిధిలో లభించినా.. హత్య మాత్రం హైదరాబాద్‌లోనే జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం జరగడానికి 24 గంటల ముందే జయరామ్ హత్య జరిగిందని ఫోరెన్సిక్ వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, జనవరి 30న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చిన జయరామ్ మృతదేహం 31వ తేదీ రాత్రి 11 గంటలకు నందిగామ సమీపంలోని ఐతవరంలో కనిపించింది. ఈ మధ్య కాలంలో ఆయన సెల్‌ఫోన్ సిగ్నల్స్ జూబ్లీహిల్స్ దసపల్లా హోటల్‌తోపాటు గచ్చిబౌలిలోని శిఖా చౌదరి ఇంటి వద్ద ఉన్నట్లు చూపించాయి. సుమారు 10 గంటలపాటు హోటల్ వద్దనే జయరామ్ కదలికలు ఉన్నాయని నిర్ధారణ అయింది. దాంతో, అక్కడికి వెళ్లి పోలీసులు విచారణ జరిపారు. హోటల్‌లో సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. అక్కడ జయరామ్ ఓ చానల్ యాంకర్‌తో ఉన్నట్లు తేలింది. జనవరి 28న ఆమె పేరిటే రూమ్ బుక్ చేసుకున్నట్టు తెలిసింది. ఆమెతో కలిసి లాబీలో గంటకుపైగా మాట్లాడినట్టు సమాచారం. అదే సమయంలో, జనవరి 30వ తేదీ రాత్రి ఏడు గంటల ప్రాంతంలో జయరామ్ గచ్చిబౌలిలో ఉన్న శిఖా చౌదరి ఇంటికి వెళ్లారు. ఆయన కారు వచ్చినట్లు అక్కడి రిజిస్టర్‌లో నమోదై ఉంది. తర్వాత కాసేపటికే ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి తెల్లవారుజామున మూడు, నాలుగు గంటలకు వచ్చింది. ఈ సమయంలో జయరామ్ ఎక్కడ ఉన్నారని పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, హోటల్‌లో ఉన్న మహిళ యాంకర్ కాదని, ఎక్స్‌ప్రెస్ టీవీలో లోగడ యాంకర్‌గా పనిచేసి.. ఇప్పుడు జయరామ్‌కు పీఏగా వ్యవహరిస్తోందని మరికొందరు చెబుతున్నారు. ఆమె మాట్లాడుతుండగానే ఆయన మరో వ్యక్తికి ఫోన్ చేసి రూ.6 లక్షలు తెప్పించుకున్నారని తెలిసింది. హోటల్ నుంచి హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు.

రాకేశ్ ఎక్కడ!?

శిఖా చౌదరికి రాకేశ్ అనే వ్యక్తితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారిద్దరి మధ్య రూ.4 కోట్లమేర లావాదేవీలు నడిచినట్టు తెలుస్తోంది. దాంతో, శిఖా, ఆమె సన్నిహితుడు రాకేశ్ కలిసి ఆమె ఇంట్లోనే జయరామ్‌ను హతమార్చారా అన్న అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. తర్వాత కారులో మృతదేహాన్ని తీసుకొచ్చి ఐతవరం వద్ద వదిలేసి రాకేశ్ వెళ్లిపోయాడని అనుమానిస్తున్నారు. అతడి ఆచూకీ లేకపోవడం దీనికి బలం చేకూర్చుతోంది. ఇక, జయరామ్ హత్య కేసు విచారణలో సీసీ కెమెరాలే కీలకంగా మారాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు మధ్య మూడు టోల్‌గేట్ల వద్ద సీసీ కెమెరా పుటేజీలను పోలీసులు సేకరించారు. జయరామ్ ప్రయాణించిన కారులో తెల్ల షర్ట్ వేసుకున్న వ్యక్తితోపాటు ఓ యువతి ఉన్నట్టు వాటిలో నిర్ధారణ అయింది. కారు నడుపుతున్న తెల్ల చొక్కా ధరించిన వ్యక్తి రాకేశేనా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. జయరామ్ హత్య కేసులో విజయవాడకు చెందిన ముగ్గురు రౌడీల సహాయం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వీరు వారం రోజుల క్రితమే నగరానికి వచ్చినట్టు దర్యాప్తులో తేలింది. ఓ ఇంట్లో బస చేసినట్టు తెలుస్తోంది.

బసవ తారకంలో జయరామ్ మృతదేహం

హత్యకు గురైన జయరామ్ మృతదేహాన్ని బంజారాహిల్స్‌లోని ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. కృష్ణా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టం పూర్తి చేసి, అదే రోజు అర్ధరాత్రి మృత దేహాన్ని నగరానికి తీసుకొచ్చారు. ఆయన భార్య పిల్లలు అమెరికాలో ఉండడటంతో కేన్సర్ ఆసుపత్రిలో భద్రపరిచారు. జయరామ్ భార్య పద్మజ, పిల్లలు ఫ్లోరిడా నుంచి హైదరాబాద్‌కు శనివారం అర్ధరాత్రి చేరుకున్నారు.

ఆ 6 లక్షలూ ఏమయ్యాయి!?

హోటల్ దసపల్లాలో ఉన్నప్పుడే జయరామ్ తన స్నేహితుడి నుంచి ఆరు లక్షలు తెప్పించుకున్నారు. వాటిని ఎందుకు తెప్పించుకున్నారు? ఎవరికి ఇచ్చారనే కోణంలో పోలీసుల దర్యాప్తు సాగుతోంది. ఐతవరం వద్ద పోలీసులు గుర్తించిన కారులో బీరు సీసాలు, పలు డాక్యుమెంట్లు ఉన్నాయి. కానీ, నగదు మాత్రం లేదు. దాంతో, ఆ డబ్బు ఏమైందన్న విషయం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

చందా దందా

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం ఏర్పాటు చేశారు. ఒక్కో షేర్ ముఖ విలువను రూ.10గా నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో సీపీఎంకు అనుబంధంగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ, బీమా, మునిసిపల్ తదితర కార్మిక సంఘాలకు ఈ వాటాలను విక్రయించారు. ఉద్యోగి స్థాయిని బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలు పెట్టుబడిగా పెట్టించారు. ఇష్టమున్నా, లేకపోయినా చాలామంది తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగులు, కార్మికులు తమ వాటా సొమ్ము చెల్లించారు. మొత్తానికి సీపీఎం నాయకులు చానల్ ఏర్పాటుకు రూ.70 కోట్లు సమీకరించారు. మొత్తం కంపెనీలో యూటీఎఫ్‌కు 26.86 శాతం, సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఉద్యోగుల సమాఖ్యకు 17.02 శాతం, జన విజ్ఞాన వేదికకు 9.76 శాతం, పట్టణ పౌర సంఘాల సమాఖ్యకు 8.38 శాతం వాటా ఉంది.

చేతులు మారింది...

కార్మికులు, ఉద్యోగుల వాటా మొత్తానికి మూడేళ్లు లాక్ ఇన్ పీరియడ్‌గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయోజనాలు అందిస్తామని షేర్ హోల్డర్లకు హామీ ఇచ్చారు. కానీ... ఇప్పుడు ఏకంగా ఆ చానల్‌నే మరొకరికి విక్రయించారు. 10 టీవీని ప్రారంభించిన అభ్యుదయ బ్రాడ్ కాస్టింగ్ సంస్థను తొలుత 'స్ఫూర్తి కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే మరో కంపెనీకి విక్రయించేశారు. రికార్డుల ప్రకారం... స్ఫూర్తి సంస్థలో 80 శాతం వాటాలు ప్రజాశక్తి సాహితీ సంస్థకు ఉన్నాయి. ప్రజాశక్తి సాహితీ సంస్థ ట్రస్టుగా నమోదైంది. 10 టీవీ చేతులు మారడం ఇంతటితో ఆగలేదు. చానల్‌ను స్ఫూర్తి కమ్యూనికేషన్స్ గత ఏడాది మరో కంపెనీకి అమ్మేసింది. గత ఏడాది జూన్ నుంచి వెంకట కృష్ణ చైతన్య అనే వ్యక్తిని కొత్త డైరెక్టర్‌గా నియమించారు. ఈ లావాదేవీలు, పరిణామాల గురించి వాటాదారులెవరికీ కనీస సమాచారం లేదు. ఉద్యోగులు, కార్మికుల కష్టార్జితాన్ని 'వాటా'లుగా మార్చుకున్న సీపీఎం రాష్ట్ర నాయకులు చివరికి నమ్మకద్రోహానికి పాల్పడ్డారంటూ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు ఫిర్యాదు అందింది. "మూడేళ్ల లాక్ ఇన్ పీరియడ్ అయిపోయిన తర్వాత కూడా కంపెనీ నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. ఈ సంస్థ ఏ కార్యకలాపాలు నిర్వహించిందో, దాని ఆర్థిక పరిస్థితి ఏమిటో, ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో కూడా తెలియదు. సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఒక్కసారి కూడా అధికారికంగా సమాచారం పంపలేదు" అని వాటాదారులు కంపెనీల రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. వసూలు చేసిన రూ.70 కోట్లలో 35 కోట్లను వాటాదారులకు కనీస సమాచారం ఇవ్వకుండా రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడిగా పెట్టినట్లు ఆరోపించారు. కోట్లాది రూపాయల వ్యవహారాలను వాటాదారులకు తెలియకుండా జరపడం, రియల్ ఎస్టేట్‌కు మళ్లించడం నేరమని తెలిపారు. "షేర్ హోల్డర్లను మోసం చేశారు. నమ్మక ద్రోహానికి పాల్పడ్డారు. ఉద్దేశపూర్వకంగానే సమాచారాన్ని దాచిపెట్టారు. వాటాల ద్వారా సేకరించిన సొమ్మును దారి మళ్లించారు. సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా కంపెనీల చట్టాన్ని ఉల్లంఘించారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి" అని వాటాదారులైన వై.వేణుగోపాలరెడ్డి, చామల సాంబిరెడ్డి ఫిర్యాదులో కోరారు.

ఇదేం 'అభ్యుదయం'?

ప్రస్తుతం టెన్ టీవీ వ్యవహారం వామపక్ష వాదుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. "ఉద్యమ సమాచార వ్యాప్తి కోసం చానల్ పెట్టాలనుకోవడం వరకు సరే! దానికి కార్మికులు, ఉద్యోగుల నుంచి సొమ్ము వసూలు చేయడం... ఆ డబ్బును రియల్ ఎస్టేట్‌కు మళ్లించడం... చివరికి వాటాదారులకు తెలియకుండానే చానల్‌ను మరొకరికి విక్రయించడం దారుణం! ఇది వామపక్ష భావజాలానికే విరుద్ధం! ఇదంతా రాష్ట్ర నాయకత్వం అనుమతితోనే జరిగిందా?" అని ప్రశ్నిస్తున్నారు. పార్టీ రాష్ట్ర మహాసభల్లో కొందరు ప్రతినిధులు దీని గురించి ప్రస్తావించినప్పుడు... సమాధానం దాటవేశారని చెబుతున్నారు. టెన్ టీవీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఒక్కసారి కూడా వార్షిక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయలేదని వాటాదారులు తెలిపారు. ఈ విషయాలన్నీ ఢిల్లీలోని పార్టీ పెద్దల దృష్టికి కూడా తీసుకొచ్చినట్లు సమాచారం. "ఇది అగ్రిగోల్డ్, సహారా, శారదా చిట్‌ఫండ్ స్థాయి కుంభకోణం! రెండు రాష్ట్రాల్లో రెండు లక్షల కుటుంబాలకు సంబంధించిన సమస్య" అని వారంటున్నారు. అయితే... పార్టీలో ఉంటూ, పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవడానికి కేంద్ర నాయకత్వం కూడా భయపడుతోందని వాపోతున్నారు. టెన్ టీవీ పేరిట జరిగిన ఆర్థిక అరాచకాలపై పార్టీ సంస్థల ద్వారా విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే సీపీఎం పొలిట్ బ్యూరో సమావేశంలో, తర్వాత జరిగే కేంద్ర కమిటీ సమావేశాల్లో ఈ విషయంపై చర్చ, రచ్చ జరిగే అవకాశముంది.

వెనక్కి ఇస్తారట!

10 టీవీ చేతులు మారి ఆరేడు నెలలు గడిచింది. కట్టిన డబ్బులు అసలు మాత్రమే వెనక్కి ఇస్తామంటూ రెండు నెలల కిందట వాటాదారులకు సమాచారం అందింది. పెట్టుబడులు తిరిగివ్వడం ముఖ్యమైన విషయం కాదని, ఏ నమ్మకంతో పెట్టుబడులు పెట్టారో ఆ నమ్మకాన్ని వమ్ము చేయడం తీవ్రమైన విషయమని సీపీఎం నేతలు అంటున్నారు. "పార్టీ రాష్ట్ర నాయకత్వపు ఆర్థిక అరాచకత్వం వల్ల దిగువ కేడర్‌కు జనం దగ్గర మొహం చాటేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోసారి పార్టీ పేరు చెప్పి ఆర్థిక సహాయం అడిగే నైతిక అర్హత కోల్పోయినట్లయింది. కమ్యూనిస్టు పార్టీకి ఇంతకంటే ఘోరమైన పరాభవం ఏముంటుంది!" అని వాపోతున్నారు.


ఎన్నో అవకతవకలు...

ఆరేళ్ల క్రితం 10 టీవీ ఏర్పాటైనప్పటి నుంచి భారీ ఎత్తున నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. స్టూడియోల నిర్మాణం, పరికరాలు, వాహనాల కొనుగోలు విషయంలో పారదర్శకత పాటించలేదని ఫిర్యాదులు వచ్చాయి. "సర్వసభ్య సమావేశం జరపకుండానే జరిపినట్లుగా కాగితాల్లో రాసుకున్నారు. అవసరమైన దానికంటే రెండు రెట్ల పెట్టుబడి సేకరించినప్పటికీ నష్టాలు వచ్చాయంటున్నారు. ఈ నష్టాలు ఎప్పటి నుంచి మొదలయ్యాయి? ఆరేళ్లలో ఈ నష్టాలకుగల కారణాలను విశ్లేషించారా?" అని వాటాదారులు ప్రశ్నిస్తున్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులకు పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. జీఏడీ ఆమోదం పొందగానే పండిట్ల ఫైలు, ఎస్జీటీలు, ఎస్ఏల పదోన్నతుల ఫైలు సోమవారం లేదా మంగళవారం సీఎంకు చేరే అవకాశం ఉంది. ఆయన సంతకం చేయగానే మంగళ లేదా బుధవారాల్లో పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. పండిట్లకు పదోన్నతులు కల్పిస్తామని సీఎం కేసీఆర్ తెలుగు మహాసభల సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని పరిశీలించే బాధ్యతను ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్‌లకు అప్పగించారు. దీంతో ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టిన వీరు.. పలుమార్లు సీఎంతో చర్చించారు. పదోన్నతుల ఫైలుకు ఆర్థిక శాఖ ఆమోద ముద్ర వేయించారు. పండిట్, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులపై శనివారం దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కసరత్తు చేశారు. పదోన్నతుల ఫైలును సీఎం కేసీఆర్‌కు సమర్పించనున్నారు. పండిట్లు, ఎస్జీటీ, ఎస్ఏలకు పదోన్నతులు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని సుమారు 15 వేల మందికి లబ్ధి చేకూరనుంది. పండిట్ల పదోన్నతులకు సంబంధించి గతంలో 2487 పోస్టులను ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసింది. తాజాగా మరో 6024 పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. దీని వల్ల ఇన్నాళ్లు గ్రేడ్-2 టీచర్లుగా కొనసాగిన 8511 మంది పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించనుంది. పీఈటీలకు సంబంధించి గతంలో 1047 పోస్టులను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసింది. తాజాగా మరో 786 పోస్టులతో మొత్తం 1833 పోస్టులను అప్‌గ్రేడ్ చేసినట్లైంది. పంచాయతీరాజ్, ప్రభుత్వ టీచర్లకు మేనేజ్‌మెంట్ల వారీగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్ రూల్స్ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ప్రస్తుతం పదోన్నతుల్లో ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టుల పదోన్నతులను మినహాయించాలని నిర్ణయించింది. కేవలం ప్రధానోపాధ్యాయుల వరకే పదోన్నతులను కల్పించాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 3వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 800 వరకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 4వేల మంది ఎస్జీటీలకు, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి లభించనుంది. పదోన్నతులు కల్పించడంపై పండిట్ అసోసియేషన్ నేతలు అబ్దుల్లా, జగదీశ్, పీఈటీ సంఘ అధ్యక్షుడు విజయసాగర్ హర్షం వ్యక్తం చేశారు.



ప్రొ వాలీబాల్ లీగ్‌కు బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు అదనపు ఆకర్షణ. ఈ తెలుగమ్మాయి లీగ్‌కు ప్రచారకర్త. సింధు తండ్రి పీవీ రమణ అంతర్జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు. దీంతో స్వతహాగా వాలీబాల్‌పై మక్కువ ఉన్న సింధు.. ఈ క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పించడంలో భాగంగా లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేందుకు అంగీకరించింది.



వాలీబాల్..యువకుల కేరాఫ్

పెద్దగా ఖర్చులేని క్రీడ. కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ తర్వాత దేశ గ్రామీణాల్లో ఎక్కువగా ఆడే ఆట. వేసవి సెలవుల్లో యువకులంతా సాయం సమయాల్లో వాలీబాల్ ఆడుతుండడం మన పల్లెల్లో కనిపించేదే. ఏడు దశాబ్దాల కిందట దేశంలో అడుగుపెట్టిన ఈ క్రీడలో భారత్ ఒక్కో అడుగు వేస్తూ ప్రపంచంలో మేటిగా ఎదిగింది. ఈ ఆట కొత్త పుంతలు తొక్కుతూ ప్రస్తుతం కార్పొరేట్ హంగు సమకూర్చుకొనే దిశగా పయనిస్తోంది. అందులో భాగమే ప్రొ.వాలీబాల్ లీగ్ ఆవిర్భావం. ప్రొ.వాలీబాల్‌తో దేశంలో ఈ క్రీడకు మరింత ఆదరణ పెరిగి ప్రతిభ కలిగిన ఎందరో ఆటగాళ్లు వెలుగులోకి వస్తారని ఆశిద్దాం..

మైదాన్

MYDAN

నిజామాబాద్ • ఆదివారం 3 ఫిబ్రవరి 2019

సర్వ్.. బ్లాక్.. స్మాష్

బంతి-బరువు

సింథటిక్ లేదా తోలుతో తయారయ్యే బంతి చుట్టుకొలత 65 నుంచి 67 సెం.మీ. ఉంటుంది. 320 గ్రా. నుంచి 325 నుంచి గ్రా. బరువు ఉంటుంది.

కోర్టు..ఆట

వాలీబాల్ కోర్టు పొడవు 18 మీటర్లు, వెడల్పు 9 మీటర్లు ఉంటుంది. దీనిని రెండు సగ భాగా(9-9మీ.) లుగావిభజిస్తారు. భూమినుంచి 2.43 మీటర్ల ఎత్తులో నెట్ ఉంటుంది. నెట్ నుంచి మూడు మీటర్ల దూరంలో ఇరువైపులా కోర్టుల్లో అటాక్ లైన్ ఉంటుంది. దీనినే అటాక్‌జోన్ అంటారు. దీనివెనుక డిఫెన్స్ జోన్ ఉంటుంది. ఆరుగురు ఆటగాళ్లు మ్యాచ్ ఆడతారు. టాస్ ద్వారా తొలి సర్వీస్ చేసే జట్టును నిర్ణయిస్తారు. ప్రత్యర్థి జట్టునుంచి వచ్చిన బంతిని తిరిగి వారి కోర్టులోకి పంపడంలో విఫలమైతే..అవతలి జట్టుకు పాయింట్ లభిస్తుంది. ప్రత్యర్థి జట్టునుంచి వచ్చిన బంతిని ఆటగాళ్లు మూడుసార్లు మాత్రమే టచ్ చేస్తూ నెట్ ఆవలికి పంపాలి. అయితే ఒకే ఆటగాడు వరుసగా రెండుసార్లు బంతిని టచ్ చేయ కూడదు.

5 సెట్లూ ఆడాల్సిందే

ప్రొ వాలీబాల్ లీగ్‌లో మ్యాచ్‌కు ఐదు సెట్లుంటాయి. ఫలితంతో సంబంధం లేకుండా ఐదు సెట్లూ ఆడాల్సిందే. అలానే లీగ్ దశ మ్యాచ్‌లకు సెట్‌కు 15 పాయింట్లుగా నిర్ణయించారు.



ఇన్నాళ్లు గ్రామీణ క్రీడగానే ఉన్న వాలీబాల్‌కు ఈ ఏడాది కార్పొరేట్ హంగులు వచ్చాయి. ప్రొ వాలీబాల్ పుణ్యమాని రంజిత్ సింగ్, ప్రభాకరన్ వంటి ప్రతిభ గల ఆటగాళ్లను వేలంలో కొనుగోలు చేయడానికి ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. అలానే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నా వెలుగులోకి రాని తెలుగు రత్నాలు యశ్వంత్, ప్రశాంత్, భాగ్యరాజ్, నరేశ్ లీగ్‌లో మెరవడానికి సిద్ధమవుతున్నారు. 20 రోజులు పాటు వాలీబాల్ అభిమానులను ఉర్రూతలూగించనున్న ఈ లీగ్‌లో మొత్తం 72 మంది భారత ఆటగాళ్లు 12 మంది విదేశీ ప్లేయర్లు పాల్గొంటున్నారు. తొలి సీజన్‌లోనే టైటిల్ సొంతం చేసుకొని చరిత్ర సృష్టించాలని ఆరు జట్లు ఉవ్విళ్లూరుతున్నాయి.

హెడ్ కానిస్టేబుల్ కొడుకు..

తండ్రి సత్యనారాయణ హెడ్ కానిస్టేబుల్. వాలీబాల్ మాజీ క్రీడాకారుడు కూడా. అయితే కుటుంబ బాధ్యతల కారణంగా జాతీ య జట్టుకు ప్రాతినిథ్యం వహించాలన్న ఆశ తీరకుండానే ఆటకు దూరమయ్యాడు. వాలీబాల్‌లో తాను చేరలేకపోయిన ఉన్నత శిఖరాలను కొడుకు అధిరోహించాలని ఆ తండ్రి కలలు కన్నాడు. కొంచెం ఆలస్యమైనా ఆయన స్వప్నాన్ని నిజం చేశాడు పిన్నమరాజు ప్రశాంత్ (21). ఈ యువ కెరటం స్వస్థలం విశాఖపట్నం. జాతీయ అండర్-21 వాలీబాల్ జట్టులో కీలక ఆటగాడైన ప్రశాంత్..ఆంధ్ర వాలీబాల్ కెప్టెన్‌గా ఎంపికై అనతి కాలంలోనే ఉన్నత స్థానాలకు చేరుకున్నాడు. తాజాగా ప్రొ వాలీబాల్ లీగ్‌లోని బ్లాక్ హాక్స్ హైదరాబాద్ జట్టులో స్థానం కూడా సంపాదించాడు. చెన్నై, హరియాణా వేదికగా ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రను రెండో స్థానంలో నిలిపి తన సత్తా ఏంటో నిరూపించాడు. అండర్-16 వరకు విశాఖపట్నం కేంద్రంగా ఆడిన ప్రశాంత్ ఆ తర్వాత మెరుగైన శిక్షణ కోసం చెన్నై చేరుకున్నాడు. అక్కడ ప్రముఖ వాలీబాల్ కోచ్ దక్షిణామూర్తి శిక్షణలో రాటుదేలాడు. కెరీర్‌లో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్న ఈ సెట్టర్ ప్రస్తుతం జాతీయ జట్టులో స్థానం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాడు.

నంది యశ్వంత్ (28). భారత వాలీబాల్ జట్టు సభ్యుడు. గత ఆసియా క్రీడల వాలీబాల్ జట్టులో స్థానం సంపాదించిన ఈ తెలుగు తేజం స్వస్థలం మహబూబ్‌నగర్. యశ్వంత్ ప్రొ వాలీబాల్ లీగ్‌లో బ్లాక్ హాక్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. పదో తరగతి వరకు క్రికెట్ తప్ప మరో క్రీడంటే తెలియని యశ్వంత్ ఇంటర్మీడియెట్‌లో తొలిసారిగా వాలీబాల్ ఆడాడు. ఓ టోర్నీలో యశ్వంత్ ఆట చూసి ఆశ్చర్యపోయిన స్థానిక నెట్‌బాల్ కోచ్ షకీల్ అతణ్ణి మహబూబ్‌నగర్‌లోని రాష్ట్ర వాలీబాల్ అకాడమీలో చేర్చారు. అకాడమీలో జరిగిన పరీక్షల్లో యశ్వంత్ ఉత్తీర్ణుడవడంతో పాటు మంచి ఎత్తు, దేహదారుఢ్యం



క్రికెట్ టూ వాలీబాల్

ఉండడంతో అతడిపై చీఫ్ కోచ్ కోటేశ్వర రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. 2006లో జరిగిన అండర్-19 అంతర్ రాష్ట్ర టోర్నీలో అదరగొట్టి వెలుగులోకి వచ్చిన యశ్వంత్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 2009లో తల్లి రోజమ్మ హఠాన్మరణంతో కొంతకాలం ఆటకు దూ రంగా ఉన్నా తనని పెద్ద వాలీబాల్ క్రీడాకారుడిగా చూడాలన్న అమ్మ ఆకాంక్షను నెరవేర్చడానికి యశ్వంత్ పట్టుదలతో తిరిగి ఆటను ప్రారంభించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్‌గా 2010-2013 మధ్య జరిగిన అనేక టోర్నీల్లో రాష్ట్రానికి చాంపియన్‌షిప్ టైటిల్స్ అందించాడు. ప్రస్తుతం జాతీయ జట్టులో సుస్థిర స్థానం సంపాదించడానికి చెమటోడుస్తున్నాడీ సెట్టర్.

వాలీబాల్ వచ్చిందిలా..

వాలీబాల్ పుట్టిల్లు అమెరికా. విలియమ్ జి మోర్గాన్ అనే వ్యాయామ ఉపాధ్యాయుడు ఈ ఆటకు రూపకర్త. టెన్నిస్‌లోని కొన్ని అంశాలను కలిపి అతడు వాలీబాల్‌కు రూపకల్పన చేశాడు. తొలి ఎగ్జిబిషన్ వాలీబాల్ మ్యాచ్ 1896లో మసాచుసెట్స్‌లోని స్ప్రింగ్‌ఫీల్డ్ కాలేజ్‌లో జరిగింది. వాలీలతో ఆడడంతో ఈ ఆటకు వాలీబాల్ అని ఆ మ్యాచ్‌కు వచ్చిన పరిశీలకుడొకరు నామకరణం చేశాడు.

భారత్‌లో ఇలా..

దేశంలో వాలీబాల్ ఆట ఆవిర్భావం ఆసక్తికరంగా జరిగింది. 70 ఏళ్ల కిందట కొందరు విదేశీ వ్యాయామ ఉపాధ్యాయులు భారత్‌కు వచ్చినప్పుడు ఈ ఆటను మనకు పరిచయం చేశారు. 1951లో వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (వీఎఫ్‌ఐ) ఆవిర్భవించాక దేశంలో వాలీబాల్‌కు ప్రాచుర్యం లభించింది. 1955లో జపాన్‌లో జరిగిన ఇన్విటేషన్ మీట్‌లో భారత్ స్వర్ణ పతకం సాధించడం దేశ వాలీబాల్ చరిత్రలో మరపురాని రోజు. 1958 (టోక్యో), 1962 (జకర్తా) ఏషియన్ గేమ్స్‌లో భారత్ కాంస్య, రజత పతకాలు గెలుపొందడం దేశ వాలీబాల్‌ను ఉన్నత శిఖరాలకు చేర్చింది. ఇక ప్రొ.వాలీబాల్ లీగ్‌తో దేశంలో ఈ క్రీడకు మరింత ఆదరణ పెరుగుతుందని భావిస్తున్నారు.

తెలుగువారి మెరుపులు

ముళినీరెడ్డి, గోపాల్, రమణారావు, శ్యాం సుందర్‌రావు, పీవీ రమణ, అబ్దుల్ బాసిత్, వెంకట నారాయణ, రవికాంత్ రెడ్డి వంటి తెలుగు తేజాలు అంతర్జాతీయ వాలీబాల్‌లో మెరుపులు మెరిపించారు.

మిర్యాలగూడ చిన్నోడు



అమ్మ టైలర్..నాన్న ఎలక్ట్రీషియన్. మధ్య తరగతి కుటుంబం. కష్ట పడితే గానీ గడవని పరిస్థితి. ఇవన్నీ ఒకవైపు వెనక్కిలాగుతుంటే మరోవైపు పెద్ద వాలీబాల్ ప్లేయర్ కావాలనే తపన. ఈ డోలాయమానంలోనే 14 ఏళ్ల ప్రాయంలో అమరవడి భాగ్యరాజ్ (18) వాలీబాల్ బాట పట్టాడు. భాగ్యరాజ్ స్వస్థలం మిర్యాలగూడ. విద్యాభ్యాసం మహబూబ్‌నగర్‌లో జరిగింది. రాజ్ 203 సెం.మీ ఎత్తు ఉండడంతో జిల్లా జట్టులో సులభంగానే చోటు దక్కింది. బులెట్లలా దూసుకొచ్చే బంతులను అతడు అద్భుతంగా బ్లాక్ చేస్తుండడంతో అనతి కాలంలోనే అంతర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. కర్ణాటకలో జరిగిన ఓ టోర్నీలో చిచ్చరపిడుగులా చెలరేగిన భాగ్యరాజ్‌పై బెంగళూరు స్పోర్ట్స్ అకాడమీ దృష్టి పడింది. ఇక్కడ నుంచి భాగ్యరాజ్ దశ మారింది. జాతీయ యూత్ గేమ్స్‌లో తెలంగాణ తరఫున అదరగొట్టాడు. ఇలా జాతీయ అండర్-21 జట్టులో చోటు దక్కింది. దీంతో ప్రొ వాలీబాల్ లీగ్ వేలానికి అర్హత సాధించడమే కాక చెన్నై స్పార్టన్స్ జట్టులో ప్లేసే కొట్టేశాడు. ఇప్పుడు భారత జట్టులో చోటే తన లక్ష్యమంటున్నాడు.



చైన్నై జట్టులో నరేష్

అనంతపురం జిల్లాకు చెందిన నరేష్ చెన్నై స్పార్టన్స్ జట్టుకు రిజర్వ్ ఆటగాడిగా ఎంపికయ్యాడు. నరేష్ అవుట్ సైడ్ హిట్టర్. ప్రస్తుతం ఎక్సైజ్ పోలీస్ శాఖలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్నాడు. జాతీయ యూత్ జట్టు తరఫున ఆసియా చాంపియన్‌షిప్ పోటీల్లో నరేష్ పాల్గొన్నాడు.

ఇటు క్రికెటర్.. అటు పోలీస్

న్యూజిలాండ్ మహిళల జట్టులో 30 ఏళ్ల కేటీ పెర్కిన్స్ సీనియర్ బ్యాట్స్ వుమన్. అంతేకాదండోయ్.. ఆమె ఓ పోలీస్ ఆఫీసర్ కూడా. 2013లోనే రాయల్ న్యూజిలాండ్ పోలీస్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న పెర్కిన్స్.. ప్రస్తుతం ఆక్లాండ్ పోలీస్ విభాగంలో యూత్ ఎంగేజ్‌మెంట్ అధికారిగా వ్యవహరిస్తోంది. దీని కంటే ముందు ఆమె క్రికెట్ కెరీర్‌లో ఎదుర్కొన్న గడ్డు పరిస్థితి గురించి చెప్పుకోవాల్సి ఉంటుంది. ఒకవిధంగా అది ఆమెకు మంచే చేసిందేమో...



2012లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన పెర్కిన్స్ కెరీర్ ఏడాదిన్నర క్రితం ఒడిదుడుకులకు లోనైంది. అప్పట్లో ఆమె చేతి వేలికి గాయం కావడంతో శస్త్ర చికిత్స అవసరమైంది. దీన్నుంచి కోలుకుని మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాక టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి మరో షాక్ ఎదురైంది. గతేడాది ఫిబ్రవరిలో వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లోనూ ఆమెను ఎంపిక చేయలేదు. అంతేకాదు జూన్‌లో ఐర్లాండ్, ఇంగ్లండ్ టూర్‌కు వెళ్లిన జట్టుకు పెర్కిన్స్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో జాతీయ జట్టుకు ఇక ప్రాతినిధ్యం వహించలేనేమోనన్న అనుమానం మొదలైంది. కానీ సీన్ కట్ చేస్తే.. తాజాగా భారత మహిళల జట్టుతో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో ఆమెకు సెలెక్టర్లు చోటు కల్పించారు. దీంతో 14 నెలల తర్వాత ఆమె జట్టులోకి వచ్చినట్టయింది. అయితే ఈ మధ్యలో పెర్కిన్స్ తానేంటో నిరూపించుకుంది. దేశవాళీ మహిళల వన్డే చాంపియన్‌షిప్‌లో ఆక్లాండ్ తరఫున ఆరు మ్యాచ్‌ల్లో 176 పరుగులు సాధించింది.

శభాష్ పోలీస్: జట్టులో చోటు కోల్పోయిన వేళ పెర్కిన్స్ జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. ఈ సమయంలో ఆమె ఫుల్‌టైమ్ పోలీసాఫీసర్‌గా విధులు నిర్వర్తించి శభాష్ అనిపించుకుంది. ఉద్వాసన తర్వాత అసలు మళ్లీ కివీస్ జట్టులోకి రాగలనా? అనే ఆలోచనలు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసేవి. ముఖ్యంగా ఇంగ్లండ్ టూర్‌కు కూడా ఎంపిక చేయకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. ఎందుకు ఎంపిక చేయడం లేదో అర్థం కాక కొన్ని నెలలు ప్రాక్టీస్ కూడా మానేసింది. అయితే ఇదంతా జరగడానికి ముందే ఆక్లాండ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి యూత్ ఎంగేజ్‌మెంట్ అధికారి ఉద్యోగం కో సం ప్రకటన వెలువడింది. దరఖాస్తు చేయాలా? వద్దా? అనే సంశయంతోనే ముందుకు వెళ్లగా, ఆమె చదువు, కాస్త అనుభవం కారణంగా ఎంపికైంది. అయినా డ్యూటీలో చేరేందుకు జంకినా.. అదే సమయంలో జట్టు నుంచి ఉద్వాసనకు గురికావడంతో మరో ఆలోచన లేకుండా పూర్తి స్థాయిలో పోలీస్ ఆఫీసర్‌గా బాధ్యతలకు ఓకే చెప్పింది. గత ఎనిమిది నెలలు పెర్కిన్స్ ఈ ఉద్యోగంలో బిజీ బిజీగా గడిపింది. తక్కువ స్థాయి నేరాలు చేసే యువకులకు విధుల్లో భాగంగా కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మార్పునకు దోహదపడింది. వీరిలో ఎక్కువగా మైనర్లే ఉండేవారు. జీవితంలో వారిని సరైన దారిలో నడిచేలా చేయడం అంతులేని సంతృప్తినిచ్చే విషయంగా పెర్కిన్స్ చెబుతుంటుంది. అంతేకాదు.. పెర్కిన్స్, ఆమె సోదరి కలిసి ఉగాండా, ఇథియోపియాలోని ఒక్కో చిన్నారిని దత్తత తీసుకుని వారి చదువు, ఇతర సౌకర్యాలను చూస్తుండడం వారి మంచి మనసుకు నిదర్శనం.



పోలీస్ సహచరిణులతో పెర్కిన్స్ (మధ్య)

ప్రపంచ వాలీబాల్ మేటి అటాకర్స్‌లో ఒకడు. 2017 వాలీబాల్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ గోల్డ్ మెడలిస్ట్. అమెరికా వాలీబాల్ జట్టు తురుపుముక్క. స్మాష్‌ల రారాజు. ప్రొ వాలీబాల్ లీగ్‌లో బ్లాక్ హాక్స్ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న కార్సన్ క్లార్క్‌తో

ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ...

భారత్‌కి రావడం ఇదే తొలిసారి అనుకుంటా?

అవును. ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. భారత వాతావరణం, సంస్కృతి ఆచార, సంప్రదాయాలు చాలా చాలా బాగున్నాయి.

హైదరాబాద్ వచ్చి వారం రోజులవుతోంది కదా? ఏవైనా చారిత్రక కట్టడాలను సందర్శించారా?

జట్టు సభ్యులతో కలిసి గోల్కొండ, చార్మినార్‌ను చూశా. గోల్కొండ కోట నిర్మాణం చూసి ఫిదా అయిపోయా. కోటలో ఏర్పాటు చేసిన లేజర్ షో బాగా ఆకట్టుకొంది.

మాది యువరక్తం



కెప్టెన్ క్లార్క్

హైదరాబాదీ వంటకాలు ఎలా ఉన్నాయి?

మండి బిర్యానీ, గార్లిక్ చికెన్ చాలా బాగున్నాయి. నా ఫేవరెట్ ఫుడ్ మెనూలో వీటికి చోటు కల్పించా. వీటిని ఎలా తయారు చేస్తారో టీమ్‌మేట్ అమిత్‌ని అడిగి తెలుసుకున్నా. వీలైతే వండడానికి ప్రయత్నిస్తా.

వాలీబాల్ విషయానికి వస్తే..మీరు ఇదే కెరీర్‌గా ఎంచుకోవడానికి కారణాలేంటి?

మా అన్నయ్యలు ఇద్దరూ వాలీబాల్ ప్లేయర్లే. అయితే వారిద్దరు యూనివర్సిటీ దశలోనే ఆటకు గుడ్‌బై చెప్పేశారు. నేను మాత్రం ప్రొఫెషనల్ ఆటగాడిగా ఎదిగా.

ఈ లీగ్‌లో మీకు ఎవరు కఠినమైన ప్రత్యర్థి అనుకుంటున్నారు?

కాలికట్ హీరోస్‌లో పాల్ లాట్‌మన్, కొచ్చి జట్టులోని డేవిడ్ లీ చాలా అనుభవజ్ఞులు. ఈ రెండు జట్లలో ప్రతిభావంతులైన లోకల్ ప్లేయర్లు కూడా ఉన్నట్టు తెలిసింది.

మీ కెప్టెన్సీలోని హైదరాబాద్ జట్టు ట్రోఫీ నెగ్గే అవకాశాలు ఎంత వరకున్నాయి?

మా జట్టుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే మిగిలిన జట్లను తేలికగా తీసుకోవడం లేదు. మా జట్టు యువరక్తంతో ఉరకలేస్తోంది. నా సహచర ఆటగాళ్లు చాలా ప్రతిభావంతులు. సమన్వయంతో ఆడితే విజయం మాదే.

జట్టులోని సభ్యులంతా మీకు కొత్తవారే కదా వారితో ప్రయాణం ఎలా ఉంది?

హైదరాబాద్ వచ్చే వరకు వీరెవరితోనూ నాకు పరిచయం లేదు. కానీ జట్టుతో కలిశాక వీరందరితో మంచి స్నేహం ఏర్పడింది. జట్టులో నాకంటే చిన్నవాళ్లు ఎక్కువగా ఉండడంతో వారితో త్వరగా కలిసిపోవడానికి ఆస్కారం లభించింది.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
నిజామాబాద్ ● ఆదివారం 3 ఫిబ్రవరి 2019

ప్రొ వాలీబాల్‌లో నేడు
కాలికట్ హీరోస్ X చెన్నై స్పార్టన్స్
రాత్రి 7 గం. నుంచి
సోనీ సిక్స్, సోనీ టెన్-3లో...

వెస్టిండీస్ x ఇంగ్లండ్
రెండో టెస్ట్-నాలుగో రోజు
రా. 7.30 నుంచి
సోనీ టెన్-1లో...

ఆస్ట్రేలియా x శ్రీలంక
రెండో టెస్ట్-మూడో రోజు
ఉ. 5 గం. నుంచి
సోనీ సిక్స్‌లో...

దక్షిణాఫ్రికా x పాకిస్థాన్
రెండో టీ 20
సాయంత్రం 6 నుంచి
సోనీ- ఈఎస్‌పీఎన్‌లో...

విశాఖ మ్యాచ్‌తో.. ఆసీస్ టూర్ షురూ

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా తన భారత పర్యటనను విశాఖపట్నంలో జరిగే మొదటి టీ20తో ప్రారంభించనుంది. రెండు జట్ల మధ్య తొలి టీ20 ఈనెల24న విశాఖలో జరగనుంది. వాస్తవంగా మొదటి టీ20 24న బెంగళూరులో జరగాల్సి ఉంది. కానీ ఆరోజు అక్కడ నిర్వహించే ఎయిర్ షోకు ప్రధానమంత్రి మోదీ హాజరవుతున్నారు. దాంతో ఆ రోజు మ్యాచ్‌కు తాము భద్రత కల్పించలేమని కర్ణాటక పోలీసులు ఆ రాష్ట్ర క్రికెట్ సంఘాని (కేసీఏ)కి తెలియజేశారు. ఆ విషయాన్ని బీసీసీఐకి చేరవేసిన కేసీఏ.. 24నాటి మ్యాచ్‌ను విశాఖకు తరలించి, 27న అక్కడ జరగాల్సిన రెండో టీ20ని తమకు కేటాయించాలని కోరింది. ఇందుకు అంగీకరించిన బీసీసీఐ.. ఈ మార్పును శనివారం ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా రెండు టీ20లు, ఐదు వన్డేలు ఆడనుంది.

ఈతలో ఖాజాకు 2 పతకాలు



ఇస్తాంబుల్: టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన ఇండో-టర్కీ ఇంటర్నేషనల్ వింటర్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ ఖాజా మొహియుద్దీన్ రెండు పతకాలు సాధించాడు. 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 50 మీటర్ల బటర్‌ఫ్లైలో కాంస్యం అందుకున్నాడు. ఖాజా నర్సరావుపేటలోని ఓ కళాశాలలో పీడీగా పనిచేస్తున్నారు.

తొలి టీ20 సఫారీలదే

కేప్ టౌన్: డుప్లెసిస్ (78), ఓపెనర్ హెండ్రిక్స్ (74) అర్ధ శతకాలతోపాటు మిల్లర్ అద్భుత ఫీల్డింగ్‌తో చెలరేగడంతో.. పాకిస్థాన్‌తో తొలి టీ20లో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఆరు పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసిన సౌతాఫ్రికా.. పాకిస్థాన్ వరుస తొమ్మిది టీ20ల విజయ పరంపరకు బ్రేక్ వేసింది. తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 192 పరుగులు చేసింది. ఛేదనలో పాక్ ఓవర్లన్నీ ఆడి 9 వికెట్లకు 186 పరుగులు మాత్రమే చేయగలిగింది. షోయబ్ మాలిక్ (49) టాప్ స్కోరర్. డేవిడ్ మిల్లర్ రెండు రనౌట్‌లతోపాటు నాలుగు క్యాచ్‌లు అందుకుని పాక్ గెలుపును అడ్డుకున్నాడు.

యూపీ శుభారంభం



ఖమ్మం స్పోర్ట్స్: జాతీయస్థాయి సీనియర్ మహిళల టీ-20లో ఉత్తర ప్రదేశ్ జట్టు బోణీ చేసింది. తొలుత ఉత్తరప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. అనంతరం 120 పరుగుల లక్ష్య ఛేదనలో కర్ణాటక 83 పరుగులకే ఆలౌటైంది. ఢిల్లీ, మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో ఢిల్లీ గెలుపొందింది.

ఇంగ్లండ్ 49/2

● విండీస్‌తో రెండో టెస్టు

నార్త్ సౌండ్: డారెన్ బ్రావో (50) అర్ధ శతకంతో ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో ఆతిథ్య వెస్టిండీస్ 119 పరుగుల ఆధిక్యం సాధించింది. అనంతరం బరిలోకి దిగిన ఇంగ్లండ్ కడపటి వార్తలందే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 2 వికెట్లకు 49 పరుగులతో ఆడుతోంది. డినెల్ (14), రూట్ క్రీజులో ఉన్నారు. ఓపెనర్ బర్న్స్ (16), బెయిర్‌స్టో (14)ను హోల్డర్ పెవిలియన్ చేర్చాడు. అంతకుముందు 272/6తో మూడో రోజైన శనివారం ఆటను ఆరంభించిన విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 306 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులు చేసింది. బ్రావోతోపాటు డౌరిచ్ (31), హెట్‌మయెర్ (21) ఇంగ్లండ్ బౌలర్లను విసిగించారు. స్టువర్ట్ బ్రాడ్, మొయిన్ అలీ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

స్మృతి..నెంబర్ వన్

ఐసీసీ బ్యాట్స్‌వుమెన్ ర్యాంకుల్లో అగ్రస్థానం



దుబాయ్: న్యూజిలాండ్‌తో తొలి రెండు వన్డేల్లో అదరగొట్టిన స్మృతీ మంధాన ఐసీసీ వన్డే తాజా ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానాన్ని చేజిక్కించుకుంది. కివీస్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో...తొలి వన్డేలో సెంచరీ (105), రెండో పోటీలో (90 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీ చేసిన స్మృతి (751 పాయింట్లు)..బ్యాట్స్‌వుమెన్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి నెంబర్‌వన్‌కు చేరింది. ఆస్ట్రేలియాకు చెందిన ఎలిస్ పెర్రీ (681), మెగ్‌లానింగ్ (675) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. న్యూజిలాండ్ కెప్టెన్ అమీ శాటర్త్‌వెయిట్ (669) పది స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌కు చేరింది. ఇక భారత్ కెప్టెన్ మిథాలీ రాజ్ (669) ఒక ర్యాంక్ దిగజారి ఐదో స్థానం దక్కించుకుంది.

అదరగొట్టే ఆటతో..: గతేడాది కాలంగా వన్డేల్లో స్మృతి కళ్లు చెదిరే ప్రదర్శన చేస్తోంది. 2018 ఆరంభం నుంచి 15 వన్డేలు ఆడిన మంధాన..రెండు సెంచరీలు, ఎనిమిది హాఫ్ సెంచరీలతో కదం తొక్కింది. స్మృతి ఓపెనింగ్ జోడీ, టీనేజర్ జెమీమా రోడ్రిగ్స్ (249) ఏకంగా 64 స్థానాలు ఎగబాకి 61వ ర్యాంక్ కైవసం చేసుకుంది. 2018 మార్చిలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన జెమీమా ఇప్పటివరకూ కేవలం ఏడు వన్డేలే ఆడింది. నేపియర్‌లో న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో అర్ధ శతకంతో ఆకట్టుకుంది.

జులన్‌కు నాలుగో ర్యాంక్..: రెండో వన్డేలో మూడు వికెట్లు (3/23) తీసి భారత విజయంలో కీలక భూమిక పోషించిన వెటరన్ పేసర్ జులన్ గోస్వామి (639) బౌలర్లలో నాలుగో ర్యాంక్ సాధించింది. ఇక ఈ విభాగంలో స్పిన్ త్రయం దీప్తి శర్మ, పూనమ్ యాదవ్, ఏక్తా బిస్త్ టాప్ టెన్‌లో నిలిచారు.. చెరో ఐదేసి స్థానాలు ఎగబాకిన పూనమ్ (581), దీప్తి (579) వరుసగా 8, 9 ర్యాంకుల్లో నిలిచారు. తొమ్మిది స్థానాలు ఎగబాకిన ఏక్తా (561)కు 13వ ర్యాంక్ లభించింది. శిఖా పాండే (514) 18, రాజేశ్వరీ గైక్వాడ్ (479) 23వ ర్యాంక్ దక్కించుకున్నారు. బౌలింగ్ విభాగంలో సనా మిర్ (పాకిస్థాన్), మేగన్ షట్ (ఆస్ట్రేలియా), మరియాని కాప్ (దక్షిణాఫ్రికా) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

ఐదు వన్డేల సిరీస్‌లో అంతా సాఫీగా సాగుతున్న వేళ.. సెడాన్ పార్క్‌లో భారత్‌కు గట్టిగానే ఝలక్ తగిలింది. స్వింగ్ బౌలింగ్‌ను ఎదుర్కోలేక ఒక్కో బ్యాట్స్‌మన్ పెవిలియన్ బాట పట్టడంతో సెంచరీ మార్కును కూడా చేరుకోలేకపోయింది. దీంతో వన్డే కెరీర్‌లోనే బంతుల పరంగా అత్యంత చెత్త ఓటమిని ఎదుర్కొన్న తర్వాత.. నేడు కివీస్‌తో చివరి వన్డేకు సిద్ధమైంది. లోపాలను సరిచేసుకుంటూ ప్రత్యర్థికి ఆఖరి పంచ్ ఇచ్చేందుకు సమాయత్తమైంది. అన్నింటికీ మించి ఎంఎస్ ధోనీ ఫిట్‌నెస్ సాధించడం టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. అటు కివీస్ మరో విజయంతో భారత్ ఆధిక్యాన్ని తగ్గించి సిరీస్‌ను కాస్త గౌరవంగా ముగించాలనుకుంటోంది.

ఆఖరి పంచ్ ఎవరిదో?

● న్యూజిలాండ్‌తో భారత్ చివరి వన్డే నేడు
● మ్యాచ్ బరిలోకి ధోనీ



ధోనీ

స్టార్ స్పోర్ట్స్ 1, 3లలో
ఉ. 7.30 నుంచి..

వెల్లింగ్టన్: తొలి మూడు వన్డేల్లో పటిష్ఠ జట్టుతో బరిలోకి దిగడంతో టీమిండియాలో ఎలాంటి లోపాలూ బయటపడలేదు. కానీ నాలుగో వన్డేలో ఆడిన తీరు ఒక్కసారిగా కుదుపునకు లోను చేసింది. స్వింగ్ బౌలింగ్ ధాటికి బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలడంతో అవమానకర ఓటమి ఎదురైంది. జట్టులో కోహ్లీ, ధోనీ లేకపోతే పరిస్థితి ఇంతేనా? అనే విమర్శలు ఎదురయ్యాయి. ప్రపంచకప్ జరిగే ఇంగ్లండ్‌లో కూడా ఇలాంటి పిచ్ పరిస్థితులే ఉండే నేపథ్యంలో గత మ్యాచ్‌లో భారత్ చెత్త ప్రదర్శన ఆందోళనకరమే. సిరీస్‌కు ఢోకా లేకపోయినా ఓడిన తీరే దారుణంగా ఉంది. ఈ పరిస్థితుల్లో వెస్ట్‌ప్యాక్ స్టేడియంలో ఆదివారం జరిగే చివరి మ్యాచ్‌కు సిద్ధమైంది. మరోవైపు భారత్‌ను మూడు విజయాల దగ్గరే నిలువరించాలని కివీస్ భావిస్తోంది. మరీ 1-4తో కాకుండా 2-3తో సిరీస్ ముగిస్తే పరువు దక్కించుకోవచ్చని ఆ జట్టు ఆలోచన. ఇక్కడి పిచ్ మరోసారి పేసర్లకు అనుకూలించనుంది.

ధోనీ వస్తున్నాడు..

సెడాన్ పార్క్‌లో జట్టు తొలి ఆరుగురు బ్యాట్స్‌మెన్ 35 పరుగులకే పెవిలియన్‌లో కూర్చోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను షాక్‌కు గురిచేసింది. ఓపెనర్లు విఫలమైన వేళ మిడిలార్డర్‌లో రాయుడు, జాదవ్, దినేశ్ కార్తీక్‌లలో ఒక్కరు కూడా క్రీజులో నిలవలేకపోయారు. ధోనీ ఉంటే ఇలాంటి స్థితి రాకపోయేదని అంతా భావించారు. ఇప్పుడు ఈ చివరి మ్యాచ్‌కు స్టార్ కీపర్ అందుబాటులో ఉంటాడని బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ వెల్లడించారు. తను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడని చెప్పడం అటు అభిమానులను కూడా సంతోషపెడుతోంది. అలాగే ఒక్క మ్యాచ్‌లో మిడిలార్డర్ విఫలమవడం ఆందోళనకరమేమీ కాదని బంగర్ భావిస్తున్నాడు. మరోవైపు ఈ మ్యాచ్‌లో రోహిత్, ధవన్‌ల నుంచి జట్టు శుభారంభాన్ని ఆశిస్తోంది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు మరో అవకాశం దక్కుతుందా.. లేక దినేశ్ కార్తీక్‌ను ఆడిస్తారా అనేది వేచిచూడాలి. హార్దిక్ పాండ్యా రెండు మ్యాచ్‌ల్లోనూ ఫర్వాలేదనిపించాడు. బౌలింగ్ విభాగం మెరుగ్గానే ఉండగా పేసర్ షమి ఈ మ్యాచ్ ఆడనున్నాడు. భువనేశ్వర్‌కు విశ్రాంతినివ్వనున్నారు. అలాగే విఫలమవుతున్న మరో పేసర్ ఖలీల్ అహ్మద్ స్థానంలో మహ్మద్ సిరాజ్‌ను పరీక్షించవచ్చు.

గప్టిల్ అవుట్

హ్యాట్రిక్ పరాజయాలతో ఉక్కిరిబిక్కిరైన కివీస్‌కు గత మ్యాచ్ విజయం ఊపిరిలూదింది. ఓపెనర్ మన్రో స్థానంలో జట్టులోకి వచ్చిన హెన్రీ నికోల్స్ 30 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ఆకట్టుకున్నాడు. స్పిన్ బౌలింగ్‌లో నికోల్స్‌తో పాటు వెటరన్ రాస్ టేలర్ సులువుగా పరుగులు సాధించారు. వీరి ధాటికి చాహల్ 16 బంతుల్లో 32 రన్స్ ఇచ్చుకున్నాడు. అయితే తుఫాన్ ఇన్నింగ్స్‌తో అలరించిన మార్టిన్ గప్టిల్ వెన్ను నొప్పి కారణంగా ఆఖరి మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవడం జట్టుకు ఎదురుదెబ్బే. అతడి స్థానంలో తిరిగి మన్రో ఆడవచ్చు. ఇక స్వింగ్‌కు అనుకూలించే పరిస్థితుల్లో తానే కింగ్‌నని ట్రెంట్ బౌల్ట్ ఐదు వికెట్లతో నిరూపించుకున్నాడు. గ్రాండ్‌హోమ్ భారత జట్టు మిడిలార్డర్‌ను దెబ్బతీశాడు. జేమ్స్ నీషమ్, స్పిన్నర్ టాడ్ ఆస్లే కూడా ఒక్కో వికెట్ తీసి విజయంలో పాత్ర పోషించారు. ఇదే జోరుతో భారత్‌పై మరో దెబ్బ వేయాలని జట్టు భావిస్తోంది.

2014లో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో భారత్ 84 పరుగుల తేడాతో ఓడింది. అయితే కివీస్ ఈ మైదానంలో ఆడిన చివరి మూడు మ్యాచ్‌ల్లోనూ పరాజయం పాలైంది.

వెస్ట్‌ప్యాక్ స్టేడియంలో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో పేసర్ సౌథీ 25 వికెట్లు తీయగా, బౌల్ట్ ఆరు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు పడగొట్టాడు.



జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ధవన్, శుభ్‌మన్ గిల్/దినేశ్ కార్తీక్, రాయుడు, ధోనీ, కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్/షమి, చాహల్, కుల్దీప్, ఖలీల్/సిరాజ్.
కివీస్: నికోల్స్, మన్రో, విలియమ్సన్ (కెప్టెన్), టేలర్, లాథమ్, గ్రాండ్‌హోమ్, నీషమ్, బ్రేస్‌వెల్/శాంట్నర్, ఆస్లే, సౌథీ, బౌల్ట్.

పుజారా X ఉమేష్

సౌరాష్ట్రతో విదర్భ రంజీ ఫైనల్ నేటి నుంచే
ఉ. 9 గం. నుంచి
స్టార్‌స్పోర్ట్స్ 2లో..

నాగపూర్: దేశవాళీ మెగా టోర్నీ రంజీ ఫైనల్లో డిఫెండింగ్ చాంప్ విదర్భతో సౌరాష్ట్ర తలపడనుంది. ఆదివారం నుంచి జరిగే ఈ మ్యాచ్‌లో జాతీయ జట్టు ఆటగాళ్లు చటేశ్వర్ పుజారా, పేసర్ ఉమేష్ యాదవ్ మధ్య ఆసక్తికర పోరు నడిచే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో వెటరన్ వసీమ్ జాఫర్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. పుజారా జట్టులో ఉండడం సౌరాష్ట్రకు ప్లస్ కాగా.. జాఫర్ విదర్భ బ్యాటింగ్‌కు అండగా నిలుస్తున్నాడు. సౌరాష్ట్రతో పోల్చితే విదర్భ బౌలింగ్ బలంగా కనిపిస్తోంది. ఫ్లాట్‌పిచ్‌లపై మంచి రికార్డున్న ఉమేష్.. గత రెండు మ్యాచ్‌ల్లోనే 21 వికెట్లు పడగొట్టాడు. కేరళతో సెమీస్‌లో 12 వికెట్లు కూల్చిన ఉమేష్.. ఒంటి చేత్తో విదర్భను ఫైనల్ చేర్చాడు.



జాఫర్‌తో పుజారా



ముంబైలో శనివారం జరిగిన ఓ ఫ్యాషన్ షోలో సైనా నెహ్వాల్ ర్యాంప్ వాక్

కొచ్చి బ్లూ జిగేల్

తొలి మ్యాచ్‌లో యు ముంబాపై ఘన విజయం ● ప్రొ.వాలీబాల్ లీగ్



కొచ్చి: సొంత ప్రేక్షకుల మధ్య కొచ్చి బ్లూ స్పైకర్స్ అదరగొట్టింది. ప్రొ.వాలీబాల్ లీగ్‌లో ఘనమైన బోణీ కొట్టింది. శనివారం జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో కొచ్చి 4-1 (15-11, 15-13, 15-8, 15-10, 5-15)తో యు ముంబా వాలీపై ఘన విజయం సాధించింది. తద్వారా రెండు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. కొచ్చి జట్టులో మనూ జోసెఫ్ 15 పాయింట్ల (14 స్పైక్స్, 1 బ్లాక్)తో సత్తా చాటాడు. యు ముంబాలో అటాకర్ నికొలాస్ డెల్ బియాంకో అత్యధికంగా 10 (9 స్పైక్స్, 1 బ్లాక్) పాయింట్లు స్కోర్ చేశాడు. ఆరంభంనుంచే కొచ్చి బ్లూస్ రెచ్చిపోయింది. ముఖ్యంగా కొచ్చి స్టార్ ఆటగాడు, బ్లాకర్ డేవిడ్ లీ స్పైక్స్, బ్లాక్స్, సర్వ్‌లతో తొలి సెట్‌లో జట్టుకు వడివడిగా పాయింట్లు సాధించాడు. మొదటి టెక్నికల్ టైమౌట్ (టీటీఓ)కే 8-5తో ఆధిక్యంలో నిలిచిన స్పైకర్స్ డిఫెన్స్, అటాకింగ్‌లో పైచేయి ప్రదర్శించి వరుసగా రెండు పాయింట్లు నెగ్గి 10-5కు దూసుకు పోవడంతోపాటు ఆపై 15-11తో తొలి సెట్‌ను చేజిక్కించుకుంది. అదే ఊపులో తదుపరి మూడు సెట్లను కొచ్చి గెలుపొందింది. అయితే ఆఖరి సెట్‌లో విజృంభించిన ముంబై.. ఆ సెట్‌ను నెగ్గి ఒకింత ఊరట దక్కించుకుంది. అంతకుముందు లీగ్ ఘనంగా ఆరంభమైంది.

ప్యాటర్సన్ శతకం

● ఆస్ట్రేలియా 534/5 డిక్లేర్డ్
● శ్రీలంక 123/3

కాన్‌బెర్రా: కుర్తీస్ ప్యాటర్సన్ (114 నాటౌట్) శతకంతో సత్తా చాటడంతో.. శ్రీలంకతో రెండో టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా పటిష్ఠ స్థితిలో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. 384/4తో రెండో రోజైన శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 534/5 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన లంక.. ఆట ముగిసే సమయానికి 123/3తో ఆడుతోంది. పెరీరా (11), ధనంజయ డిసిల్వ (1) క్రీజులో ఉన్నారు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు లంక ఇంకా 411 పరుగులు వెనుకబడి ఉంది. ఓపెనర్ దిముత్ కరుణరత్నే (46 రిటైర్డ్‌హర్ట్) గాయపడడం అందరినీ కలవరపాటుకు గురి చేసింది. 31.4 ఓవర్‌లో కమిన్స్ వేసిన బంతి కరుణరత్నే హెల్మెట్ వెనుక బలంగా తాకడంతో.. అతడు విలవిల్లాడుతూ క్రీజులో కుప్పకూలాడు. ప్రాథమిక చికిత్స అనంతరం తక్షణం అతడిని ఆసుపత్రికి తరలించారు. కరుణరత్నేకు ఎటువంటి ప్రమాదం లేదని, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడని లంక బోర్డు ప్రకటించింది.

భారత ఆశలు ఆవిరి

● 1-3తో ఇటలీ చేతిలో ఓటమి ● డేవిస్ కప్

కోల్‌కతా: డబుల్స్‌లో బోపన్న జోడీ భారత ఆశలను సజీవంగా ఉంచినా.. రివర్స్ సింగిల్స్ తొలి మ్యాచ్‌లో ఓటమితో డేవిస్ కప్‌లో భారత్‌కు నిరాశ తప్పలేదు. ఇటలీతో డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌లో భారత్ 1-3తో పరాజయం పాలైంది. ఈ విజయంతో ఇటలీ తొలిసారి డేవిస్ కప్ వరల్డ్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. తొలి రోజు 0-2తో వెనుకబడిన భారత్.. మ్యాచ్‌లో నిలవాలంటే తప్పని సరిగా నెగ్గాల్సిన డబుల్స్‌ను కైవసం చేసుకుంది. శనివారం తొలి మ్యాచ్‌గా డబుల్స్‌లో రోహన్ బోపన్న-దివిజ్ శరణ్ జోడీ 4-6, 6-3, 6-4తో సిమోన్ బొలెల్లీ-మాటో బెర్రెట్టినిపై గెలిచి భారత్‌ను 1-2తో నిలబెట్టింది. కానీ, ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. తొలి రివర్స్ సింగిల్స్‌లో భారత టాప్ ప్లేయర్ ప్రజ్ఞేష్ గుణేశ్వరన్ 1-6, 4-6తో ఆండ్రేస్ సెప్పి చేతిలో వరుస సెట్లలో ఓడడంతో భారత పరాజయం ఖరారైంది.



ఓటమి నిరాశలో భారత జట్టు కెప్టెన్ మహేశ్ భూపతి



చిరుత కూన.. బ్యాంకాక్ టూ చెన్నై

ఈ చిరుతపులి పిల్లను చెన్నై ఎయిర్‌పోర్టులో కస్టమ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. థాయిలాండ్ నుంచి వచ్చిన ఖాజా మొయినుద్దీన్(45) బ్యాగ్‌లో దీనిని గుర్తించారు. 1100 గ్రాముల బరువు, 54 సెంటీమీటర్ల పొడవున్న ఈ బుల్లి చిరుత ఆరోగ్యంగా ఉందని అర్రెంగర్ అన్నా జూ పార్క్ వైద్యుడు తెలిపారు. చిరుతపులి పిల్లను అక్రమంగా తరలిస్తున్న మొయినుద్దీన్‌పై వన్యప్రాణుల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌లో 'యూత్ కుంభ్' పేరుతో వారం రోజుల పాటు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. శనివారం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా.. యోగా గురువు బాబా రామ్‌దేవ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురువు శ్రీశ్రీ రవిశంకర్, మరో ఇద్దరు సాధువులు కలిసి కర్మయోగాలో భాగంగా నృత్యం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత 'సెల్ఫీ పాయింట్' ఆలోచన నుంచి సెల్ఫ్ ఈజ్ పాయింట్ (ఆత్మజ్ఞానం) దిశలో అడుగులు వేయాలని సూచించారు.

బెంగాల్లో మోదీ X దీదీ

మమత కార్యదర్శిని అరెస్ట్ చేసిన సీబీఐ

- దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి: సీఎం
- ఏ తప్పూ చెయ్యకపోతే భయమెందుకు?
- సీఎంగా నన్నూ ప్రశ్నించారు: పీఎం




(ఫైల్)

కోల్‌కతా, ఫిబ్రవరి 2: పశ్చిమబెంగాల్‌లో మూడు రోజులుగా తీవ్రస్థాయి రాజకీయ యుద్ధం సాగుతోంది. శనివారం నాటి ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల సభలతో మరింత వేడెక్కిపోయింది. అటు మోదీ, ఇటు దీదీ పరస్పర సవాళ్లకు దిగారు. మమతా బెనర్జీ సన్నిహితుడు, ఒకప్పటి వ్యక్తిగత కార్యదర్శి మాణిక్ మజుందార్‌ను, పార్టీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్, పార్టీ ప్రధాన కార్యదర్శి సుబ్రతా బక్షీలను సీబీఐ ఇంటరాగేట్ చెయ్యడం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పత్రిక 'జాగో బంగ్లా' డిపాజిట్లపై దర్యాప్తు జరపడాన్ని మమత సహించలేకపోయారు. ఎంతో కాలంగా నమ్మినబంటుగా ఉన్న మాణిక్ మజుందార్‌ను పిలిపించి.. గంటల తరబడి ప్రశ్నించడం ఆమెకు ఆగ్రహం తెప్పించింది. "మోదీజీ.. దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి.. పరోక్షంగా వేధించడం కాదు" అని ఆమె ఘాటుగా అన్నారు. "ఆఫీసర్లను నేను తప్పుబట్టను. వారిని ఇంటికి పిలిపించి మరీ ప్రధాని ఆదేశాలిస్తున్నారు, విపక్ష నేతలపై ఫలానా కేసులు బనాయించండని చెబుతున్నారు. 40 ఏళ్లుగా నా వెన్నంటి ఉన్న వారినెందుకు వేధిస్తున్నారు? నాకు టీ అందించేవారినీ పిలిపించి అవమానిస్తున్నారు, వేధిస్తున్నారు" అని దుమ్మెత్తిపోసిన ఆమె -'నాకు వంట చేసి పెట్టే వంటమనిషిని కూడా కేంద్ర సంస్థలు వదలవేమో... అతనిని ప్రశ్నించే రోజుకోసం చూస్తున్నా' అని హేళనగా సవాల్ విసిరారు. "మేం నిర్మల హృదయంతో రాజకీయాలు చేస్తున్నాం. మీరు వ్యక్తిగతంగా వెళుతున్నారు. రాజకీయంగా మమ్మల్ని ఎదుర్కోలేక వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టజూస్తున్నారు" అని ఆమె దుయ్యబట్టారు. రెండు బహిరంగ సభల్లో మాట్లాడిన మోదీ ఆమెకు కౌంటర్ ఇచ్చారు. "ఒకవేళ దీదీ ఏ తప్పూ చెయ్యకపోతే ఎందుకు భయపడుతున్నారు? దేన్ని చూసి మీకు భయం? కేంద్ర సంస్థల అధికారులను ఎందుకు అడ్డుకుంటున్నారు? నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యూపీఏ ప్రభుత్వం నాపై కేసులు పెట్టినపుడు నేను తొమ్మిది గంటలపాటు సీబీఐ కార్యాలయంలో ఉండి విచారణను ఎదుర్కొన్నాను. నేను ఆ సంస్థపై దాడిచెయ్యలేదే? మీరు మరిన్ని సంస్థలను తీసుకువచ్చి నన్ను ప్రశ్నించండి. నేను నిజాయితీపరుణ్ని.. నాకేమీ భయంలేదని వారికి చెప్పాను" అన్నారాయన. మమత ఆధ్వర్యంలో జనవరి 19న జరిగిన ర్యాలీపై దుర్గాపూర్ సభలో విమర్శలు గుప్పించిన మోదీ- "నేను అవినీతిపై పోరాడుతున్నాను. అందుకే అందరికీ నేనంటే భయం. ఆ సభలో పాల్గొన్న విపక్ష నేతల ఫోటోలు, వారి ముఖాలు చూడండి.. అందరిలో వణుకు.... ఎందుకు?" అని ఆయన అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని బెంగాల్ ప్రభుత్వం అమలుపర్చకపోవడంపై స్పందిస్తూ- 'ఆ పథకంలో చేరితే ఓట్లు మాకెక్కడ పడతాయోనన్న భయమే తప్ప పేదల వైద్యం గురించి ఆమెకు పట్టదు. ఇంత హృదయం లేని ప్రభుత్వాన్ని నేనెక్కడా చూడలేదు. మా మీద ద్వేషంతో మమత నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఆమెను సాగనంపడం తథ్యం" అని వ్యాఖ్యానించారు. బెంగాల్లో తృణమూల్ హింసా రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్యం గొంతు నులిమేస్తోందని ధ్వజమెత్తారు. దీనిపై మమత మీకంటే ఫాసిస్టు ఇంకెవరున్నారని విమర్శించారు. శారదా పొంజి స్కాంపై మాణిక్ మజుందార్, డెరిక్ ఒబ్రెయిన్‌లను, జాగో బంగ్లా డిపాజిట్లపై బక్షిని సీబీఐ ప్రశ్నించింది. సీబీఐ దాడులు జరుగుతాయన్న విషయాన్ని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కొద్ది రోజుల కిందటే సంకేతప్రాయంగా చెప్పడం, ఆ తరువాత దాడులు జరగడం ఇందులోని రాజకీయ కోణాన్ని బయటపెట్టాయి.

కోరేగావ్ అల్లర్ల కేసులో దళిత ప్రొఫెసర్ అరెస్టు

- కోర్టు ఆదేశంతో విడుదల
- నక్సల్స్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపణ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: మావోయిస్టుల మద్దతుతో ఎల్గార్ పరిషత్ సమావేశం నిర్వహించి, ప్రజలను రెచ్చగొట్టి 2017లో కోరేగావ్-భీమా అల్లర్లకు కారణమయ్యాడన్న ఆరోపణలపై దళిత ప్రొఫెసర్ ఆనంద్ తెల్‌తుంబ్డేను మహారాష్ట్ర పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కొన్ని గంటల తర్వాత కోర్టు జోక్యంతో విడిచిపెట్టారు. గోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్ అయిన ఆనంద్‌ను శనివారం తెల్లవారుజామున ముంబై ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. తెల్‌తుంబ్డేను ఫిబ్రవరి 11 వరకు అరెస్టు చేయవద్దంటూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో ఆయన అరెస్టు చట్టవిరుద్ధమని అదనపు సెషన్స్ జడ్జి పేర్కొన్నారు. ఆయన్ని వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. కాగా, తనపై ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని పెట్టుకున్న దరఖాస్తును సుప్రీంకోర్టు తోసిపుచ్చడంతో ఆనంద్ ముందస్తు బెయిలు కోసం పుణె సెషన్స్ కోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, న్యాయస్థానం ఆయన అభ్యర్థనను తోసిపుచ్చింది. ఆయనకు ముందస్తు బెయిలు దొరక్కపోవడంతో అరెస్టు చేశామని పుణె ఏసీపీ శివాజీ పవార్ చెప్పారు. ఆయనకు నక్సల్స్‌తో సంబంధాలు ఉన్నాయని నిరూపించేందుకు గట్టి ఆధారాలు దొరికాయని పోలీసులు చెబుతున్నారు.

తుంబ్డే అరెస్టు అప్రజాస్వామికం: హరగోపాల్

నల్లకుంట/హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ మనువడు, రచయిత, ప్రొఫెసర్ ఆనంద్ తెల్ తుంబ్డే అరెస్టు అప్రజాస్వామికమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ముంబై ఎయిర్‌పోర్టులో ఆయనను పుణే పోలీసులు అరెస్టు చేయడాన్ని అందరూ ఖండించాలన్నారు. శనివారం హైదర్‌గూడలోని కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుంబ్డేతో పాటు పలువురు ప్రజాస్వామికవాదులపై పెట్టిన కేసులు కొట్టివేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా, తుంబ్డే అరెస్టు మోదీ ప్రభుత్వ కుట్రలో భాగమేనని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి డి.వి.కృష్ణ, సహాయ కార్యదర్శి పి.రంగారావు ఓ ప్రకటనలో విమర్శించారు. కోరేగావ్ ఘటనలో వారి పాత్ర ఉందని, మోదీ హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణపై ఉపా చట్టం మోపడానికి ప్రయత్నిస్తున్నారన్నారు.

ఏ క్షణానైనా మంత్రి డీకే అరెస్టు!


- 15 రోజుల కిందటే ఈడీ సమన్లు



బెంగళూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంకీర్ణ ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న డీకే శివకుమార్‌తో పాటు ఆయన అనుచరులు అయిదుగురిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు ఏ క్షణంలోనైనా అరెస్టు చేయవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జనవరి 17నే ఈడీ సమన్లు జారీ చేసింది. ఇవి జారీ అయి 15 రోజులు దాటిన నేపథ్యంలో ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చని తెలుస్తోంది. దీంతో మంత్రి డీకేని అరెస్టు భయం వెంటాడుతోంది. అక్రమ నగదు బదిలీకి సంబంధించి జలవనరుల శాఖ మంత్రిగా ఉన్న డీకేని ఆదాయపు పన్నుల శాఖతో పాటు ఈడీ గతంలో విచారించాయి. మంత్రితో పాటు సచిన్ నారాయణ, సునీల్‌శర్మ, ఆంజనేయ, రాజేంద్రలకు నోటీసులు జారీ చేశాయి. డీకే అరెస్టు అనివార్యమైతే.. రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వానికి చిక్కులు తప్పవని అంటున్నారు.

బాత్‌రూంలో జారిపడ్డ దేవెగౌడ

- కుడికాలికి గాయం, ఆస్పత్రికి తరలింపు



బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ శనివారం బెంగళూరు పద్మనాభనగర్‌లోని తన ఇంటి బాత్‌రూంలో జారిపడ్డారు. కుడికాలు వాపు రావడంతో స్థానిక జయదేవ్ ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో దేవెగౌడ మీడియాతో మాట్లాడుతూ పెద్దప్రమాదం లేదని, కుడికాలు బెణికిందని వివరించారు. 85వ పడిలో పడిన ఆయనకు కొంతకాలం విశ్రాంతి అవసరమని కుటుంబ సభ్యులు వివరించారు. మరో రెండు రోజుల్లో లోక్‌సభ సమావేశాలకు వెళ్లాలని భావిస్తున్న తరుణంలోనే ఆయన జారిపడడం గమనార్హం. కాగా, ఈ విషయం తెలియగానే జేడీఎస్ నాయకులు హుటాహుటిన పద్మనాభనగర్‌కు తరలివెళ్లారు.

పౌరసత్వ బిల్లు తక్షణ అవసరం: మోదీ

- మద్దతివ్వాలని తృణమూల్‌కు పిలుపు
- 30లక్షల వలసదారులకు ప్రధాని వల
- బంగ్లా సరిహద్దులు మూసేస్తాం: రాజ్‌నాథ్
- మమతను కార్నర్ చేస్తున్న బీజేపీ

కోల్‌కతా, ఫిబ్రవరి 2: బెంగాల్లో మమతా బెనర్జీని పూర్తి ఇరకాటంలోకి నెట్టడానికి బీజేపీ సకల ప్రయత్నాలూ చేస్తోంది. ఇందులో భాగంగా పౌరసత్వ బిల్లుకు ఆమోదం.. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసల నిరోధం.. అనే ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. వలసలు ఆపేందుకు పశ్చిమ బెంగాల్, అసోంల్లో ఉన్న బంగ్లా సరిహద్దులను మూసేస్తామని, ఇందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తామని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. 24-పరగణాల జిల్లాలోని ఠాకూర్‌నగర్‌లో- భారీ బహిరంగసభలో మాట్లాడిన మోదీ- పౌరసత్వ సవరణ బిల్లుకు మద్దతివ్వాలని తృణమూల్‌ను కోరుతూ దేశ భద్రత రీత్యా ఇది అవసరమని చెప్పారు. 50ల్లో మతహింసను భరించలేక తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్) నుంచి వలసొచ్చిన మతువాలు శరణార్థులే కాక బెంగాల్లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు. వీరి సంఖ్య దాదాపు 30 లక్షలదాకా ఉంటుంది. ఐదు లోక్‌సభ నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఉంది. అందుకే ఈ బహిరంగసభ పేరు కూడా "మతువా మహా సంఘ్ ర్యాలీ" అని పేరు పెట్టారు.

మధ్యలోనే ప్రసంగం ముగించిన ప్రధాని

ఈ భారీ బహిరంగ సభలో స్వల్ప తొక్కిసలాట జరిగింది. ప్రాణనష్టం జరగలేదు గానీ కొంతమంది గాయపడ్డారు. ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. మహిళలు, పిల్లలు తలోదిక్కూ అయ్యారు. ప్రధాని ప్రసంగిస్తున్న వేదిక వద్దకు ప్రజలు ఒక్కపెట్టున తరలిరావడంతో వారిని నిలువరించడం పోలీసులకు, సాయుధ దళాలకు కష్టమయ్యింది. దాంతో మోదీ ప్రసంగాన్ని మధ్యలో ముగించి, వెళ్లిపోవాల్సి వచ్చింది.

సీబీఐ కొత్త బాస్‌గా రిషి కుమార్ శుక్లా

- మధ్యప్రదేశ్ మాజీ డీజీపీకి చాన్స్
- మోదీ కమిటీ మెజారిటీ నిర్ణయం
- నియామకాన్ని వ్యతిరేకించిన ఖర్గే
- 3 రోజుల క్రితమే డీజీపీగా ఉద్వాసన
- కాంగ్రెస్ నిర్ణయం కలిసొచ్చిన వైనం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సీబీఐ డైరెక్టర్‌గా మధ్యప్రదేశ్ మాజీ డీజీపీ రిషి కుమార్ శుక్లా నియమితులయ్యారు. ఆయన్ను రెండేళ్ల స్థిర కాలపరిమితికి సీబీఐ డైరెక్టర్‌గా నియమించినట్లు శనివారం కేంద్ర సిబ్బంది శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 1983 బ్యాచ్ మధ్యప్రదేశ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన శుక్లా పదవీకాలం ఆగస్టు 2020 వరకు ఉంది. అయితే, సీబీఐ డైరెక్టర్‌గా నియమితులు అయ్యాక రెండేళ్ల పాటు ఆయన్ను తొలగించేందుకు అవకాశం లేదు. ఆ విధంగా చూస్తే 2021 ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆయన డైరెక్టర్ పదవిలో కొనసాగనున్నారు. మధ్యప్రదేశ్ డీజీపీగా పనిచేసిన ఆయనకు గత అక్టోబరులో హృద్రోగ సమస్య రావడంతో సెలవు మీద వెళ్లారు. అనంతరం మధ్యప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఆయన్ను డీజీపీ బాధ్యతల నుంచి తప్పించి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించింది. శుక్రవారం ప్రధాని నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ సమావేశమై కొత్త డైరెక్టర్‌ను ఎంపిక చేసింది. ప్రధాని నివాసంలో జరిగిన కమిటీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే ఒక్కరే శుక్లా నియామకాన్ని వ్యతిరేకించారు. ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుకూలంగా ఓటేయడంతో 2:1 మెజారిటీతో నిర్ణయం తీసుకున్నారు. శుక్లాకు ఇంటెలిజెన్స్ బ్యూరోలో పని చేసిన అనుభవం ఉంది. ఆయన ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల్లోనూ పాల్పంచుకున్నారు.

మార్చి 31 లోగా పెట్టుబడి సాయం

- చిన్న, సన్నకారు రైతుల వివరాలివ్వండి
- రాష్ట్రాలకు నీతి ఆయోగ్ లేఖలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: రైతు సంక్షేమానికి మోదీ సర్కారు ప్రకటించిన పెట్టుబడి సాయం తొలి కిస్తీని మార్చి 31లోగా అందజేస్తామని నీతి ఆయోగ్ ప్రకటించింది. ఈ మేరకు చిన్న, సన్నకారు రైతుల వివరాల కోసం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖలు రాసింది. "ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి అర్హులైన రైతుల జాబితా పంపాలని రాష్ట్రాలను కోరాం. చాలా రాష్ట్రాల్లో భూరికార్డులు డిజిటలైజ్ అయ్యాయి. రైతుల వివరాలు అందాక.. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆ జాబితాను ప్రదర్శిస్తాం" అని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ వివరించారు. "ఈశాన్యంలో భూయాజమాన్య హక్కుల వివరాలు కమ్యూనిటీ వారీగా ఉంటాయి. అందుకే.. ప్రభుత్వం కేంద్ర మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి, అర్హులను గుర్తించే ప్రయత్నాలు చేయనుంది" అని వెల్లడించారు.

అమలుపై నిపుణుల సందేహం

ఈ పథకం అమలుపై నిపుణులు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. శనివారం కోల్‌కతాలో మర్చంట్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో.. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఎన్‌కే పొద్దార్ మాట్లాడుతూ.. "లబ్ధిదారులను గుర్తించడం అంత సులభం కాదు. టైటిల్ డీడ్‌లో పేరున్నంత మాత్రాన భూమి యజమాని అని చెప్పలేమని సుప్రీంకోర్టు గతంలో వ్యాఖ్యానించింది" అని గుర్తుచేశారు. జాదవ్‌పూర్ వర్సిటీలో అర్థశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శశికాంత్ సిన్హా రాయ్ మాట్లాడుతూ.. డబ్బు బదిలీ కాకుండా.. ఇన్‌పుట్ సబ్సిడీగా ఆ మొత్తం ఇస్తే బాగుండేదన్నారు.



ఢిల్లీలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్

అప్నీ బాత్ రాహుల్ కే సాత్

- ఏడుగురు విద్యార్థులకు రాహుల్ ప్రత్యేక విందు
- జాతీయ సమస్యలు, పరిష్కారాలపై చర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: 'అప్నీ బాత్ రాహుల్ కే సాత్' పేరుతో రాహుల్ గాంధీ వివిధ రాష్ట్రాలకు చెందిన ఏడుగురు యువ విద్యార్థులతో ఢిల్లీలో శుక్రవారం రాత్రి ముచ్చటించారు. రాహుల్ గాంధీ ఈ ఏడుగురు విద్యార్థుల కోసమే ప్రత్యేకంగా ఢిల్లీలోని ఓ హోటల్‌లో విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో అసోం, మహారాష్ట్ర, ఢిల్లీ, కేరళ, యూపీకి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. దేశంలోని వివిధ సమస్యలు, వాటి పరిష్కారంపై రాహుల్ ఈ సందర్భంగా మాట్లాడినట్లు విద్యార్థులు తెలిపారు. విద్యా వ్యవస్థలో అసమానతలు, కుల వివక్ష ప్రధానంగా చర్చకు వచ్చిందని, రాహుల్ గాంధీ చాలా ఓపిగ్గా తమ అభిప్రాయాలను తెలుసుకున్నారని వారు చెప్పారు. ఈ చర్చ దాదాపు రెండు గంటల పాటు సాగింది. ప్రధాని మోదీ మన్ కీ బాత్, పరీక్షా పే చర్చలను కాపీ కొట్టినట్లు రాహుల్ గాంధీ నిర్వహించిన కార్యక్రమం ఉందని విమర్శకులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.